ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి


www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

శనివారం 21.11.2026 | సంపుటి:13 సంచిక:121 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్





తీరం దాటిన 'అక్వాన్'

ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరాన్ని దాటిన తీవ్ర తుపాను

అమరావతి(జనంసాక్షి): బంగాళాఖాతంలో ఏర్పడిన 'అక్వాన్' తీవ్ర తుపాను తీరం దాటింది. ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరాన్ని దాటినట్లు వాతావరణశాఖ వెల్లడించింది. ఈ సమయంలో గాలి వేగం గంటకు 70-80 కి.మీ.. అప్పుడప్పుడూ

మిగతా 2లో..

అందుబాటులోకి.. స్వదేశీ బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్

భోపాల్‌లో ఆవిష్కరించిన కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్



ఓట్ల కోసమే భాజపా మతరాజకీయాలు

దమ్ముంటే అమిత్‌షా ఓవైసీ మీద పోటీచేయాలి

నా కథలో కేసీఆర్ 'రావణాసురుడు'.. కేటీఆర్ 'మేనేజ్‌మెంట్ కోటా' నేత



- ఆ రెండు పార్టీలతో పేదలకు... దేశ ప్రజలకు ఎటువంటి లాభం లేదు
- డీలిమిటేషన్‌తో దక్షిణాది ప్రాధాన్యానికి గొడ్డలిపెట్టు
- ఏబీపీ న్యూస్ 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు నిజంగా ధైర్యం ఉంటే హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి స్థానిక ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని ఓడించాలి.కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకుని వెళ్తోంది.లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను పెంచితే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది అవసరం లేకుండా పోతుంది.ఇది దక్షిణ భారత ప్రాధాన్యాన్ని తుడిచిపెట్టే కుట్ర.. మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలంటే చట్టాలు, రాజ్యాంగాన్ని మార్చాల్సిన పనిలేదని, ఉన్న 543 సీట్లలోనే 181 సీట్లను మహిళలకు కేటాయించవచ్చు.తెలంగాణలో మాకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీఆర్ఎస్సే.. రాష్ట్రంలో బీజేపీకి ఉనికి లేదు. నా రామాయణ కథలో కేసీఆర్ 'రావణాసురుడు' అయితే కేటీఆర్ 'మేనేజ్‌మెంట్ కోటా' నేత - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

రూ.20 వేల కోట్లతో పట్టణాల అభివృద్ధి

అధికారులతో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హైదరాబాద్(జనంసాక్షి): కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు నిజంగా ధైర్యం ఉంటే హైదరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి స్థానిక ఎంపీ అసదుద్దీన్ ఓవైసీని ఓడించాలని తెలంగాణ

2లో.. మిగతా 2లో..

ఆరు దశల్లో భూముల రీ సర్వే



తెలంగాణ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో భూముల రీ సర్వేపై రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. క్షేత్ర స్థాయిలో సర్వే అధికారులు పాటించాల్సిన మార్గదర్శకాలతో కూడిన ఉత్తర్వులను సీసీఎల్ఎ కమిషనర్ లోకేశ్ కుమార్ జారీ చేశారు. గ్రామాల వారీగా భూ రీసర్వే నిర్వహణ, భూముల కొలతలు, రికార్డులు సరిచూడటం, అభ్యంతరాల పరిష్కారం, తుది రికార్డుల ఖరారు కోసం ఆరు దశల విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించింది. ప్రధానంగా సర్వేకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవడం, సర్వే చేసిన విస్తీర్ణాన్ని రైతులకు తెలియజేయడం, తహసీల్దార్ స్థాయిలో పరిశీలన, వెరిఫికేషన్, గ్రామస్థాయి క్యాంపులు, వివాదాల పరిష్కారానికి ప్రయత్నం చేయడం లాంటివి అధికారులు తప్పకుండా పాటించాలన్నారు. సర్వేకు నాలుగు రోజుల ముందే రైతులకు నోటీసులు ఇవ్వాలని, సర్వేకు రెండు రోజుల ముందే పట్టాదారులకు ఫ్లాగ్స్ అందించాలని, సర్వే పూర్తయిన వెంటనే కొలిచిన విస్తీర్ణాన్ని రైతులకు తెలియజేయాలని సూచించారు. పహాణీ విస్తీర్ణానికి, వాస్తవ కొలతలకు తేడా లుంటే వెంటనే పట్టాదారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తేడాలకు

మిగతా 2లో..

చుక్కా రామయ్య పుట్టినరోజు విద్యావ్యవస్థకే గొప్పపండుగ

విద్యార్థుల ఐఐటీ కల సాకారం చేసిన మహనీయుడు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): చదువుల తల్లి చల్లని ఒడిలో ఎదిగే వారికి ఎల్లలు లేవని నిరూపించిన ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య వందో జన్మదినం సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా మంత్రులు, వివిధ పార్టీల నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు. చుక్కా రామయ్య వందో జన్మదినం తెలంగాణ విద్యా వ్యవస్థకు పండుగ రోజని సీఎం రేవంత్ అన్నారు. ఐఐటీ అనే పదాన్ని తెలుగు విద్యార్థుల చెంతకు చేర్చడమే కాకుండా... వేలాది

మిగతా 2లో..

అమెరికా, రష్యా, చైనా మధ్య చర్చల్లో భారత్ లేకపోవడం

దురదృష్టకరం



- బలహీనమైన ప్రధానే దీనికి కారణం
- కాంగ్రెస్ అధికారంలో ఉంటే.. అక్కడ భారత్ కూడా ఉండేది
- ఉగ్రవాదాన్ని వీడినప్పుడే భారత్-పాక్ మధ్య చర్చలు జరుగుతాయి : రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ(జనంసాక్షి): అమెరికా, రష్యా, చైనాల మధ్య జరిగిన త్రైపాక్షిక శిఖరాగ్ర సమావేశానికి సంబంధించిన చిత్రాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఒకవేళ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే.. భారత ప్రధాన మంత్రి కూడా ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్‌తో సహా ఈ బల్లపై కూర్చునేవారని వ్యాఖ్యానించారు. దేశ ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ అగ్రరాజ్యంతో రాజీ పడ్డారని విమర్శలు గుప్పించారు. ఇతర దేశాలకు లోబడి ఉన్నంత కాలం భారత ప్రధాని ఈ భేటీలో పాల్గొనలేరని దుయ్యబట్టారు. జాతీయ ప్రయోజనాలను కేంద్రం రోజువారీగా తాకట్టు పెడుతోందని.. 'విశ్వగురు' అనే ప్రచారంతో నిజాలను కప్పిపుచ్చుతోందని విమర్శించారు. షికాగో విశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో ఓ పాకిస్థానీ విద్యార్థి మాట్లాడుతూ

మిగతా 2లో..

ఒకవేళ దేశంలో కాంగ్రెస్ అధికారంలో ఉంటే.. భారత ప్రధాన మంత్రి కూడా ట్రంప్, పుతిన్, జిన్‌పింగ్‌తో సహా ఈ బల్లపై కూర్చునేవారు. దేశ ప్రయోజనాల విషయంలో ప్రధాని మోదీ అగ్రరాజ్యంతో రాజీ పడ్డారు. ఇతర దేశాలకు లోబడి ఉన్నంత కాలం భారత ప్రధాని ఈ భేటీలో పాల్గొనలేరు. జాతీయ ప్రయోజనాలను కేంద్రం రోజువారీగా తాకట్టు పెడుతోంది.. 'విశ్వగురు' అనే ప్రచారంతో నిజాలను కప్పిపుచ్చుతోంది

- రాహుల్ గాంధీ

ఢిల్లీకి సంచులు మోయడంలో బిజీగా రేవంత్

ఈ విషయంలో ముఖ్యమంత్రికి పదికి పది మార్కులు ఇవ్వొచ్చు



- ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు సాధ్యం కాని హామీలు ఇచ్చారు
- భారత్ సమ్మిట్ కాదు కాంగ్రెస్ సమ్మిట్
- ప్రభుత్వ వైఫల్యాల వల్లే కరువు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): ఢిల్లీకి సంచులు మోయడంలో, ఢిల్లీ చుట్టూ చక్కర్లు కొట్టడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పది కి పది మార్కులు ఇవ్వొచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో మాత్రం ఆయనకు ఎలాంటి మార్కులు ఇవ్వలేమని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఒక వన్ టైమ్ వండర్ లీడర్ అని, 2028 డిసెంబర్ నాటికి ఆయన రాజకీయ ఏటీఎం గడువు ముగుస్తుందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి రేవంత్ రెడ్డి ఏటీఎంగా మారారని, 2028లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఏబీపీ సదరన్ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొన్న కేటీఆర్.. తెలంగాణ రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలన, పెట్టుబడులు, ఉద్యోగాలు, అవినీతి తదితర అంశాల పై మాట్లాడారు. 2015లో ఎమ్మెల్యేకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించిన కేసులో ఫోరెన్సిక్, డాక్యుమెంటరీ ఆధారాలు ఉన్నాయని, ఆ కేసు ఇంకా సుప్రీంకోర్టు పరిధిలో ఉందని ప్రస్తావించారు. అప్పట్లో ఎమ్మెల్యేకు సంచులు తీసుకెళ్లే స్థాయి నుంచి ఇప్పుడు ఢిల్లీ వరకు సంచులు తీసుకెళ్లే స్థాయికి ఎదిగారని విమర్శించారు. రాహుల్ గాంధీకి రెండు ఏటీఎం కార్డులు ఉన్నాయని,

మిగతా 2లో..

సిద్ధిపేటలో పోటీ చెయ్యండి.. తేల్చుకుందాం

మమ్మల్ని తిట్టడానికే సభపెట్టారు: హరీశ్

హైదరాబాద్(జనంసాక్షి): సిద్ధిపేటలో ఇందిరమ్మ జీవిత బీమాపై సభ పెట్టిన సీఎం రేవంత్‌రెడ్డి ఆ పథకం గురించి ఏమైనా మాట్లాడారా? అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. తనతో పాటు కేసీఆర్, కేటీఆర్ పేర్లను పదేపదే ఆయన జపించారని విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు."సిద్ధిపేట సభలో రేవంత్ ముఖంలో తీవ్ర నిరాశ, అసహనం కనిపించాయి. రేవంత్‌రెడ్డి మా పేర్లు 140 సార్లు

మిగతా 2లో..



ఉత్తమ నటుడు రణ్‌వీర్..

ఉత్తమ చిత్రం ధురంధర్

- అవార్డుల మోత మోగించిన చిత్రం
- దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ అవార్డుల ప్రకటన



న్యూఢిల్లీ(జనంసాక్షి): దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ 2026 అవార్డులను శుక్రవారం ప్రకటించారు. రణ్‌వీర్‌సింగ్ కథానాయకుడిగా ఆదిత్యధర్ దర్శకత్వంలో వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' అవార్డుల మోత

మిగతా 2లో..

సీఈసీ, ఈసీ నియామక చట్టం రీకాల్‌కు సుప్రీం నో



పిటిషన్‌ను తోసిపుచ్చిన ధర్మాసనం

హైదరాబాద్(జనంసాక్షి): సీఈసీ, ఈసీ నియామక చట్టాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తెలిపారు. గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన భిన్నమైన తీర్పును రీకాల్ చేయాలనే పిటిషన్?ను విడిగా విచారణ జరిపేందుకు ఆయన నిరాకరించారు. రీకాల్ అప్లికేషన్, రిఫరెన్స్ ఉత్తర్వులపై అభ్యంతరాలతోపాటు సీఈసీ, ఈసీ -2023 చట్టం చెల్లుబాటుపై ఐదుగురు న్యాయమూర్తుల రా జ్యాంగ ధర్మాసనం పరిశీలిస్తుందని సీజేఐ పేర్కొన్నారు. గతంలో తీర్పు ఇచ్చిన న్యాయమూర్తుల్లో ఒకరు పదవీవిరమణ చేసినా రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించవచ్చని స్పష్టం చేశారు.న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పిటిషన్‌ను భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం తిరస్కరించింది. ఈ పిటిషన్ విచారణకు వచ్చినప్పుడు ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ముందు ఈ అంశాన్ని లేవనెత్తాలని విచారణ సందర్భంగా సీజేఐ సూచించారు. జస్టిస్ శర్మ భిన్నమైన అభిప్రాయం కారణంగానే ఈ రిఫరెన్స్

మిగతా 2లో..

రైస్‌మిల్లర్లకు సుప్రీంలో చుక్కెదురు

- విచారణ ఎదుర్కొండి.. సుప్రీం హితవు
- డిఫాల్ట్ అయిన తెలంగాణ మిల్లర్లపై కేసులకు సర్వోన్నత న్యాయస్థానం గ్రీన్‌సిగ్నల్

2లో..

భారత్‌తో ట్రేడ్ డీల్స్‌కు ప్రపంచ దేశాల ఆసక్తి

ఈ ఫలితాలు అందరికీ అందాలి : కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్

2లో..

ఆగని పసిడి పతనం

ఒక్కరోజే రూ.5వేలపైగా దిగొచ్చిన బంగారం..

రూ.10వేలు తగ్గిన వెండి



రఫేల్ యుద్ధ విమానాల గల్లంతంటూ బ్రిటీష్ ఏవియేషన్ మాగ్జైన్ తప్పుడు కథనం..

స్పందించిన ఐఏఎఫ్ మాజీ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ

అదంతా పచ్చి అబద్ధమని, ఆధారాలను పునఃపరిశీలించుకోవాలని సదరు సంస్థకు హితవు



న్యూఢిల్లీ(జనంసాక్షి): ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) చెందిన 4 రఫేల్ యుద్ధవిమానాలు అదృశ్యమయ్యాయంటూ బ్రిటిష్ ఏవియేషన్ మేగజైన్ 'ఫ్లైట్ గ్లోబల్' వివాదాస్పద కథనం వెలువరించింది. దీనిపై ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఐఏఎఫ్ మాజీ ఎయిర్ మార్షల్ నర్మదేశ్వర్ తివారీ మండపడ్డారు. అదంతా పచ్చి అబద్ధమని, ఆధారాలను పునఃపరిశీలించుకోవాలని ఫ్లైట్ గ్లోబల్‌కు ఎక్స్ వేదికగా హితవు పలికారు. భారత్ ఇప్పటి వరకు ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్ జెట్‌లను కొనుగోలు చేసింది. కానీ, ఫ్లైట్‌గ్లోబల్ తాజా వరల్డ్ ఎయిర్‌ఫోర్సెస్ డైరెక్టరీలో భారత్ వద్ద 32 రఫేల్ విమానాలు ఉన్నట్లు పేర్కొంది.ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న రఫేల్ యుద్ధ విమానాలను కూల్చివేశామని కొందరు తెగ సంబరపడిపోయారని, వాటి టెయిల్ నంబర్లతో సహా చెప్పేశారని తివారీ అన్నారు. కానీ, ఆ టెయిల్ నంబర్లు ఉన్న జెట్‌లు ఆ తర్వాతా వివిధ అంతర్జాతీయ విన్యాసాల్లో

మిగతా 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21.11.2026

రూ.20 వేల కోట్లతో పట్టణాల అభివృద్ధి

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్రంలో పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధికి పురపాలక శాఖ రూపొందించిన ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సమీక్షించారు. వాతావరణ మార్పులను తట్టుకునేలా, పర్యావరణ పరిరక్షణకు దోహదపడేలా పట్టణాలను అభివృద్ధి చేసే ప్రణాళికలపై చర్చించారు.ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ), ఆసియా మౌలిక సదుపాయాల పెట్టుబడుల బ్యాంకు (ఏఐఐబీ), జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంకుతో పాటు దేశీయ ఆర్థిక సంస్థల సహకారంతో దాదాపు రూ.20 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు పురపాలక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది.వరంగల్‌లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి పారుదల వ్యవస్థ, వరంగల్ కోట కందకం పునరుద్ధరణ, హనుమకొండలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్ అభివృద్ధి ప్రతిపాదనలపై సమావేశంలో చర్చించారు.రాష్ట్రంలో మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి వినియోగించేందుకు ప్రత్యేక విధానాన్ని రూపొందిస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని పరిశ్రమలకు, ప్రధానంగా టెక్స్‌టైల్ పార్కులకు వినియోగించడం ద్వారా మంచినీటి వనరులపై ఒత్తిడి తగ్గించేందుకు అవకాశముంది.పట్టణాల్లో తాగునీటి సరఫరా, నీటి శుద్ధి, పంపిణీ వ్యవస్థల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, పునరుత్పాదక ఇంధన వనరులను వినియోగించే అంశాలపై చర్చించారు.వరంగల్ మెగా సిటీ ఎకనామిక్ రీజియన్ పరిధిలో వ్యర్థాల నుంచి 10 నుంచి 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు ప్రతిపాదనను సమీక్షించారు. బయో సీఎన్‌జీ ఉత్పత్తి, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్ల ఏర్పాటుపై చర్చించారు.ఈ ప్రాజెక్టుల ద్వారా పట్టణాల్లో కర్బన ఉద్గారాలను తగ్గించడం, నీటి వనరులను సంరక్షించడం, వరద ముప్పును నివారించడం, పురపాలక సంస్థల నిర్వహణ వ్యయాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, పురపాలక శాఖ కార్యదర్శి టి.కె. శ్రీదేవి పాల్గొన్నారు.

ఓట్ల కోసమే భాజపా మతరాజకీయాలు



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. కేవలం హిందూ ముస్లిం ఓట్ల కోసం మాత్రమే మోదీ, అమిత్ షా... అసదుద్దీన్ ఓవైసీ ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నా రు. అంతే తప్ప వారి మధ్య పెద్దగా ఏమీ పోటీ లేదని అన్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం అన్ని వర్గాలను కలుపుకుని వెళ్తోందని ఆయన ఉద్ఘాటించారు. ఇక లోక్‌సభ నియోజకవర్గాల సంఖ్యను 50 శాతం పెంచితే కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో దక్షిణాది అవసరం లేకుండా పోతుందని రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం ఉత్తరాది సీట్ల బలంతోనే అధికారం దక్కించుకునే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ తర్వాత మొత్తం 850 సీట్లలో ఉత్తరాదికి 650 సీట్లు, దక్షిణాదికి సుమారు 195 సీట్లు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. ఇది చర్య దక్షిణ భారత ప్రాధాన్యాన్ని తుడిచిపెట్టే కుట్ర అని విమర్శించారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలంటే చట్టాలు, రాజ్యాంగాన్ని మార్చాల్సిన పనిలేదని, ఉన్న 543 సీట్లలోనే 181 సీట్లను మహిళలకు కేటాయించవచ్చని ఆయన సూచించారు. కాగా, తెలంగాణలో తమకు ప్రధాన రాజకీయ ప్రత్యర్థి బీఆర్ఎస్సేనని, రాష్ట్రంలో బీజేపీకి ఉనికి లేదని వ్యాఖ్యానించారు. తన రామాయణ కథలో కేసీఆర్ 'రావణాసురుడు' అయితే కేటీఆర్ 'మేనేజ్‌మెంట్ కోటా' నేత అని ఎద్దేవా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని హోటల్ పార్క్ హయత్‌లో జరిగిన ఏబీపీ న్యూస్ ప్రతిష్టాత్మక వేదిక 'సదరన్ రైజింగ్ సమ్మిట్ 2026'లో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన తాజా రాజకీయ పరిణామాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు.

కేంద్ర ప్రభుత్వం తలపెట్టదలిచిన డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రణాళిక ఏ ఒక్క రాజకీయ పార్టీకో సంబంధించిన సమస్య కాదని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ఆ విషయం యావత్ దక్షిణ భారతదేశ ప్రజలందరి భవిష్యత్తుకు పెను సవాల్ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఇండియా కూటమిలోని కొన్ని మిత్రపక్షాలు ఈ అంశంపై మద్దతు ఇస్తాయన్న ఊహాగానాలపై స్పందిస్తూ... ఎవరు మద్దతు ఇచ్చినా ఇవ్వకపోయినా తమకు అభ్యంతరం లేదని అన్నారు. కానీ ఈ విధానం అమలైతే దక్షిణాది ప్రాధాన్యత పూర్తిగా అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం అత్యంత కీలకమని అన్నారు. గతంలో వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం కేవలం ఒక్క ఓటు తేడాతో కూలిపోయిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి నొక్కి చెప్పారు. బీజేపీ చెబుతున్న సీట్ల సంఖ్యను లెక్కించే విధానంపై మాట్లాడుతూ... "ప్రస్తుతం కేరళలో 20 మంది ఎంపీలు, ఉత్తరప్రదేశ్‌లో 80 మంది ఎంపీలు ఉన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య 60 సీట్ల వ్యత్యాసం ఉంది. ఒకవేళ 50 శాతం సీట్లు పెంచితే కేరళలో 30, యూపీలో 120 సీట్లు అవుతాయి. అప్పుడు ఆ వ్యత్యాసం 90 సీట్లకు చేరుతుంది. ఇంత భారీ తేడా ఏర్పడితే దక్షిణాది రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో పట్టించుకునే వారే ఉండరు" అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. దక్షిణాదిలో ప్రస్తుతం 129 మంది ఎంపీలు ఉండగా, పునర్విభజన తర్వాత అది దాదాపు 195కి చేరుతుందన్నారు. "మొత్తం 850 సీట్లలో 650 సీట్లు ఉత్తరాది రాష్ట్రాలకే దక్కితే, బీజేపీ ఏ విధంగానైనా మెజారిటీ సాధిస్తే దక్షిణ భారతదేశ ప్రాధాన్యం పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది. కేవలం తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం ప్రధాని మోదీ చేస్తున్న ఈ ప్రయోగం రాబోయే రోజుల్లో దేశానికి పెద్ద ప్రమాదంగా పరిణమిస్తుంది" అని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 175 (ఆంధ్ర), 119 (తెలంగాణ) సీట్ల సమీకరణంలో మెజారిటీ బలంతో తెలంగాణకు అన్యాయం జరిగిందని, అందుకే పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామని ఆయన చెప్పుకొచ్చారు. రాష్ట్రాలు, జనాభా, జీడీపీ ఆధారంగా '50 శాతం ఫార్ములా'ను అమలు చేయాలని సూచించారు. మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్న నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఉంటే వెంటనే అమలు చేయవచ్చని రేవంత్ రెడ్డి అన్నారు. అందుకోసం కొత్త చట్టాలు, సవరణలు అవసరం లేదని గుర్తు చేశారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లోనే 181 స్థానాలను మహిళలకు కేటాయించవచ్చని సూచించారు. 2023లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందడానికి కాంగ్రెస్ పార్టీ సహకరించిందని అన్నారు. ఇప్పుడు సంఖ్యాబలం ఉందని బెదిరించి బిల్లు పాస్ చేయించుకున్నా, భవిష్యత్తులో డీలిమిటేషన్ అమలైతే దక్షిణాదికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని స్పష్టం చేశారు. విజిటింగ్ పీఎంలా మోదీ... ప్రధాని, బీజేపీపై నిప్పులు చెరిగిన సీఎంప్రధాని నరేంద్ర మోదీ ఒక 'విజిటింగ్ ప్రైమ్ మినిస్టర్'లా మారారని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన విదేశీ పర్యటనలకు లెక్క లేకుండా పోయిందని విమర్శించారు. ప్రధాని తన జీవితంలో ఏనాడు నిజం మాట్లాడలేదని ఆరోపించారు. బీజేపీ ఎప్పుడూ అబద్ధాలే చెబుతూ అధికారం కోసమే పాకులాడుతోందని ఆరోపించారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారన్నారు. జాతి, మతం, భాష పేరుతో విభేదాలు సృష్టిస్తున్నారని దుయ్యబట్టారు. భారత స్వాతంత్ర సమరయోధుల పోరాట ఫలితంగానే ఈ దేశంలో పేద, ధనిక, కులం, మతం తేడా లేకుండా ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వచ్చిందన్నారు. అయితే, పేదల ఓటు హక్కును తొలగించే కుట్ర జరుగుతోందని అన్నారు. రాహుల్ గాంధీ విదేశాల్లో మోదీ ప్రభుత్వంపై విమర్శలు చేయడాన్ని ఎలా చూస్తారన్న ప్రశ్నకు బదులుగా... చేగువేరా స్ఫూర్తే తమకు ఆదర్శమన్నారు. పేదల హక్కుల కోసం ఆయన ఏ దేశంలో సమస్య ఉంటే ఆ దేశంకు వెళ్ళి పోరాడారని అన్నారు. తాము కూడా ఆయన స్ఫూర్తితోనే ప్రజా సమస్యలపై పోరాడతామని చెప్పారు. రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓట్ చోర్ - గద్దీ చోర్' నినాదానికి దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విశేష మద్దతు లభిస్తోందని తెలిపారు. 12 ఏళ్ల పాలనలో ప్రధాని మోడీ రూ. 120 లక్షల కోట్ల అప్పులు చేశారని అన్నారు. మోడీకి ముందున్న ప్రధానులందరి అప్పు దాదాపు రూ. 53 లక్షల కోట్లు మాత్రమేనని అన్నారు. మరి ఇంత అప్పు చేసి ఆయన ఈ దేశంలో ఒక్క ప్రాజెక్టు నిర్మించలేదని, ఒక్క ప్రతిష్టాత్మక విద్యాసంస్థ నిర్మించలేదని రేవంత్ రెడ్డి ఆరోపించారు. తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ భాక్రనంగల్ ప్రాజెక్టు, నాగార్జున సాగర్, ఐఐటీ, ఐఐఎం, ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థలను నిర్మించారని అన్నారు. ఇందిరా గాంధీ పేదరిక నిర్మూలన, బ్యాంకుల జాతీయికరణ, రాజభరణాల రద్దు తదితర కీలక నిర్ణయం తీసుకున్నారని అన్నారు. టెలికం విప్లవంతో రాజీవ్ గాంధీ టెక్నాలజీకి దేశంలో ఆజ్యం పోశారన్నారు.

ఆరు దశల్లో భూముల రీ సర్వే..

కారణాలను ఫీల్డ్ రిజిస్టర్‌లో స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. తహసీల్దార్ గ్రామస్థాయి క్యాంపుల తర్వాత మూడు, నాలుగు రోజుల్లో కేసులను పరిష్కరించాలన్నారు. గ్రామ పెద్దలు, బాధిత రైతులు, పక్క భూముల పట్టాదారులతో చర్చించి వివాదాల పరిష్కారానికి ప్రయత్నించాలన్నారు. ఉమ్మడి భూముల విభజనకు పరస్పర అంగీకారం, చట్టబద్ధత ఉంటేనే ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. సెక్షన్ 9(2) నోటీసుల తర్వాత అప్పీల్ సమయంలో అడిషనల్ కలెక్టర్, ఆర్డీవో క్షేత్రస్థాయి తనిఖీలు చేయాలని సూచించారు. అప్పీళ్లు, అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాతే సెక్షన్ 13 కింద తుది గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వాలని ఆదేశించారు. గెజిట్ తర్వాతే భూ భారతి ఆర్వోఆర్ రికార్డుల సవరణ చేపట్టాలన్న లోకేశ్ కుమార్.. హైదరాబాద్ జిల్లా మినహా మిగిలిన అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు ఈ మార్గదర్శకాలను అమలు చేయాలన్నారు.

చుక్కా రామయ్య పుట్టినరోజు విద్యావ్యవస్థకే గొప్పపండుగ

మంది ఐఐటీ కలను సాకారం చేసిన మహనీయుడన్నారు. విద్యావేత్తగానే కాకుండా ఎమ్మెల్సీగా తనదైన ముద్ర వేశారని సీఎం కొనియాడారు. సామాజిక సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పదునైన ప్రశ్నలతో ప్రభుత్వాన్ని నిలదీసి, పరిష్కారం ఏ విధంగా ఉండాలో కూడా సూచించేవారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం ఆయన సూచనలతో ముందుకు వెళ్తుందని తెలిపారు. అంతకుముందు మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్సీ కోదండరాం, హరియాణ మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఈనాడు ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు తదితరులు చుక్కా రామయ్యకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వార్త చదివారా: ఉన్నత పదవుల్లో ఉన్నవారు హుందాగా మాట్లాడాలి: కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

సిద్ధిపేటలో పోటీ చెయ్యండి.. తేల్చుకుందాం

తలచుకున్నారు. నేను తాటిచెట్టును నిజమే.. రేవంత్ గన్నేరు చెట్టులా ఉన్నారు. కుట్రలు చేయడం తప్ప.. మంచి చేయాలన్న ఆలోచన ఆయనకు లేదు. అన్నీ అబద్ధాలే తప్ప.. ప్రజలకు పనికొచ్చే మాట ఒక్కటీ లేదు. సొంతపార్టీ ఎమ్మెల్యేలే సీఎం అవినీతి గురించి మాట్లాడుతున్నారు. పాలన బాగోలేదని అధికార పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంటున్నారు. బీఆర్ఎస్‌ను ఎప్పుడు అధికారంలోకి తెచ్చుకుందామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చూపించాం. పలువురు నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు. రేవంత్‌లో ఫ్రస్ట్రేషన్ కనిపిస్తోంది. సిద్దిపేటలో నాపై ఆయన పోటీచేయాలి.. అక్కడే తేల్చుకుందాం" అని హరీశ్‌రావు సవాల్ విసిరారు.

ఉత్తమ నటుడు రణ్‌వీర్.. ఉత్తమ చిత్రం 'ధురంధర్'

మోగించింది. ఉత్తమ నటుడి అవార్డు రణవీర్ సింగ్‌ను వరించింది. ఇక 'సయారా'లో నటనకు గానూ ఉత్తమ నటి అవార్డును అనీత్ పడ్డా సొంతం చేసుకుంది. ఉత్తమ చిత్రంగా 'ధురంధర్' నిలిచింది. ఇంటర్నేషనల్ ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ప్రముఖ గాయని టేలర్ స్విఫ్ట్ ఎంపికయ్యారు. సంగీత ప్రతిభ, పాటల రచనా నైపుణ్యం, అంతర్జాతీయ సాంస్కృతిక ప్రభావం, లైవ్ ఎంటర్‌టైన్‌మెంట్ రంగానికి ఆమె అందించిన సేవలను గుర్తిస్తూ టేలర్ స్విఫ్ట్‌కు ఈ పురస్కారాన్ని కమిటీ ప్రకటించింది. దాదాసాహెబ్ ఫాల్కే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ద్వారా భారతీయ సినిమా, వినోద రంగానికి చెందిన ప్రతిభావంతులను గుర్తించి అవార్డుతో సత్కరిస్తున్నారు. భారతీయ సినిమా పితామహుడిగా ప్రసిద్ధి చెందిన దాదాసాహెబ్ ఫాల్కే పేరు మీద ఈ ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. సినీ నిర్మాణం, కళలు, వినోద రంగాలకు సంబంధించిన వివిధ విభాగాల్లో విశేష కృషి చేసిన వారికి ఈ వేదికపై పురస్కారాలను అందిస్తున్నారు.

ఫాల్కే అవార్డు విజేతలు వీళ్లే

ఉత్తమ చిత్రం: ధురంధర్
ఉత్తమ నటుడు: రణ్‌వీర్ సింగ్ (ధురంధర్)
ఉత్తమ నటి: అనీత్ పడ్డా (సయారా)
ఉత్తమ దర్శకుడు: ఆదిత్య ధర్ (ధురంధర్)
ఉత్తమ సహాయ నటుడు: వినీత్ కుమార్ సింగ్ (ఛావా)
ఉత్తమ ప్రతినాయకుడు: అక్షయ్ ఖన్నా (ధురంధర్)
హాస్య ప్రధాన పాత్రలో ఉత్తమ నటుడు: రితేశ్ దేశ్‌ముఖ్ (హౌస్‌ఫుల్ 5)
ఉత్తమ సంగీత దర్శకుడు: శాశ్వత్ సచ్‌దేవ్ (ధురంధర్)
క్రిటిక్స్ బెస్ట్ ఫిల్మ్: కాంతార: చాప్టర్1
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: రిషబ్‌శెట్టి (కాంతార: చాప్టర్1)
క్రిటిక్స్ బెస్ట్ యాక్టర్: యామి గౌతమ్‌ధర్ (హక్)
ప్రొడ్యూసర్ ఆఫ్ ది ఇయర్: ఆదిత్యధర్, జ్యోతి దేశ్‌పాండే, లోకేశ్‌ధర్: ధురంధర్
ఉత్తమ కొరియోగ్రఫీ: శాండీ మాస్టర్ (కూలీ-మోనికా బెలూసీ)
ఉత్తమ సినిమాటోగ్రాఫర్: అరవింద్ ఎస్.కశ్యప్ (కాంతార: చాప్టర్1)
ఉత్తమ్ స్క్రీన్‌ప్లే అండ్ డైలాగ్: రీషు నాథ్ (హక్)
ఉత్తమ గేయ రచయిత: ఇర్షద్ కమిల్ (సయారా)
ఉత్తమ నేపథ్య గాయకుడు: ఫహీమ్ అబ్దుల్లా (సయారా)
ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్: కరణ్ ఆజ్లా
సాంగ్ ఆఫ్ ది ఇయర్: సయారా
కమెడియన్ ఆఫ్ ది ఇయర్: సామే రైనా
అవుట్‌స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ మ్యూజిక్ ఇండస్ట్రీ: ఇళయరాజా
అవుట్ స్టాండింగ్ కాంట్రిబ్యూషన్ ఇన్ ఫిల్మ్ ఇండస్ట్రీ: కమల్‌హాసన్
ఉత్తమ వెబ్‌సిరీస్: ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్
ఉత్తమ వెబ్‌సిరీస్ దర్శకుడు: ఆర్యన్‌ఖాన్

ఢిల్లీకి సంచులు మోయడంలో బిజీగా రేవంత్

ఒకటి రేవంత్ రెడ్డి, మరొకటి డీకే శివకుమార్ అని వ్యాఖ్యానించారు. ఈ రెండు ఏటీఎం కార్డుల గడువు 2028లో ముగుస్తుందని అన్నారు.

సాధ్యం కాని హామీలు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలకు సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చిందని కేటీఆర్ విమర్శించారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అన్ని హామీలు అమలు చేస్తామని చెప్పి, వెయ్యి రోజులు దాటినా వాటి గురించి సమాధానం చెప్పడం లేదన్నారు. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ కేవలం 1.85 శాతం ఓట్ల తేడాతో ఓడిపోయిందని గుర్తుచేశారు. ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పుడు ప్రతిపక్ష నాయకులను తిట్టడం, కొత్త కేసులు పెట్టడం, కొత్త కమిషన్లు ఏర్పాటు చేయడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఆటో డ్రైవర్లను, మహిళలను, ఉద్యోగులను అడిగితే ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయం తెలుస్తుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల ఫలితంగానే కరువు

తెలంగాణలో ప్రస్తుతం కనిపిస్తున్న కరువు పరిస్థితులు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల ఫలితమని కేటీఆర్ విమర్శించారు. ఇది ఎల్‌నినో ప్రభావం కాదు.. ఎల్‌కాంగో ప్రభావం అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ప్రజల సమస్యలను పట్టించుకోవాల్సిన ముఖ్యమంత్రి తన గడ్డం గురించి మాట్లాడటమే పెద్ద సమస్యగా భావిస్తున్నారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఎప్పుడైనా కేసీఆర్‌తో తనను పోల్చుకోవాలనుకుంటే మాటలతో కాకుండా చేతలతో నిరూపించుకోవాలని సూచించారు.రాష్ట్రంలో అవినీతి, కమిషన్ల వ్యవహారాలపై స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలే ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో రూ.5 లక్షల కోట్ల నుంచి రూ.10 లక్షల కోట్ల వరకు దోపిడీ జరిగిందని కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆరోపించారని, ప్రభుత్వంలో ఏ పని జరగాలన్నా 15 నుంచి 20 శాతం కమిషన్లు ఇవ్వాల్సి వస్తోందని మరో ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి మాట్లాడారని గుర్తుచేశారు. కాంగ్రెస్ నేతలే ప్రభుత్వ అవినీతిపై మాట్లాడుతున్నా ముఖ్యమంత్రి సమాధానం చెప్పడం లేదన్నారు. హైడ్రా ఎంపిక చేసుకుని చర్యలు తీసుకునే సాధనంగా మారిందని కేటీఆర్ ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లు, బ్లాక్‌మెయిలింగ్, వసూళ్లకు ఉపయోగపడుతున్నదని విమర్శించారు. పేదల తాత్కాలిక ఇళ్లు, గుడిసెలను కూల్చివేస్తూ వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో నేరాలు, అవినీతి పెరుగుతున్నాయని, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడం లేదని విమర్శించారు.

పెట్టుబడుల ఫలితాలు ఎక్కడ ?

రేవంత్ రెడ్డి ప్రభుత్వం దావోస్, అమెరికా, జపాన్ పర్యటనల ద్వారా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు తీసుకొచ్చామని ప్రకటిస్తోందని, అయితే ఆ పెట్టుబడుల ఫలితాలు ఎక్కడ కనిపిస్తున్నాయని కేటీఆర్ ప్రశ్నించారు. 2026?27 బడ్జెట్ ప్రసంగంలో హైదరాబాద్ టెక్నాలజీ రంగంలో ఉద్యోగాల సంఖ్య తగ్గినట్లు ప్రభుత్వం స్వయంగా పేర్కొందని గుర్తుచేశారు. 2023లో 9.46 లక్షలుగా ఉన్న టెక్నాలజీ ఉద్యోగాలు 2026?27 నాటికి 9.39 లక్షలకు తగ్గాయని, అంటే సుమారు ఏడు వేల ఉద్యోగాలు తగ్గిపోయాయని వివరించారు. లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెబుతున్న ప్రభుత్వం వాస్తవంగా ఎంత పెట్టుబడి వచ్చింది, ఎక్కడ పరిశ్రమలు ప్రారంభమయ్యాయి, ఎన్ని ఉద్యోగాలు కల్పించారనే వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

భారత్ సమ్మిట్ కాదు కాంగ్రెస్ సమ్మిట్

భారత్ సమ్మిట్ పేరుతో నిర్వహించిన కార్యక్రమం వాస్తవానికి కాంగ్రెస్ సమ్మిట్ అని కేటీఆర్ విమర్శించారు. దేశవ్యాప్తంగా రాజకీయంగా ఉపాధి లేని కాంగ్రెస్ నాయకులను ఒకచోట చేర్చి, రాహుల్ గాంధీని ప్రమోట్ చేసుకోవడం, కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేసుకోవడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశంగా కనిపించిందన్నారు. 70 దేశాల నుంచి ఎవరెవరు వచ్చారో కూడా తనకు తెలియదని, ఈ సదస్సు వల్ల తెలంగాణకు లేదా దేశానికి కలిగిన ప్రయోజనం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించాలనే ఆసక్తి ఉంటే సొంత నిధులతో నిర్వహించుకోవాలని, తెలంగాణ ప్రజల డబ్బును రాజకీయ ప్రచారానికి ఖర్చు చేయడం ఏమిటని ప్రశ్నించారు. గత ఏడాది నిర్వహించిన ఇలాంటి సదస్సుకు సుమారు రూ.70 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు భావిస్తున్నానని, ఈసారి ప్రభుత్వ ఖజానా నుంచి రూ.100 కోట్లకు పైగా ఖర్చు చేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి ఎన్ని పరిశ్రమలు వచ్చాయి? ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? తెలంగాణకు ఏం ప్రయోజనం కలిగింది? అనే విషయాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సీఈసీ, ఈసీ నియామక చట్టం రీకాల్‌కు సుప్రీం నో..

తలెత్తిందని భూషణ్ వాదించారు. ఆయన వాదనకు స్పందిస్తూ సీజేఐ, "ఈ కేసులో జస్టిస్ శర్మ భిన్నమైన అభిప్రాయం వ్యక్తం చేయకపోయి ఉంటే, దీనిని రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేసి ఉండేవారు కాదు" అని అన్నారు.ఈ విషయాన్ని విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయడానికి జస్టిస్ దత్తా కూడా చివరికి అంగీకరించారని, తన పాత్ర కేవలం ధర్మాసనాన్ని ఏర్పాటు చేయడమేనని సీజేఐ తెలిపారు. అయితే, రీకాల్ దరఖాస్తును ఒరిజినల్ బెంచ్ ముందు ఉంచాలని, వచ్చే వారం విచారణ జరపాలని భూషణ్ పట్టుబట్టారు. జస్టిస్ శర్మ త్వరలో పదవీ విరమణ చేయనుండటం వల్ల ఈ దరఖాస్తు పరిశీలనపై ప్రభావం పడొచ్చని ఆయన పేర్కొన్నారు. దీనికి బదులిస్తూ న్యాయమూర్తుల్లో ఒకరు పదవీవిరమణ చేసినా రాజ్యాంగ ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించవచ్చని సీజేఐ చెప్పారు.

రైస్‌మిల్లర్లకు సుప్రీంలో చుక్కెదురు

న్యూఢిల్లీ(జనంసాక్షి):తెలంగాణ రైస్ మిల్లర్లకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. డిఫాల్ట్ అయిన మిల్లర్లపై కేసులకు సర్వోన్నత న్యాయస్థానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా డిఫాల్ట్ మిల్లర్లపై 540 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా.. వాటిని రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. దీంతో మిల్లర్ల తరపు న్యాయవాదులు తమ పిటిషన్లను ఉపసంహరించుకున్నారు. పెండింగ్ బియ్యం అప్పగించకుంటే బకాయిలు చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. దీంతో మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు పక్కదారి పట్టించినట్లు ఆరోపణలున్నాయి.

అందుబాటులోకి.. స్వదేశీ బర్డ్ ఫ్లూ వ్యాక్సిన్

న్యూఢిల్లీ(జనంసాక్షి): బర్డ్ ఫ్లూ బారిన పడకుండా పౌల్ట్రీ రంగాన్ని కాపాడేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన హెచ్5ఎన్1 వ్యాక్సిన్ అందుబాటులోకి వచ్చింది. దీనిని కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ భోపాల్‌లో ఆవిష్కరించారు. భోపాల్‌లోని ఐసీఏఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస్ కలిసి ఈ టీకాను అభివృద్ధి చేశాయి. అత్యంత వ్యాధికారక ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (బర్డ్ ఫ్లూ)లోని క్లేడ్ 2.3.2.1జీకు చెందిన హెచ్5ఎన్1 వైరస్‌ను ఎదుర్కొనేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన తొలి టీకా (ఇతితీట ఈశ్రీబీ ఎజీఇఇతినివ) ఇదేనని అధికారులు పేర్కొన్నారు.బర్డ్ ఫ్లూగా ప్రసిద్ధమైన ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా అతి తీవ్రతతో వ్యాప్తి చెందే లక్షణం కలిగిన వ్యాధి. కోళ్లు, పక్షులపై ఈ వ్యాధి ప్రభావం అధికంగా ఉంటుంది. దీని కారణంగా అనేక రాష్ట్రాల్లో కోళ్ల పరిశ్రమ తీవ్రమైన ఆర్థిక నష్టాలను చవిచూసింది. ఈ క్రమంలోనే దేశీయ టీకా కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ టీకాను అందుబాటులోకి తీసుకొచ్చిన సందర్భంగా కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. పౌల్ట్రీ రంగాన్ని పరిరక్షించడంతోపాటు, కోళ్ల పెంపకందారుల జీవనోపాధిని బలోపేతం

వీర్లపాలెంలో అర్ధరాత్రి పోలీసుల హల్‌చల్?

పరిశ్రమను వ్యతిరేకిస్తున్న గ్రామస్తుల అక్రమ అరెస్టులు?



నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 20 (జనం సాక్షి): సోహం ఆగ్రో ఇండస్ట్రీస్ పరిశ్రమకు వ్యతిరేకంగా గళమెత్తుతున్న వీర్లపాలెం గ్రామస్తులపై పోలీసులు చర్యలకు దిగారంటూ తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ,తెలంగాణ విద్యావంతుల వేదిక తీవ్రంగా ఖండించాయి.నవంబర్ 20న జరగనున్న ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొనకుండా అడ్డుకునేందుకు వాడపల్లి పోలీసులు అర్ధరాత్రి ఇళ్లలోకి చొరబడి గ్రామస్తులను అరెస్టు చేశారని నాయకులు ఆరోపించారు.గ్రామానికి చెందిన నినావత్ సిపాయి, అల్లం నాగరాజు, గుంజ రామయ్య, అంగోతు బాలు, రూపావత్ సైద్, రమావత్ వినోద్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని తెలిపారు.వారు ఎక్కడ ఉన్నారో తెలియక కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు.పరిశ్రమను పరిశ్రమ వల్ల ప్రజలకు కలిగే నష్టాలపై తమ అభిప్రాయాలను ప్రజాభిప్రాయ సేకరణలో చెప్పే హక్కును హరించవద్దని డిమాండ్ చేశారు.అరెస్టు చేసిన గ్రామస్తులను తక్షణమే విడుదల చేయాలని, ప్రజాభిప్రాయ సేకరణలో స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం కల్పించాలని పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ కో-కన్వీనర్లు కన్నెగంటి రవి, కే. రవిచంద్ర, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, జిల్లా అధ్యక్షుడు పందుల సైదులు పోలీసులను డిమాండ్ చేశారు.

పేదల సన్నబియ్యంపై అక్రమార్కుల కన్ను!

ఏదుట్ల రేషన్ షాపులో 53.5 క్వింటాళ్ల బియ్యం మాయం.. డీలర్‌పై కేసు నమోదు



గోపాల్‌పేట, నవంబర్ 20 (జనంసాక్షి) : పేదలకు అందాల్సిన రేషన్ సన్నబియ్యం పక్కదారి పట్టిందా? ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలు చోటుచేసుకున్నాయా? అంటే ఏదుట్ల రేషన్ షాపులో వెలుగుచూసిన నిల్వల వ్యత్యాసమే నిదర్శనం. రేషన్ షాపులో ఈ-పాస్ యంత్రంలోని వివరాలకు, వాస్తవ నిల్వలకు మధ్య భారీ తేడా ఉండటంతో అధికారులు చర్యలు చేపట్టారు. ఏకంగా 53.5 క్వింటాళ్ల సన్నబియ్యం తక్కువగా ఉన్నట్లు గుర్తించి డీలర్‌పై కేసు నమోదు చేశారు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలం ఏదుట్ల గ్రామంలోని రెండు రేషన్ షాపుల్లో డీలర్లకు బదులుగా ఓ ప్రైవేటు వ్యక్తి రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారంటూ గ్రామస్తులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 16న జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) ఆంజనేయులు తన సిబ్బందితో రేషన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో రేషన్ షాపు నంబర్ 425014ను తనిఖీ చేయగా 320 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. డీలర్ భారతమ్మ అందుబాటులో లేకపోవడంతో ఈ-పాస్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని షాపును సీజ్ చేశారు.

అనంతరం శుక్రవారం సివిల్ సప్లైస్ శాఖ డీటీ పరమేష్ ఏదుట్లకు వెళ్లి ఈ-పాస్ యంత్రంలోని నిల్వల వివరాలను భౌతిక నిల్వలతో సరిపోల్చి పరిశీలించారు. ఈ-పాస్ వివరాల ప్రకారం 427 బస్తాలు (213.5 క్వింటాళ్లు) సన్నబియ్యం నిల్వ ఉండాల్సి ఉండగా, భౌతికంగా 320 బస్తాలు (160 క్వింటాళ్లు) మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. దీంతో 107 బస్తాలు, అంటే 53.5 క్వింటాళ్ల సన్నబియ్యం తక్కువగా ఉన్నట్లు నిర్ధారించారు. ఈ నిల్వల వ్యత్యాసంపై రేషన్ డీలర్ భారతమ్మపై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పేదలకు అందాల్సిన రేషన్ సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల అధికారులు స్పష్టం చేశారు. ఈ తనిఖీల సందర్భంగా సివిల్ సప్లైస్ డీటీ పరమేష్, ఏదుట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

తొమ్మిది గంటలపాటు ఈడీ సోదాలు..

ఖానాపూర్‌లో ఉత్కంఠ

- రేఖా నాయక్ అరెస్టుపై జోరుగా ప్రచారం



ఖానాపూర్ రూరల్, నవంబర్ 20 (జనంసాక్షి): మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు అజ్మీరా రేఖా నాయక్ నివాసంతో పాటు మండలంలోని సత్తెనపల్లి పంచాయతీ పరిధి రామారెడ్డిపల్లిలోని ఆమె రైస్‌మిల్లులో ఈడీ అధికారులు శుక్రవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. రూ.40.96 కోట్ల సీఎంఆర్ ధాన్యం అక్రమాల కేసులో మనీలాండరింగ్ కోణంపై ఆరా తీశారు. ఉదయం 4.45 గంటలకు ప్రారంభమైన తనిఖీలు మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగాయి. సీఆర్‌పీఎఫ్ బందోబస్తు మధ్య తనిఖీలు చేపట్టిన అధికారులు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

రూ.40.96 కోట్ల ధాన్యం గోల్‌మాల్ ఆరోపణలు

రైస్‌మిల్లులో ప్రభుత్వం కేటాయించిన ధాన్యంలో 9,639.962 మెట్రిక్ టన్నుల కొరత ఉన్నట్లు గతంలో పౌరసరఫరాల శాఖ గుర్తించింది. ఈ వ్యవహారంలో రేఖా నాయక్‌పై బీఎన్ఎస్, నిత్యావసర సరుకుల చట్టం కింద కేసులు నమోదయ్యాయి. తాజాగా ఈడీ అధికారులు ధాన్యం మళ్లింపు, ఆర్థిక లావాదేవీలపై దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తుంది.

అరెస్టు ప్రచారంతో ఉత్కంఠ

ఈడీ సోదాల నేపథ్యంలో రేఖా నాయక్‌ను అరెస్టు చేస్తారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరగడంతో అనుచరులు, స్థానికులు, మీడియా ప్రతినిధులు ఆమె నివాసం వద్దకు చేరుకున్నారు. అయితే సుమారు తొమ్మిది గంటల తనిఖీల అనంతరం అధికారులు ఎలాంటి అరెస్టు చేయకుండా వెనుదిరగడంతో అనుచరులు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో రోజంతా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది.


పుస్తకం మంచి స్నేహితుడి వంటిది

- జిల్లా కలెక్టర్ కె.హరిత



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 20(జనంసాక్షి): పుస్తకం మన వెంట ఉంటే మంచి స్నేహితుడు తోడుగా ఉన్నట్లేనని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం, ఆలోచనా పరిజ్ఞానం పెంపొందించుకోవడంతో పాటు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన స్ఫూర్తి లభిస్తుందని తెలిపారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తున్నాయని, విద్యార్థులు, నిరుద్యోగులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన వివిధ అంశాలకు సంబంధించిన పుస్తకాలు గ్రంథాలయాలలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా విజ్ఞానాన్ని పంచే స్ఫూర్తి కేంద్రాలుగా ఎదగాలని ఆకాంక్షించారు. పూర్వం ఎంతోమంది ప్రముఖ నాయకులు, మేధావులు వివిధ అంశాలపై గ్రంథాలయాలలో సమావేశమై చర్చలు జరిపేవారని, పుస్తకాలలో జీవితానికి సంబంధించిన ఎన్నో సత్యాలు, అనుభవాలు, విలువైన సందేశాలు దాగి ఉంటాయని, నిరంతర పఠనం ద్వారా అపారమైన విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని తెలిపారు.

రైలు ప్రమాదంలో యువతీ యువకుల మృతి





రెబ్బెన, నవంబర్ 20 (జనంసాక్షి): మండల కేంద్రంలోని ఆసిఫాబాద్ రోడ్ రైల్వే స్టేషన్ సమీపంలో శుక్రవారం విషాద ఘటన చోటు చేసు కుంది. కేరళ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు పడి యువతి, యువకుడు మృతి చెందినట్లు సమాచారం. మృతుల వివరాలు, స్వస్థలం తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలు కూడా ఇంకా వెల్లడికాలేదు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుల వివరాలు గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

ప్రత్యేక ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలి

- డ్రాప్‌డౌన్ మెనూతో కులగణన చేపట్టాలి!
- విద్యాసంస్థల్లో యూజీసీ ఈక్వాలిటీ నిబంధనలు తక్షణమే అమలు చేయాలి
- పూలే, సావిత్రిబాయి, అంబేడ్కర్, మండల్ సరసన చందాపురి సాహెబ్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు కల్పించాలి
- బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం డిమాండ్



హైదరాబాద్ (జనంసాక్షి) : జాతీయ జనగణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్ ఏర్పాటు చేయాలని, డ్రాప్‌డౌన్ మెనూతో కులగణన చేపట్టాలని బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం డిమాండ్ చేశారు. భారతదేశ ఓబీసీ ఉద్యమ పితామహుడు, బహుజన హక్కుల పోరాట యోధుడు, మాన్యవర్ త్యాగమూర్తి ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ 103వ జయంతి వేడుకలను బీసీ చైతన్య వేదిక విద్యార్థి విభాగం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు నగేష్ సూర్యవంశం ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీసీ చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు వీరవల్లి శ్రీనివాస్, బీసీ చైతన్య వేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు వంగ అరుణ్ కుమార్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు అన్నం వెంకటేశ్వరరావు పాల్గొని మాన్యవర్ ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే వెనుకబడిన తరగతుల హక్కులు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం మాన్యవర్ ఆర్.ఎల్. చందాపురి సాహెబ్ తన జీవితాన్ని ఉద్యమానికి అంకితం చేశారని పేర్కొన్నారు. ఓబీసీ సమాజాన్ని కేవలం కులాల సమూహంగా కాకుండా సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనానికి గురైన విస్తృత వర్గంగా గుర్తించి, వారిలో సంఘటిత శక్తి, ఆత్మగౌరవం, రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు ఆయన కృషి చేశారని కొనియాడారు. బహుజన సమాజానికి కేవలం ఓటు హక్కు మాత్రమే కాకుండా చట్టసభల్లో ప్రాతినిధ్యం, నిర్ణయాధికారం ఉండాలని చందాపురి సాహెబ్ ఆకాంక్షించారని నాయకులు తెలిపారు. ఓబీసీలు కేవలం ఓటు బ్యాంకుగా మిగిలిపోకుండా పాలనలో భాగస్వాములు కావాలని, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో జనాభా దామాషా ప్రకారం హక్కులు సాధించాలని ఆయన ఆశించారని గుర్తుచేశారు. ఓబీసీ హక్కుల కోసం ఉద్యమిస్తున్న క్రమంలో అనేక దాడులు, తీవ్ర ప్రతిబంధకాలు ఎదుర్కొన్నప్పటికీ తన పోరాటాన్ని కొనసాగించిన మహనీయుడని కొనియాడారు. ఫూలే – సావిత్రిబాయి – అంబేడ్కర్ – మండల్ సరసన చందాపురి సాహెబ్‌కు జాతీయ గుర్తింపు కల్పించాలి! భారతదేశ సామాజిక న్యాయ చరిత్రలో మహాత్మా జ్యోతిరావు ఫూలే, క్రాంతిజ్యోతి సావిత్రిబాయి ఫూలే, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్, సామాజిక న్యాయ యోధుడు బి.పి. మండల్ వంటి మహనీయుల సరసన మాన్యవర్ త్యాగమూర్తి ఆర్.ఎల్. చందాపురి సాహెబ్‌కు కూడా బహుజన సమాజం సముచితమైన జాతీయ గుర్తింపు కల్పించాలని నాయకులు డిమాండ్ చేశారు. దేశంలోని విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల్లో కుల వివక్షను పూర్తిగా నిర్మూలించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విద్యార్థులకు సమాన అవకాశాలు, ఆత్మగౌరవం, విద్యా భద్రత, న్యాయం కల్పించేందుకు యూజీసీ ఈక్వాలిటీ నిబంధనలను తక్షణమే అమలు చేయాలని కోరారు. విద్యాసంస్థల్లో వివక్షకు వ్యతిరేకంగా సమర్థవంతమైన ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలు ఏర్పాటు చేయాలని, ప్రతి విద్యార్థికి రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు అందాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ చైతన్య వేదిక మహిళా కార్యదర్శి రేణుకా దీదీ,బహుజన రాజ్యం పార్టీ జాతీయ అధ్యక్షులు రమావత్ లాలూ నాయక్ , హైకోర్టు అడ్వకేట్ బాలాజీ నాయక్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాయకులు ప్రశాంత్ గౌడ్, అంజన్, శరత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ.. ఉపాధి అవకాశాలు

- పలు కోర్సుల్లో శిక్షణకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలి
- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాకూబ్ పాషా



హైదరాబాద్ (జనంసాక్షి) : నిరుద్యోగ మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పలు ఉచిత శిక్షణ కోర్సులను అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పదో తరగతి ఉత్తీర్ణులైన లేదా ఫెయిలైన వారికి ఎలక్ట్రిక్ వెహికల్ నైపుణ్య శిక్షణలో 60 సీట్లు, డిగ్రీ పూర్తి చేసిన వారికి సైబర్ సెక్యూరిటీలో 120 సీట్లు, బేసిక్ కంప్యూటర్ డేటా అనలిటిక్స్‌లో 60 సీట్లు, సైన్స్ విద్యార్హత కలిగిన వారికి మెడికల్ కోడింగ్, బిల్లింగ్‌లో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి స్టడీ సర్కిల్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు https://wwwtgmscccc.com/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8520860785, 8919850920, 6305385949 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కుళ్లిన కేకులు, స్వీట్ల విక్రయాలు..

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం!
- ఫుడ్ సేఫ్టీ అధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్





రాజాపూర్ నవంబర్ 20(జనంసాక్షి): మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న 'కేక్ హౌస్' బేకరీలో కుళ్లిపోయి, బూజుపట్టిన కేకులు, స్వీట్లు, క్రీమ్ బన్నులు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. బేకరీలోని గ్లాస్ స్టాండ్లలో ఆహార పదార్థాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నా నిర్వాహకులు పట్టించుకోకుండా విక్రయిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బేకరీ పక్కనే జిల్లా ఉన్నత పాఠశాల ఉండటంతో విద్యార్థులు సైతం కలుషిత ఆహారం బారినపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది. మండలంలోని హోటళ్లు, బేకరీలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి బేకరీలో తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నకిలీ నెంబర్లతో రోడ్డెక్కితే ఇక అంతే..!

- నెంబర్ ప్లేట్ల ముసుగులో అక్రమాలకు పోలీసుల చెక్
- సంగారెడ్డిలో పోలీసుల కొరడా.. 174 వాహనాలు సీజ్



సంగారెడ్డి బ్యూరో నవంబర్ 20 (జనం సాక్షి): నెంబర్ ప్లేట్లు లేకుండా, నకిలీ నెంబర్ ప్లేట్లతో, వాటిని కనిపించకుండా మార్చి వాహనాలు నడిపే వారిపై సంగారెడ్డి జిల్లా పోలీసులు కొరడా ఝుళిపించారు. జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ ఆదేశాల మేరకు సంగారెడ్డి పట్టణంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో నిబంధనలు ఉల్లంఘించిన 174 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వాహనాలకు నిబంధనల ప్రకారం స్పష్టంగా కనిపించే రిజిస్ట్రేషన్ నెంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నెంబర్ ప్లేట్లు లేకుండా లేదా నకిలీ నెంబర్లతో తిరగడం వల్ల నేరాలకు పాల్పడిన వారిని గుర్తించడం, ప్రమాదాల సమయంలో వాహనాలను గుర్తించడం కష్టమవుతుందన్నారు. పెండింగ్ జరిమానాలు ఉన్న వాహనాలను గుర్తించి, యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ప్రత్యేక తనిఖీలు మరింత ముమ్మరం చేస్తామని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వీర్లపాలెం ఇథనాల్ పరిశ్రమను నిలిపివేయాలి

- సాగర్ జలాల తరలింపునకు ఏపీ కుట్ర
- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



నల్లగొండ ప్రతినిధి,నవంబర్ 20,(జనం సాక్షి): నాగార్జునసాగర్ జలాల తరలింపు వ్యవహారంపై సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జలజీవన్ పథకం ముసుగులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పల్నాడు వాటర్‌గ్రిడ్ నిర్మాణాలు చేపడుతూ తెలంగాణ నీటి హక్కులకు విఘాతం కలిగిస్తోందని ఆరోపించారు.తెలంగాణ ప్రభుత్వ అనుమతులు లేకుండానే సాగర్ జలాశయం నుంచి రోజుకు రెండు టీఎంసీల నీటిని తరలించేలా పనులు చేపడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. నల్లగొండలోని మగ్దూం భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.1,200 కోట్ల వ్యయంతో విజయపురి సౌత్ ప్రాంతంలో 200 ఎంఎల్‌డీ ఇన్‌టేక్ వెల్స్ నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు.510 అడుగుల నీటిమట్టం నుంచి నీటిని తరలించే లక్ష్యంతో పనులు జరుగుతున్నాయని, 2025 నుంచే నిర్మాణాలు కొనసాగుతున్నట్లు సమాచారం ఉందన్నారు.జలాశయంలో 492 అడుగుల స్థాయిలో బ్లాస్టింగ్‌లు నిర్వహిస్తున్నట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు న్యాయంగా రావాల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం ఇప్పటికీ తేల్చకపోవడాన్ని ఆయన తప్పుబట్టారు. కృష్ణా పరివాహక ప్రాంతం ఆధారంగా తెలంగాణకు 555 టీఎంసీల నీటి వాటా రావాలని పేర్కొన్నారు. కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు వద్ద రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా వాదించి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు.

దామరచర్ల మండలం వీర్లపాలెంలో ఇథనాల్ పరిశ్రమకు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ ప్రజాస్వామ్య విరుద్ధంగా జరిగిందని నెల్లికంటి సత్యం విమర్శించారు. ప్రజాప్రతినిధులను అరెస్టు చేసి పోలీసు బందోబస్తు మధ్య ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం ప్రజల హక్కులను కాలరాయడమేనన్నారు. గిరిజన, దళిత ప్రజలు నివసించే ప్రాంతాలకు సమీపంలో కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని వీర్లపాలెంలో ఇథనాల్ పరిశ్రమ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, పరిశ్రమ ఏర్పాటును పూర్తిగా విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి, లోడింగి శ్రావణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి, బొలుగూరి నరసింహ, గురిజ రామచంద్రం, టి. వెంకటేశ్వర్లు, పట్టణ కార్యదర్శి కె.ఎస్. రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 నవంబర్ 2026

75 ఏళ్ల స్వతంత్ర భారతమా..
ఇంకెన్నాళ్లో ప్రసవ వేదన?

ఒడిశాలోని కేంద్రాపడా జిల్లాలో నిండు గర్భిణిని ఆసుపత్రికి చేర్చేందుకు అంబులెన్స్ సిబ్బంది, వైద్యుడు కలిసి ఐదు కిలోమీటర్లు కాలినడకన స్ట్రెచర్ మోసుకెళ్లాల్సి వచ్చింది. వర్షానికి రోడ్డు బురదమయంగా మారడంతో అంబులెన్స్ మధ్యలోనే ఆగిపోయింది. ఈ దృశ్యాన్ని చూసి కొందరు వైద్య సిబ్బంది మానవత్వాన్ని మెచ్చుకుంటారు. అది న్యాయమే. కానీ అంతకన్నా ముందు మనం సిగ్గుపడాల్సిన విషయం ఇంకోటుంది. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, ఒక తల్లి పురిటి నొప్పులతో ఆసుపత్రికి చేరేందుకు ఇంకా మనుషుల భుజాలే దిక్కవుతున్నాయి.

చంద్రుడిపై జెండా పాతామని గర్వంగా చెప్పుకుంటున్నాం. ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ గురించి వేదికలెక్కి ప్రసంగాలిస్తున్నాం. కానీ ఒక గ్రామానికి వెళ్లే రోడ్డు వర్షానికి కొట్టుకుపోతే, ప్రాణం ఉన్న మనిషిని మోసుకెళ్లాల్సిన దుస్థితి మారలేదు. ఇదేనా అభివృద్ధి? ఇదేనా మన ప్రగతి? గ్రాఫుల్లో, గణాంకాల్లో కనిపించే వెలుగులు ఈ బురద రోడ్డు దగ్గరికి ఎందుకు చేరలేదు? ఎన్నికల వేళ ప్రతి గడపకూ వచ్చే నాయకులు, ఆ తర్వాత ఈ గ్రామాల వైపు ఎందుకు కన్నెత్తి చూడరు?

తుపాను వస్తుందని తెలిసినప్పుడు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడం అభినందించదగ్గ చర్యే. కానీ ప్రతి విపత్తుకూ ముందు ఇలా తరలించే పనిలో మునిగిపోవడం కాదు, ప్రతి గ్రామానికీ ఏ కాలంలోనైనా చేరగలిగే పక్కా రోడ్డు వేయడమే అసలైన విపత్తు నిర్వహణ. సమస్య ప్రకృతిది కాదు, పాలనది. వర్షం ప్రతి ఏటా వస్తుందని అందరికీ తెలుసు. తుపాన్లు తీర ప్రాంతాలను తరచూ తాకుతాయనీ తెలుసు. తెలిసీ రోడ్లు వేయకపోవడం నిర్లక్ష్యం కాక మరేమిటి? సిద్ధంగా ఉండాల్సిన వ్యవస్థ, ప్రతిసారీ ప్రమాదం జరిగాకే కళ్లు తెరుస్తోంది.

ఒడిశా ఒక్కటే కాదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా దేశంలోని ఎన్నో మారుమూల గ్రామాల్లో అంబులెన్స్ చేరలేక, డోలీల్లో రోగులను, గర్భిణులను కొండలు, వాగులు దాటించే వార్తలు మనం తరచూ చూస్తూనే ఉన్నాం. వాటిని చదివి ఒక్క నిమిషం నొచ్చుకుంటాం, తర్వాత మర్చిపోతాం. ఆ మరపే మన పాలకులకు వరమైంది. వార్త వచ్చినప్పుడు హడావుడి, తర్వాత నిశ్శబ్దం. ఇదే పునరావృతమవుతోంది.

ఈ ఘటనలో వైద్యుడు, సిబ్బంది చూపిన నిబద్ధతకు వందనం. కానీ ప్రతిసారీ ఎవరో ఒకరు తమ వీపులు వంచి వ్యవస్థ లోపాలను భరించాలంటే ఎలా? ప్రాణాలు కాపాడాల్సింది వ్యక్తుల సాహసం కాదు, బలమైన వ్యవస్థ. రోడ్డు, వంతెన, ఆరోగ్య కేంద్రం, అంబులెన్స్ ఇవన్నీ ప్రజలు అడిగే ఔదార్యాలు కావు, వారికి దక్కాల్సిన హక్కులు.

కాబట్టి పాలకులారా, ఇకనైనా మేల్కొనండి. ప్రతి గ్రామానికీ అన్ని కాలాల్లో నడిచే రోడ్డు వేయండి. ప్రతి మండలంలో ప్రసూతి సేవలు అందుబాటులో ఉంచండి. విగ్రహాల ఎత్తు కొలిచే ఉత్సాహం, రోడ్ల నాణ్యత కొలవడంలో చూపండి. లేదంటే 75 కాదు, 100 ఏళ్లు నిండినా ఈ ప్రసవ వేదన తీరదు. ఈ దేశం ఎదురు చూస్తోంది, ఒక తల్లిని భుజాలపై మోసే దుస్థితి చరిత్ర పుటల్లోనే మిగిలిపోయే రోజు కోసం.

జనంసాక్షి సంపాదకీయం

చీకటి తరువాత.. మనిషితనం మిగిల్చిన వెలుగురేఖలు

(చరిత్ర చీకటి పొరల్లోంచి మానవత్వాన్ని అన్వేషించిన ఎం.డి. అబ్బాస్ నవల)

చరిత్రలో అధికారాలు మారతాయి. పాలకులు మారతారు. రాజకీయ వ్యవస్థలు కూలిపోతాయి. కానీ ఆ మార్పుల మధ్య సామాన్య మనుషులు అనుభవించిన భయం, హింస, ఆకలి, అభద్రత, ఆత్మీయత, మానవీయ సంఘర్షణలు అంత సులభంగా చెరిగిపోవు. చరిత్ర పుస్తకాలు సంఘటనలను నమోదు చేస్తాయి. వాటి మధ్య నలిగిపోయిన మనుషుల కన్నీళ్లను, మూగవేదనలను, ఒకరి కోసం మరొకరు నిలబడిన సందర్భాలను సాహిత్యం అక్షరబద్ధం చేస్తుంది. ఎం.డి. అబ్బాస్ రచించిన 'చీకటి తరువాత' అలాంటి మానవీయ అనుభవాలకు అక్షరరూపం ఇచ్చిన నవల.


1947-48 నాటి హైదరాబాద్ సంస్థానంలోని రాజకీయ, సామాజిక సంక్షోభం ఈ నవలకు నేపథ్యం. ఒకవైపు నిజాం నిరంకుశ పాలన, భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం; మరోవైపు రజాకార్ల దౌర్జన్యాలు, సంస్థానం భారత యూనియన్‌లో విలీనం సందర్భంగా జరిగిన సైనిక చర్య, అనంతర హింసాత్మక పరిణామాలు.. ఈ కల్లోల చరిత్ర మధ్య సామాన్య ప్రజల జీవితాలు ఎలా ఛిన్నాభిన్నమయ్యాయో రచయిత చిత్రించారు. ఇది చారిత్రక సంఘటనల వరుస కథనం కాదు. చరిత్ర సృష్టించిన సంక్షోభాన్ని కొన్ని కుటుంబాల జీవితాల ద్వారా, వ్యక్తుల అనుభవాల ద్వారా ఆవిష్కరించిన మానవీయ నవల. రాజకీయ పరిణామాలను వివరించడానికి సుదీర్ఘ ఉపన్యాసాలను ఆశ్రయించకుండా, మూసుకున్న తలుపులు, కిటికీల వెనుక భయంతో తొంగిచూసే చూపులు, నిర్మానుష్య వీధులు, దూరంగా వినిపించే అరుపులు, గుర్రపుడెక్కల చప్పుళ్లు, తుపాకులతో తిరిగే వ్యక్తుల ద్వారా హింసాత్మక వాతావరణాన్ని పాఠకుడి కళ్లముందు నిలుపుతారు. హింసను ప్రత్యక్షంగా వర్ణించకుండానే భయాన్ని అనుభూతి చెందించగలగడం రచయిత కథన నైపుణ్యానికి నిదర్శనం.

చరిత్ర వెనుక దాగిన మనుషులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం భారత ప్రజా పోరాట చరిత్రలో ఒక మహత్తర అధ్యాయం. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన ఆ పోరాటం భూస్వామ్య అధిపత్యాన్ని సవాలు చేసింది. అది కేవలం ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా సాగిన పోరాటం కాదు. ఆత్మగౌరవం, సమానత్వం, సామాజిక విముక్తి కోసం ప్రజలు సాగించిన చారిత్రక ప్రతిఘటన. అదే కాలంలో మతం పేరుతో జరిగిన హింస అనేక ప్రాంతాల్లో ప్రజల జీవితాలను భయభ్రాంతులకు గురిచేసింది. ఈ రెండు పరిణామాల మధ్య సామాన్య ప్రజలు ఎదుర్కొన్న సంక్షోభాన్ని అబ్బాస్ మానవీయ కోణంలో అర్థం చేసుకునే ప్రయత్నం చేశారు. తమ పిల్లలను కాపాడుకోవడానికి తల్లిదండ్రులు పడే ఆరాటం, ప్రాణభయంతో ఇళ్లలో దాక్కున్న కుటుంబాలు, ఎవరిని నమ్మాలో తెలియని పరిస్థితి, పొరుగింటి మనిషిని కూడా అనుమానంతో చూడాల్సి వచ్చిన విషాదం.. ఇవన్నీ నవలలోని కథనానికి ప్రాణం పోశాయి. ఇక్కడ చరిత్రకు కేంద్రం పాలకులు కాదు. అధికారాన్ని చేజిక్కించుకున్నవారు కాదు. ఆ అధికార పోరాటాల మధ్య బతుకును కాపాడుకోవడానికి ప్రయత్నించిన సామాన్య మనుషులు.

కథానాయకుడు ఒక మనిషి.. కథానాయిక మానవత్వం

నవలలో అబ్దుల్ రహీం అనే ఉపాధ్యాయుడు ప్రధాన పాత్ర. ఆయన రాసుకున్న డైరీ కథకు ఆధారం. రహీం, ఆయన స్నేహితుడు రామయ్య, హకీం హుస్సేన్ వంటి పాత్రల చుట్టూ కథనం సాగుతుంది. అయితే ఈ పాత్రలతోపాటు కొన్ని నిర్జీవ వస్తువులు కూడా సజీవ పాత్రలుగా మారడం నవల శిల్పంలోని ప్రత్యేకత. వీధి మొగలోని మల్లెచెట్టు, మల్లెవీధి, రహీం ఇంటి తలుపు, కిటికీ రెక్కలు, రామయ్య మగ్గం.. ఇవన్నీ కథలో ప్రతీకాత్మక ప్రాధాన్యం సంతరించుకుంటాయి. వీటన్నింటిలో రహీం ఇంటి తలుపు నవలకు ప్రధాన ప్రతీక. బయటి ప్రపంచం మతపరమైన అనుమానాలతో, ద్వేషంతో మూసుకుపోతున్నప్పుడు రహీం ఇంటి తలుపు మాత్రం ఆపదలో ఉన్నవారి కోసం తెరుచుకుంటుంది. దారితప్పిన వృద్ధుడు, అలసిపోయిన వృద్ధ దంపతులు, తప్పిపోయిన చిన్నారి, బిడ్డ కోసం వెతుక్కుంటూ వచ్చిన తల్లి.. ఇలా ఆశ్రయం కోరినవారికి ఆ ఇల్లు రక్షణ కల్పిస్తుంది. ఆ తలుపు పేరు అడగదు. మతం అడగదు. ప్రాంతం అడగదు. ఆకలి, దాహం, అలసట, ఆపదను మాత్రమే గుర్తిస్తుంది. ఇది ఒక ఇంటి ఉదారతకు సంబంధించిన సన్నివేశం మాత్రమే కాదు. సమాజం మానవత్వాన్ని కోల్పోతున్నప్పుడు ఒక ఇల్లు మానవత్వానికి చిరునామాగా ఎలా మారుతుందో చెప్పే సాహిత్య ప్రతీక.



మతాల కంటే పెద్దది మనిషి బంధం

మతం పేరుతో మనుషుల మధ్య నిర్మితమవుతున్న విభజనలను రచయిత రోజువారీ జీవితంలోని సహజ అనుభవాలతో ప్రశ్నించారు. మనీదులోని అజాన్‌ను, గుడిలోని సుప్రభాతాన్ని ఒకే గాలి మోసుకొస్తుంది. మల్లెపువ్వు పరిమళానికి మతం తెలియదు. పిల్లలు ఆడుకునే గోలీలకు వారి మతాలతో పనిలేదు. అనారోగ్యం మనిషి మతాన్ని చూసి రాదు. వైద్యం చేసే చేతులు రోగి మతాన్ని బట్టి స్పందించవు. ఈ సాధారణ పరిశీలనల వెనుక బలమైన సామాజిక తాత్వికత ఉంది. మతవిద్వేషం సహజమైన మానవ లక్షణం కాదు. రాజకీయ ప్రయోజనాలు, అధిపత్య భావజాలాలు, విద్వేష ప్రచారాలు మనుషుల మధ్య అనుమానాలను పెంచి, ఒకరిని మరొకరికి శత్రువుగా నిలబెడతాయి. అయితే అదే సమాజంలో ఆ విభజనలను ధిక్కరించి మానవ సంబంధాలను కాపాడే మనుషులూ ఉంటారు. ఈ రెండు ధోరణుల మధ్య సంఘర్షణే నవలలోని అంతర్లీన ఇతివృత్తం. 'జ్వరానికి మతం ఉంటే మందుకూ మతం ఉండేది' అనే భావన ఈ నవల ప్రతిపాదించే మానవీయ దృక్పథానికి ప్రతీక.

డైరీ.. ఒక కాలపు అంతరంగ చరిత్ర

నవల కథనానికి అబ్దుల్ రహీం డైరీ కేంద్రంగా నిలుస్తుంది. డైరీలోని అనుభవాలు, వాటి మధ్య చింపివేయబడిన ఐదు పేజీల ప్రస్తావన కథకు ఉత్కంఠను జోడిస్తాయి. డైరీ వ్యక్తిగత జ్ఞాపకాల భాండాగారం మాత్రమే కాదు. బయట ప్రపంచానికి చెప్పుకోలేని మనిషి అంతరంగానికి అద్దం. భయం, అపరాధభావం, నిస్సహాయత, ఆవేదన, ఆత్మపరిశీలన అందులో చోటు చేసుకుంటాయి. రహీం పాత్రలో ఈ అంతర్మథనం స్పష్టంగా కనిపిస్తుంది. కొందరిని రక్షించగలిగాననే తృప్తి కంటే, తన కళ్లముందే హత్యకు గురైన మరెందరినో కాపాడలేకపోయాననే వేదన ఆయనను వెంటాడుతుంది. ఇది ఒక వ్యక్తి నిస్సహాయత మాత్రమే కాదు. హింసాకాలంలో మానవత్వంతో స్పందించినవారు ఎదుర్కొనే నైతిక సంఘర్షణ.

సున్నితమైన భాష.. పదునైన వ్యక్తీకరణ

అబ్బాస్ భాషలో సరళత ఉంది. వర్ణనల్లో మృదుత్వం ఉంది. సంభాషణల్లో సహజత్వం కనిపిస్తుంది. భావోద్వేగాలను బలవంతంగా పాఠకుడిపై రుద్దకుండా, సన్నివేశాల ద్వారా వాటిని అనుభూతి చెందించే ప్రయత్నం చేశారు. 'మల్లెపూల పరిమళం ఇంకా మనుషులను విడగొట్టడం నేర్చుకోలేదు' అనే భావన ప్రకృతిలోని సహజత్వానికి, మనుషులు నిర్మించుకున్న కృత్రిమ విభజనలకు మధ్య ఉన్న వైరుధ్యాన్ని అద్భుతంగా వ్యక్తం చేస్తుంది. 'చిరిగిన బట్టను మగ్గం మళ్లీ అల్లగలదు. చిరిగిన మనసులను మాత్రం ఒకరికి ఒకరు మాత్రమే అల్లగలం' అనే భావనలోనూ రచయిత సృజనాత్మకత కనిపిస్తుంది.

చరిత్రను గుర్తుంచుకోవడం అంటే ప్రతీకారం కాదు

'చీకటి తరువాత' ప్రాసంగికత 1947-48 చారిత్రక సందర్భానికే పరిమితం కాదు. నేటి భారత సమాజంలోనూ మతం పేరుతో విభజనలు, విద్వేష ప్రచారాలు, చరిత్రకు వక్రీకరణలు కొనసాగుతున్నాయి. ఒక సమూహం పట్ల మరొక సమూహంలో భయాన్ని సృష్టించడం రాజకీయ ప్రయోజనాలకు సాధనంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో గతాన్ని సాహిత్య రూపంలో గుర్తుచేయడం వర్తమానాన్ని ప్రశ్నించడమే. అయితే మతవిద్వేషాన్ని కొందరు వ్యక్తుల వ్యక్తిగత దుర్మార్గానికి మాత్రమే పరిమితం చేయలేం. దాని వెనుక అధికారం, రాజకీయ ప్రయోజనాలు, సామాజిక ఆధిపత్యం, చారిత్రక అసమానతలు పనిచేస్తుం టాయి. ఈ నిర్మాణాత్మక కారణాలను అర్థం చేసుకున్నప్పుడే మానవీయతకు సంబంధించిన చర్చ సంపూర్ణమవుతుంది. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట నేపథ్యాన్ని ఎంచుకున్న రచయితకు ఇక్కడ మరింత విస్తృతమైన చారిత్రక అవకాశముంది. ఆ పోరాటం భూస్వామ్య దోపిడీని మాత్రమే కాకుండా, సామాజిక ఆధిపత్యాన్ని కూడా సవాలు చేసింది.

చీకటి తరువాత.. మిగిలేది మనిషితనమే..

ఒక మంచి నవల పఠనం ముగిసిన తరువాత కూడా పాఠకుడి ఆలోచనల్లో కొనసాగుతుంది. అందులోని పాత్రలు, సన్నివేశాలు వర్తమాన జీవితాన్ని కొత్తగా చూసేలా చేస్తాయి. 'చీకటి తరువాత' అలాంటి ప్రశ్నలను మిగిల్చే రచన. ఇది హింసాకాలపు కథ మాత్రమే కాదు. హింసకు ఎదురొడ్డి నిలిచిన మనుషుల కథ. మతం పేరుతో మనుషులు విడిపోతున్నప్పుడు, మానవత్వం వారిని ఎలా కలుపుతుందో చెప్పే కథ. భయం చుట్టుముట్టినప్పుడు ఒకరి కోసం మరొకరు నిలబడే ధైర్యానికి అక్షరరూపం. రహీం ఇంటి తలుపు ఈ నవలలో ఒక సామాజిక విలువకు ప్రతీకగా నిలుస్తుంది.

ఎం.డి. అబ్బాస్‌కు ఇది తొలి నవల. ఉద్యమ జీవితంలో ప్రజలతో, వారి సమస్యలతో ఏర్పడిన అనుబంధం ఒక సృజనాత్మక రచనగా రూపాంతరం చెందడం అభినందనీయం. ఉద్యమ నేపథ్యం ఉన్న రచయిత సిద్ధాంత ప్రకటనలకు పరిమితం కాకుండా, మానవ జీవితంలోని సున్నితమైన భావోద్వేగాలను కథగా మలచడం ఈ రచనలోని విశేషం. సాహిత్యం చరిత్రను ప్రశ్నించాలి. సమాజంలోని వైరుధ్యాలను ఆవిష్కరించాలి. మనిషిని మనిషికి దగ్గర చేయాలి. ఆ దిశగా సాగిన ప్రయత్నంగా 'చీకటి తరువాత' నిలుస్తుంది. చీకటి ఎంత గాఢంగా ఉన్నా మనిషిలోని మంచితనాన్ని పూర్తిగా చంపలేదని ఈ నవల చెబుతుంది. ద్వేషం మనుషుల మధ్య గోడలు నిర్మించ వచ్చు. కానీ ఆ గోడలను కూల్చే శక్తి కూడా మనుషుల్లోనే ఉంది. చీకటి తరువాత వెలుగు రావడం ప్రకృతి ధర్మం. మనుషుల మధ్య చీకటిని తొలగించి ఆ వెలుగును నిల బెట్టడం మాత్రం సామాజిక బాధ్యత. ఆ బాధ్యతను గుర్తుచేసే మానవీయ నవల 'చీకటి తరువాత'.



పుస్తకం : చీకటి తరువాత
రచయిత: ఎం.డి. అబ్బాస్

మామిండ్ల రమేష్ రాజా
సెల్ : 7893230218

జనంసాక్షి

కలల రెక్కలు

రెక్కలోచ్చి పిల్లలు
పై చదువుల కొకరు
బతుకుదెరువు కొకరు
ఇంటినివదిలి..
కడదాకా ప్రయాణించకుండానే
ఊరు వదిలి వెళ్తున్నారు

ఒక్కలు ఇద్దరయ్యాక
ఇద్దరం నలుగురు అయ్యాక
ఉన్నంతకాలం పండుగే
కానీ కాలం కొత్త రెక్కలు ఇచ్చినప్పుడు
ఎగిరి తీరాల్సిందే!

బరువెక్కిన గుండెతోనైనా,
బంగారు భవిష్యత్తు కోసం
ఎగిరి తీరాల్సిందే!
కొత్త అవకాశాలను
వెతుక్కోవాల్సిందే!

కాలం ఎప్పుడూ ఒకేలా
ఉండదు కదా!
గూడు దాటి ఎగరమని,
ఆకాశపు అంచులను తాకమని
కాలం కొత్త రెక్కలు తొడిగినప్పుడు
యధార్థాన్ని అంగీకరించి తీరాలి!!

కలిసున్న ప్రతి క్షణం
ఒక పండుగగా మలచుకోవడం
ప్రేమ పంచుకున్న ప్రతి రోజు
ఒక వేడుకగా ఆనందించడమే
కావాలి ఇప్పుడు
అలవాటైన ఆత్మీయ
బంధాలను దాటి,
కన్నీటి పారలను వెనుకకు నెట్టి,
మారిన వాస్తవాన్ని స్వీకరించడమే
అసలు జీవితం
యదార్థాన్ని అంగీకరించి
ముందుకు
సాగిపోవడమే నిత్య సత్యం
ఒక్కోసారి నిత్యసత్యం అయినా
బాధను అలవాటు
చేసుకోవలసిందే!!

ఒక్కోసారి గుండె
జల్లుమంటుంది
ఈ మలి సంధ్యలో
రేపు ఎట్లా తెల్లారుద్దో అనీ!
వచ్చినచోటికి వెళ్లడం అంటే
మళ్లీ రాని చోటనే ఎరుక
నీకైనా! నాకైనా!

అనిత కృష్ణ గండమళ్ళ
9490876621

జనంసాక్షి

కమ్యూనిస్టులను తిట్టిన గొంతుకకు..
ఎర్రవేదికపై ఆహ్వానమా..?

కమ్యూనిస్టులను విమర్శిస్తూ పాట పాడిన గొంతుకకు.. కమ్యూనిస్టుల అనుబంధ సంఘం జాతీయ సభలో ఎర్రతివాచీ పరిచారు..! ఒకవైపు కమ్యూనిస్టులను అవమానించే పాటలు.. మరోవైపు అదే ఉద్యమానికి చెందిన వేదికపై సన్మానాలు, ప్రశంసలు..! ఇదెక్కడి రాజకీయ నీతి..? ఇదెక్కడి భావజాల నిబద్ధత..? నల్లగొండ గద్దర్‌గా ప్రచారంలో ఉన్న కాసర్ల నర్సిరెడ్డి వ్యవహారం కంటే, ఆయనను ఆహ్వానించి ప్రత్యేక ప్రాధాన్యత కల్పించిన సీపీఎం నాయకత్వం వైఖరే ఇప్పుడు అసలు చర్చనీయాంశం.

కమ్యూనిస్టులను ఉద్దేశించి 'మదమెక్కిన కమ్యూనిస్టులు' అంటూ పాట పాడిన వ్యక్తిని, అదే కమ్యూనిస్టు ఉద్యమానికి అనుబంధంగా ఉన్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభల వేదికపైకి ఎందుకు ఆహ్వానించినట్లు..? ఆయన గత పాటల గురించి నాయకత్వానికి తెలియదా..? తెలిసి కూడా ఆహ్వానించారా..? తెలిస్తే ఏ ప్రాతిపదికన..? తెలియకపోతే జాతీయ స్థాయి సభ నిర్వహణలో నాయకత్వం బాధ్యత ఏమైంది..? ఒక కళాకారుడికి ఏ పార్టీ కోసం పాట పాడాలన్న స్వేచ్ఛ ఉంటుంది. కానీ తనను విమర్శించిన గొంతుకకు వేదిక కల్పించిన పార్టీకి కూడా తన నిర్ణయాన్ని సమర్థించుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. విమర్శను సహించే విశాల దృక్పథమైతే అందులో తప్పులేదు. కానీ ఆహ్వానం వెనుక రాజకీయ లెక్కలుంటే వాటిని కూడా ప్రశ్నించాల్సిందే..!



ఇక నర్సిరెడ్డి రెడ్డి సామాజికవర్గానికి చెందినవారు. స్థానిక సీపీఎం నాయకత్వంలోనూ రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేతల ప్రాధాన్యత ఉంది. మరి ఈ ఆహ్వానం వెనుక నిజంగా కళాత్మక ప్రతిభకు గుర్తింపా..? స్థానిక రాజకీయ పరిచయాల ప్రభావమా..? లేక కుల సమీకరణాలకు కూడా చోటు కల్పించారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది నిర్ధారిత ఆరోపణ కాదు. కానీ ఇలాంటి సందేహాలకు తావిచ్చే నిర్ణయాలపై నాయకత్వం వివరణ ఇవ్వాలి. మరో రెడ్డి నాయకుడు ఇదే వేదికపై నర్సిరెడ్డిని పొగుడుతూ, ఆయన పాటల ద్వారా ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులను కూడా చేయగలిగారని వ్యాఖ్యానించటం విడ్డూరమే. ఇదేనా ప్రజా కళకు ఇచ్చే గౌరవం..? ప్రజలను చైతన్యపరిచే పాట కంటే నాయకులను అధికార పీఠాలపై కూర్చోబెట్టే పాట గొప్పదైందా..? ఒక కళాకారుడి సామర్థ్యాన్ని నాయకులను తయారుచేసే ప్రచార యంత్రంగా అభివర్ణించడం వెనుక ఉన్న రాజకీయ దృక్పథం ఏమిటో ఆ నాయకత్వానికే తెలియాలి.

అంతేకాదు దశాబ్దాల చరిత్ర కలిగిన ప్రజానాట్యమండలి ఉంది. ప్రజా పోరాటాల్లో పుట్టి, కార్మికులు, రైతులు, కూలీలు, అణగారిన వర్గాల జీవితాలను పాటలుగా మలిచిన కళాకారులున్నారు. ప్రజా సాంస్కృతిక వారసత్వాన్ని మోస్తున్న సంస్థాగత బలం ఉంది. అలాంటప్పుడు నాయకుల ప్రచార గీతాలతో గుర్తింపు పొందిన కళాకారుడిని మరీ అరువు తెచ్చుకొని ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఏమొచ్చింది..?. తమకంటూ చరిత్ర, కళాకారులు, సాంస్కృతిక సంపద ఉన్న పార్టీకి బయట నుంచి ప్రచార గాయకుడిని తెచ్చి పెద్దపీట వేయాల్సిన దుస్థితి ఎందుకు..? ప్రజానాట్యమండలి కళాకారుల ప్రతిభపై నమ్మకం లేదా..? లేక పార్టీకి ఇప్పుడు ప్రజా పాటల కంటే రాజకీయ నాయకుల కీర్తనలే ఎక్కువ అవసరమయ్యాయా..? ఇది కేవలం ఒక కళాకారుడికి ఇచ్చిన ఆహ్వానం కాదు. ప్రజా సాంస్కృతిక సంస్థల ప్రాధాన్యత, వాటి వారసత్వం, ఉద్యమాల పట్ల నాయకత్వానికి ఉన్న గౌరవాన్ని పరీక్షించే అంశంగా చూడక తప్పదు కదా..!

ప్రజాయుద్ధనౌక గుమ్మడి విఠల్‌రావు గద్దర్ పాటలో ఆకలి ఉంది. ఆవేదన ఉంది. తిరుగుబాటు ఉంది. పాలకులను నిలదీసే ప్రశ్న ఉంది. ఆయన గాత్రాన్ని పోలినంత మాత్రాన ఆయన చారిత్రక పాత్రను సొంతం చేసుకోలేరు. గద్దర్ పేరు ఒక ప్రచార గుర్తింపు కాదు. అది ప్రజా పోరాటాల నుంచి రూపుదిద్దుకున్న సాంస్కృతిక చరిత్ర. పార్టీల అవసరాలకు అనుగుణంగా నాయకుల ప్రచార గీతాలు పాడటం కళాకారుడి వృత్తి స్వేచ్ఛ కావచ్చు. కానీ అలాంటి పాటలనే ప్రజా కళకు ప్రమాణంగా చూపించడం మాత్రం ప్రశ్నించాల్సిన విషయమే. గద్దర్ గొంతును అనుకరించడం కంటే ఆయన పాటలోని ప్రజా చైతన్యాన్ని అర్థం చేసుకోవడం ఎంతో ముఖ్యం.

చివరగా సీపీఎం నాయకత్వానికి సూటి ప్రశ్న ఏంటంటే...కమ్యూనిస్టులను అవమానిస్తూ పాట పాడిన వ్యక్తిని మీ జాతీయ సభకు ఎందుకు ఆహ్వానించారు..? ప్రజానాట్యమండలి ఉండగా ఆయనకే ఎందుకు ప్రత్యేక ప్రాధాన్యత..? స్థానిక కుల, రాజకీయ సమీకరణాలకు ఈ నిర్ణయంలో పాత్ర ఉందా..? నాయకులను అధికారంలోకి తీసుకురాగలిగే ప్రచార పాటలే మీకు ప్రజా సాంస్కృతిక ప్రతిభకు కొలమానమా..? కమ్యూనిస్టు ఉద్యమం ప్రజల కోసం పుట్టింది. దాని సాంస్కృతిక వేదికలు నాయకుల కీర్తనల కోసం కాదు. ప్రజలను ప్రశ్నించేలా, పోరాడేలా, చైతన్యపరిచేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వాటిపై ఉంది. కమ్యూనిస్టులను తిట్టిన గొంతుకకు వేదిక ఇవ్వడం మీ విశాల దృక్పథమైతే.. ఆ పాటలోని భావజాలంపై మీ వైఖరి ఏమిటో చెప్పండి. ప్రజానాట్యమండలిని పక్కనపెట్టి ప్రచార గాయకుడికి ప్రాధాన్యత ఇవ్వడం మీ కళాత్మక ఎంపికైతే.. ఆ ఎంపికకు ప్రాతిపదిక ఏమిటో వివరించండి. ఎర్రజెండా కింద ఎవరు పడితే వారు పాట పాడొచ్చు. కానీ ఆ జెండా చరిత్రను, విలువలను, త్యాగాలను రాజకీయ అవసరాలకు తాకట్టు పెట్టే హక్కు ఎవరికీ లేదు.

ఎర్రజెండా వేదికపై పాట పాడినంత మాత్రాన ప్రజా కళాకారులు కాలేరు. గద్దర్ పేరు పెట్టుకున్నంత మాత్రాన గద్దర్ వారసులు కాలేరు. ప్రజల పక్షాన నిలిచినప్పుడే పాటకు విలువ.. ఆ విలువను కాపాడినప్పుడే ఉద్యమాలకు గౌరవం..!



దారా
rajenderdamera@gmail.com

ప్రజాస్వామ్య మహాకావ్యం, ఆధునిక యువతకు దిక్సూచి

నవంబర్ 26, 1949.. భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక సువర్ణాక్షర ఘట్టం. వందల ఏళ్ల బానిసత్వాన్ని ఛేదించుకుని, స్వతంత్ర భారతదేశానికి అసలైన దిశానిర్దేశం చేసే మహాగ్రంథాన్ని మనం ఆమోదించుకున్న చారిత్రాత్మక రోజు ఇది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నేతృత్వంలోని ముసాయిదా కమిటీ 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు అహర్నిశలు శ్రమించి ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాన్ని అందించింది. ఈ మహాయజ్ఞంలో కేవలం పురుషులే కాదు, రాజ్యాంగ పరిషత్‌లోని 15 మంది మహిళా సభ్యులు (దుర్గాబాయి దేశ్‌ముఖ్, హంసా మెహతా వంటి దార్శనికులు) లింగ సమానత్వం, సామాజిక న్యాయం కోసం గట్టిగా గళమెత్తి కీలక పాత్ర పోషించారు.

ప్రపంచంలోని అనేక దేశాల రాజ్యాంగాలలోని ఉత్తమ అంశాలను గ్రహించి, మన దేశ భిన్నత్వానికి అనుగుణంగా మన రాజ్యాంగాన్ని తీర్చిదిద్దుకున్నాం. కాలానుగుణ మార్పులకు అనువుగా ఉండే సరళత్వం, అదే సమయంలో దేశ మౌలిక విలువలను కాపాడే దృఢత్వం దీని సొంతం. శాసన, కార్యనిర్వాహక శాఖల ఒత్తిళ్లకు తలొగ్గకుండా పౌరుల హక్కులను కాపాడేందుకు స్వతంత్ర సుప్రీంకోర్టును ఏర్పాటు చేయడం ఈ రాజ్యాంగం యొక్క మరో గొప్ప విశిష్టత.

బ్రిటిష్ వారు రూపొందించిన '1935 భారత ప్రభుత్వ చట్టం' నుండి మనం కొన్ని పరిపాలనా అంశాలను తీసుకున్నప్పటికీ, 1949 రాజ్యాంగం దానికి పూర్తి భిన్నమైన, అత్యున్నతమైన ఆధునిక రూపం. 1935 చట్టం బ్రిటిష్ పార్లమెంట్ ఆధిపత్యానికి లోబడి ఉంటే, 1949 రాజ్యాంగం పూర్తి సార్వభౌమాధికారాన్ని భారత ప్రజలకు అందించింది. నాటి చట్టంలో పౌరులకు ఎలాంటి ప్రాథమిక హక్కులు లేవు; కేవలం ఆస్తి, విద్య ఉన్న 10-14 శాతం మందికే ఓటు హక్కు ఉండేది. కానీ మన రాజ్యాంగం కుల, మత, ఆర్థిక తారతమ్యాలు లేకుండా వయోజనులందరికీ సమాన ఓటు హక్కును, తిరుగులేని ప్రాథమిక హక్కులను ప్రసాదించింది. రాజ్యాంగ పరిషత్ తీసుకున్న అత్యంత సాహసోపేతమైన నిర్ణయం 'వయోజన సార్వత్రిక ఓటు హక్కు' (ఆర్టికల్ 326). అప్పట్లో దేశంలో పేదరికం, నిరక్షరాస్యత ఎక్కువగా ఉన్నందున, "చదువు లేని సామాన్యులకు ఓటు హక్కు ఇస్తే ప్రజాస్వామ్యం నిలబడుతుందా?" అని కొందరు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే అంబేద్కర్, నెహ్రూ వంటి నేతలు సామాన్యుడి విజ్ఞతను బలంగా నమ్మారు. ఓటు అనే ఆయుధాన్ని చేతికిస్తేనే వారిలో రాజకీయ చైతన్యం వస్తుందని, సామాజిక వివక్షలు తొలగిపోతాయని వాదించారు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో మహిళలకు, పేదలకు ఓటు హక్కు రావడానికి దశాబ్దాల పోరాటాలు జరిగితే, భారత్ తొలిరోజే అందరికీ సమాన ఓటు హక్కు ఇచ్చి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది.

రాజ్యాంగంలోని 3వ భాగం (ఆర్టికల్ 12 నుండి 35 వరకు) ప్రతి పౌరుడికి తిరుగులేని హక్కులను కల్పించింది. ఆర్టికల్ 12,

బొంగులూరు క్యాంపస్‌లో విషాదం

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య.. శ్రీ చైతన్య క్యాంపస్ వద్ద ఉద్రిక్తత

- గృహప్రవేశానికి వెళ్లేందుకు సెలవు అడిగిన కార్తీక్
- అనుమతి నిరాకరణ, ప్రిన్సిపాల్ తిట్టారన్న మనస్తాపం
- కళాశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన..
- ఆందోళనకారులపై పోలీసుల పోలీసుల లాఠీచార్జి
- కుమారుడి మరణవార్త విని గేటు వద్దే సొమ్మసిల్లిన తల్లి





రంగారెడ్డి, నవంబర్ 20(జనంసాక్షి):
రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం బొంగులూరు శ్రీ చైతన్య జోనల్ క్యాంపస్‌లో శుక్రవారం తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కళాశాలలో ఇంటర్మీడియట్ బైపీసీ ప్రథమ సంవత్సరం చదువుతు న్న ఎస్. కార్తీక్ (16) హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెలవు ఇవ్వకపోగా, ప్రిన్సిపాల్ అసభ్య పదజాలంతో దూషించడంతోనే మనస్తాపానికి గురై కార్తీక్ తన గదిలో ఫ్యానుకు ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడ్డాడని తోటి విద్యార్థులు ఆరోపిస్తుండటం స్థానికంగా కలకలం రేపింది. అందుకు సంబంధించిన వివరాలు..

కందుకూరు మండలం జైత్వారం గ్రామానికి చెందిన శేరిగూడ విజయలక్ష్మి, ప్రభాకర్ దంపతుల కుమారుడు కార్తీక్ బొంగులూరు శ్రీ చైతన్య జోనల్ క్యాంపస్‌లో ఉంటూ బీటెక్ మొదటి సంవత్సరం చదువుకుంటున్నాడు. ఈ నెల 26న తమ స్వగ్రామంలో నూతన గృహప్రవేశ వేడుక ఉండటంతో, ఇంటికి వెళ్లేందుకు సెలవు ఇవ్వాలని గత రెండు రోజులుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. రమేష్ బాబును కార్తీక్ కోరుతున్నాడు. అయితే "ఇంకా సమయం ఉంది కదా, ఇన్ని రోజుల ముందు సెలవు ఎందుకు?" అంటూ ప్రిన్సిపాల్ సెలవు నిరాకరించాడు. అంతే కాకుండా, అందరి ముందు విద్యార్థిని అసభ్య పదజాలంతో తిట్టడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కార్తీక్, శుక్రవారం మధ్యాహ్నం తన హాస్టల్ గది నంబర్ 1071 లోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం గదిని శుభ్రం చేసేందుకు వెళ్లిన స్వీపర్ ఫ్యానుకు వేలాడుతు న్న కార్తీక్‌ను చూసి వెంటనే యాజమాన్యానికి సమాచారం అందించింది. హుటాహుటి న ఆసుపత్రికి తరలించగా, అప్పటికే విద్యార్థి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

కళాశాల వద్ద ఉద్రిక్తత..
విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద ఎత్తున శ్రీ చైతన్య జోనల్ కళాశాల వద్దకు చేరుకు ని ఆందోళనకు దిగారు. కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన దిగారు. దీంతో ఆగ్రహించిన విద్యార్థి సంఘాల నాయ కులు ప్రధాన గేటును ఒక్కసారిగా తోసివేసి లోపలికి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో నాయకులు గేటు వద్దే బైఠాయించి యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కళాశాల ఆధ్వర్యంలో మోసం చేశారు. ప్రిన్సిపల్ ఛాంబర్ లోని ఫర్నిచర్లు కుటుంబ సభ్యులు ఎత్తిపడేశారు. దాంతో పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో విద్యార్థి సంఘాల నాయకులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. ఆందోళనకారులను ప్రధాన గేటు బయటకు తరిమారు.

గేటు వద్దే సొమ్మసిల్లి పడిపోయిన తల్లి..
కుమారుడి మరణవార్త తెలుసుకున్న తల్లిదండ్రులు విజయలక్ష్మి, ప్రభాకర్ హుటాహుటిన కళాశాల వద్దకు చేరుకున్నారు. ప్రధాన గేటుకు తాళం వేసి ఉండటంతో లోపలికి వెళ్లలేక తల్లి విజయలక్ష్మి గేటు వద్దే బోరున విలపిస్తూ సొమ్మసిల్లి పడిపోయింది. "నాకున్న ఇద్దరు కొడుకుల్లో ఒకడు దూరమయ్యాడు.. నా కొడుకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదు" అంటూ ఆ తల్లి గుండెలవిసేలా రోదించడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది. వెంటనే స్పందించిన పోలీసులు తల్లిదండ్రులను లోపలికి అనుమతించి, ఘటనపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేస్తామని సముదాయించారు.

పోలీసుల విచారణ.. భారీ బందోబస్తు
ఘటనా స్థలానికి పోలీసులు ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. శంషాబాద్ డీసీపీ రాజేష్, ఆదిభట్ల ఏసీపీ ప్రదీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సీఐ రమేష్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది కళాశాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆందోళనకారులు, కుటుంబ సభ్యులతో పోలీసులు చర్చలు జరుపుతూ సంయమనం పాటించాలని కోరారు. విద్యార్థి మృతికి గల పూర్తి కారణాలపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన
నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలి

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలి: జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్

హయత్ నగర్, నవంబర్ 20 (జనంసాక్షి) : నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న దళిత మహిళ చందుపట్ల రమణ (45)పై దాడికి పాల్పడిన బాలకృష్ణ అనే వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ ఘటనను నిరసిస్తూ ఈరోజు వనస్థలిపురంలోని శ్రీ వెంకటరమణ కాలనీ చౌరస్తాలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, కార్యదర్శి పారానంది శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ.. నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 45వ డివిజన్‌లో పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న చందుపట్ల రమణ చెత్త సేకరిస్తున్న సమయంలో ట్రాక్టర్‌పై నిలబడి చెత్తను తీసుకునే క్రమంలో ఇసుకతో నిండిన బస్తాను పైకి ఎత్తలేకపోయిందని తెలిపారు. దీంతో ఆగ్రహానికి గురైన బాలకృష్ణ అనే వ్యక్తి ఆమెను కులం పేరుతో దూషిస్తూ, అసభ్య పదజాలంతో అవమానించడమే కాకుండా సెంట్రింగ్ కర్రతో కాళ్లపై విచక్షణారహితంగా దాడి చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు అడ్డుకున్నప్పటికీ నిందితుడు తిరిగి దాడికి ప్రయత్నించడం అత్యంత దారుణమని ఖండించారు. రెక్కాడితే గానీ డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన దళిత మహిళపై ఇలాంటి దాడికి పాల్పడటం అమానవీయమని ఆయన అన్నారు. పారిశుద్ధ్య కార్మికుల పట్ల చిన్నచూపు, వారిని చులకనగా చూసే ధోరణి వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధితురాలిని నిందితుడి తల్లి కూడా దుర్భాషలాడినట్లు తమకు తెలిసిందని పేర్కొన్నారు.ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపి దాడికి పాల్పడిన ప్రధాన నిందితుడితో పాటు, కులం పేరుతో దూషించిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి మెరుగైన వైద్యం, తగిన భద్రత కల్పించి న్యాయం చేయాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులపై భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నిందితుడిని తక్షణమే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిహెచ్ఎంసి ఎంప్లాయిస్ యూనియన్ రంగారెడ్డి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ నిరసన కార్యక్రమంలో ఎల్లమ్మ, అరుణ, సుగుణమ్మ, ధనమ్మ, సీతమ్మ, రమేష్, శ్రీను, మహేష్, బుచ్చమ్మ, అంజమ్మ, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి
- రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట : ఎమ్మెల్యే కాలే యాదయ్య



చేవెళ్ల, నవంబర్ 20 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. గురువారం చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్‌లో ఎమ్మెల్యే కాలే యాదయ్య, అదనపు కలెక్టర్ కిరణ్మయి తో కలిసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలోని సంపాదించే వ్యక్తికి ఈ పథకం కింద జీవిత బీమా కల్పిస్తామని తెలిపారు. బీమా పొందిన వ్యక్తి మరణిస్తే నామినీకి రూ.5 లక్షల పరిహారం అందజేస్తామని వివరించారు. ఇప్పటికే ఇతర బీమా పథకాల పరిధిలో లేని కుటుంబాలకు కూడా ఈ పథకం ద్వారా రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాలు, మున్సిపల్ వార్డుల్లో ప్రత్యేక బృందాల ద్వారా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపడుతున్నామని, నెల రోజుల్లోగా నమోదు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు ప్రతులతో పాటు కుటుంబ సభ్యులు, నామినీల వివరాలతో నమోదు శిబిరాలకు హాజరుకావాలని సూచించారు. అదనపు కలెక్టర్ కిరణ్మయి మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా ఈ పథకం అండగా నిలుస్తుందని తెలిపారు. బీమాపై అపోహలు వీడి ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. ప్రభుత్వం కుటుంబ యజమాని పేరున బీమా ప్రీమియం చెల్లించి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం గొప్ప విషయమన్నారు. గ్రామస్థాయిలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అర్హులందరికీ పథకంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు దేవర సమతావెంకట్ రెడ్డి, సోనియా దర్శన్, సొసైటీ చైర్మన్లు వెంకట్ రెడ్డి, గోనె ప్రతాప్ రెడ్డి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జె.పద్మావతి, ఆర్డీఓ పార్థసింహా రెడ్డి, సీపీఓ సౌమ్య, తహసీల్దార్లు క్రిష్ణయ్య, గౌతమ్ కుమార్, అన్వర్, సురేందర్, ఎంపీడీఓలు బన్సీలాల్, హిమబిందు, కౌన్సిలర్లు కళ్యాణి యాదగిరి, దావల్గారి గోపాల్ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, మద్దెల శ్రీనివాస్, కృష్ణా నాయక్, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం

- నేరం రుజువు కావడంతో కోర్టు తీర్పు
- పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన ఎస్పీ
- మహిళలు, బాలికలపై నేరాల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం: స్నేహా మెహ్రో



వికారాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనంసాక్షి):బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కారాగార శిక్ష విధిస్తూ వికారాబాద్ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు తీర్పు వెలువరించింది. బాధితురాలికి ప్రభుత్వం తరఫున రూ.10 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రో ఒక ప్రకటనలో వెల్లడించారు. తాండూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన ఘటనపై క్రైమ్ నంబర్ 76/2017గా పోక్సో, ఐపీసీ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాల కింద కేసు నమోదైంది. జినుగుర్తి గ్రామానికి చెందిన బండమిడి నర్సింలు (37)పై నేరం రుజువు కావడంతో మొదటి అదనపు జిల్లా, సెషన్స్ జడ్జి ప్రదీప్ నాయక్ 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఈ కేసులో అప్పటి తాండూరు ఎస్‌హెచ్‌ఓ వెంకట రామయ్య, డీఎస్పీ రామచంద్రుడు దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుత తాండూరు ఎస్‌హెచ్‌ఓ పరమేశ్వర్ గౌడ్ తదుపరి ప్రక్రియలను సమన్వయం చేశారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెరాజ్ ఫిర్దౌస్ కోర్టులో వాదనలు వినిపించగా, భరోసా కేంద్రం ప్రతినిధి కీర్తి ఆకుల బాధితురాలికి న్యాయ సహకారం అందించారు. కోర్టు డ్యూటీ, లైజన్ బాధ్యతలు నిర్వహించిన సిబ్బంది కూడా కేసు పరిష్కారంలో కీలకంగా వ్యవహరించారు. నిందితుడికి శిక్ష పడేలా సమన్వయంతో పనిచేసిన పోలీసు అధికారులు, సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూట ర్, భరోసా కేంద్రం సిబ్బందిని ఎస్పీ అభినందించారు. మహిళలు, బాలికలపై నేరాల విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని, బాధితులకు న్యాయం జరిగేలా పకడ్బందీ దర్యాప్తు చేపట్టి నేరం రుజువయ్యే ఆధారాలను కోర్టుకు సమర్పించాలని సూచించారు.

ఇబ్రహీంపట్నంలో కలకలం

గాంధీనగర్ కాలనీలో మనిషి పుర్రె లభ్యం.. మొన్న కాలు.. నేడు పుర్రె

వరుసగా బయటపడుతున్న మానవ అవశేషాలు స్థానికుల్లో తీవ్ర ఆందోళన

రంగంలోకి దిగిన పోలీసులు.. అన్ని కోణాల్లో ముమ్మర దర్యాప్తు

రంగారెడ్డి, నవంబర్ 20 (జనంసాక్షి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని గాంధీనగర్ కాలనీలో మనిషి పుర్రె లభ్యం కావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇటీవల ఇదే ప్రాంతంలో మనిషి కాలుగా భావిస్తున్న అవశేషం బయటపడగా, తాజాగా పుర్రె కూడా లభ్యం కావడంతో ఈ ఘటన ఇబ్రహీంపట్నంలో చర్చనీయాంశంగా మారింది. గాంధీనగర్ కాలనీ పరిసరాల్లో కొద్ది రోజుల వ్యవధిలోనే వరుసగా మానవ శరీర భాగాలు బయటపడుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎవరైనా హత్య చేసి ఇక్కడ పడేశారా? లేక వీధి కుక్కలు ఎక్కడి నుంచైనా వీటిని ఈడ్చుకువచ్చాయా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. లభ్యమైన పుర్రెను స్వాధీనం చేసుకుని, పరిసర ప్రాంతాల్లో పరిశీలించారు. ఇటీవల లభించిన కాలు, తాజాగా బయటపడిన పుర్రె ఒకే వ్యక్తికి సంబంధించినవా? లేక వేర్వేరు ఘటనలకు సంబంధించి నవా? అనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అవశేషాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. చుట్టుపక్కల పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన మిస్సింగ్ కేసుల వివరాలను సైతం పరిశీలిస్తున్నారు. వరుస ఘటనలతో గాంధీనగర్ కాలనీ పరిసరాల్లో భయానక వాతావరణం నెలకొంది. పోలీసుల పూర్తి స్థాయి విచారణ, ఫోరెన్సిక్ నివేదికల తర్వాతే ఈ మిస్టరీ వీడే అవకాశం ఉంది.

నింబాచాల లక్ష్మీ నరసింహస్వామిని దర్శించుకున్న మంత్రి సీతక్క

భీంగల్ నవంబర్ 20 జనం సాక్షి:
నిజామాబాద్ జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం శాసన మండలి సభ్యులు బి. మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి భీమ్గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రి గుట్టను సందర్శించి, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చరిత్రను ఆలకించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఆలయం వద్ద రూ.4 కోట్ల నిధుల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వసతి గృహానికి మంత్రి శంకుస్థాపన చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి మంత్రి సీతక్కకు పూల మొక్క అందించి ఘన స్వాగతం పలుకగా, ఆలయ సంప్రదాయాన్ని అనుసరిస్తూ మంత్రికి స్వామివారి పట్టు వస్త్రాలు సమర్పించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేదలకు ఆర్థిక భరోసా

- పడకల్ గ్రామంలో జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



తలకొండపల్లి నవంబర్ 20 (జనంసాక్షి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి ఆపద సమయంలో అండగా నిలవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని తలకొండపల్లి మండలం పడకల్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా శనివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,రంగారెడ్డి జిల్లా సీఈవో కృష్ణారెడ్డి,గ్రామ సర్పంచ్ డోకూరు సునీత ప్రభాకర్ రెడ్డి,తో కలిసి బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని,ఇందులో భాగంగా తలకొండపల్లి మండలం పడకల్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోని పరిస్థితుల్లో మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఐదు లక్షల జీవిత బీమా అందించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశం అని స్పష్టం చేశారు.గ్రామంలో రేషన్ కార్డు కలిగి 18 నుంచి 59 ఏళ్ల వయసు కలిగిన ప్రతి కుటుంబం తప్పనిసరిగా బీమాను చేయించుకోవాలని ప్రజలకు తెలిపారు.ప్రతి కుటుంబం బీమా పరిధిలోకి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని,పడకల్ గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు విజయవంతమైతే మండలంలోని అన్ని గ్రామాలకు,తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఈ పథకాన్ని విస్తరిస్తామని ఆయన స్పష్టం చేశారు.గ్రామంలోని అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో చేరి లబ్ధి పొందాలని,ఎవరూ మిగిలిపోకుండా చూడాలని అధికారులకు సూచించారు.బీమా పథకం గురించి గ్రామంలో విస్తృతంగా అవగాహన కల్పించాలని,ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు తెలియజేయాలని కోరారు.అంతకముందు సర్పంచ్ డోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు.ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి మా గ్రామాన్ని ఎంపిక చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి,మండల స్పెషల్ ఆఫీసర్ అంకం రాజు,ఆమనగల్ పిఏసిఎస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాసు శ్రీనివాస్ రెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు డోకూరు ప్రభాకర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరసింహా,ఎంపీడీవో సీతా రామమ్మ,డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి,ఎంఈఓ చాప్లా నాయక్,బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి,నాయకులు భగవాన్ రెడ్డి,రమేష్ యాదవ్, శ్రీశైలం, రేణురెడ్డి ఆవంచ నర్సింహారెడ్డి, రఘుపతి, అజీమ్, రాఘవేందర్ గౌడ్, రాజేందర్ నాయక్, అజీజ్, ఆరిఫ్, చెన్నకేశవులు, సురేష్, జాజాల నరేష్, పంచాయత కార్యదర్శి,వార్డు సభ్యులు, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, బీమా సంస్థ ప్రతినిధులు, వైద్య అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆ ఐదు లక్షలు, ఎక్కడివి..?

ఎమ్మార్వో కార్యాలయంలో ఎవరికి ఇచ్చారు..?

- కాంగ్రెస్ నాయకులను కాదని బీఆర్ఎస్ నేతలు డబ్బులిస్తేనే పనులు జరుగుతున్నాయా?
- కాంగ్రెస్ సమావేశంలో అందే మోహన్ ఆవేదన..
- షాద్‌నగర్ టౌన్‌లో పార్టీ పరిస్థితిపై తీవ్ర వ్యాఖ్యలు



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి: (జనంసాక్షి) షాద్ నగర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై ఆ పార్టీ సీనియర్ నాయకుడు మున్సిపల్ వైస్ ఛైర్మన్ అందే మోహన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకులను పక్కనపెట్టి బీఆర్ఎస్ నాయకులకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఎమ్మార్వో కార్యాలయంలో ఓ పని కోసం రూ.5 లక్షలు ఇచ్చారంటూ ప్రస్తావించిన ఆయన.. ఆ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి..? ఎవరికి ఇచ్చారు..? ఏ అధికారి లంచం తీసుకొని పని చేశారు..? అనేది చర్చ నీ అంశంగా మారింది... ఆయన మాట్లాడిన వీడియో మొత్తం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది అధికారులు డబ్బులు ఇవ్వనిదే పని చెయ్యడం లేదు అనే వ్యాఖ్యలు ఆ వీడియోలో సంచలనంగా మారాయి... కాంగ్రెస్ నాయకుల సమావేశంలో అందే మోహన్ తన ఆవేదనను వ్యక్తం చేస్తూ.. అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉన్నప్పటికీ పట్టణంలో పార్టీ నాయకులకు తగిన గుర్తింపు, ప్రాధాన్యత లభించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ నాయకులను కాదని బీఆర్ఎస్ నాయకులకు డబ్బులు ఇచ్చి పనులు చేయించుకుంటేనే ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరుగుతున్నాయి? అంటూ ప్రశ్నించారు.

ఎమ్మార్వో కార్యాలయంలో రూ.5 లక్షల వ్యవహారం ఏమిటి? ఆ మొత్తం ఎవరికి చేరింది? ఏ అధికారి తీసుకున్నారు? డబ్బులు ఇచ్చిన తర్వాత ఏ పని పూర్తయింది? అనే అంశాలపై పూర్తి స్థాయిలో ఈ వ్యవహారంపై అధికారులు విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి..

షాద్‌నగర్ టౌన్‌లో కాంగ్రెస్ పని అయిపోయింది..?
పట్టణంలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై అందే మోహన్ చేసిన వ్యాఖ్యలు సమావేశంలో చర్చకు దారితీసినట్లు తెలుస్తోంది. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు లేకపోవడం.. ఇతర పార్టీల నాయకులకు ప్రాధాన్యత పెరుగుతుండటంపై ఆయన అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఇదే పరిస్థితి కొనసాగితే పట్టణంలో కాంగ్రెస్ పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించినట్లు తెలుస్తోంది. అధికారంలో ఉన్న పార్టీ నాయకుల మధ్య సమన్వయం, ప్రభుత్వ కార్యాలయాల్లో పార్టీ కార్యకర్తలకు గౌరవం, ప్రజా సమస్యల పరిష్కారంలో నాయకుల భాగస్వామ్యం వంటి అంశాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అందే మోహన్ వ్యాఖ్యలు పట్టణ కాంగ్రెస్‌లో అంతర్గత అసంతృప్తికి అద్దం పడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. అయితే ఎమ్మార్వో కార్యాలయంలో రూ.5 లక్షల లంచం వ్యవహారానికి సంబంధించి పూర్తి వివరాలు, డబ్బులు ఇచ్చిన వ్యక్తి, తీసుకున్న అధికారి, జరిగిన పని తదితర అంశాలపై అధికారిక సమాచారం వెలువడాల్సి ఉంది. ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందిస్తే ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



యువత మత్తుకి బానిస కావద్దు కుటుంబానికి భారం కావద్దు

చేవెళ్ల సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య

చేవెళ్ల/ మొయినాబాద్, నవంబర్ 20 (జనంసాక్షి) : విద్యార్థులు, యువత మత్తుకి బానిస కావద్దు కుటుంబానికి భారం కావద్దని చేవెళ్ల సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో భాస్కరా లా కళాశాల లో నిర్వహించిన లీగల్ ఏవార్నెస్ ప్రోగ్రామ్ (డ్రగ్స్ పై అవగాహనా కార్యక్రమం) లో ముఖ్య అతిధిగా చేవెళ్ల కోర్ట్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి దశరథ రామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. యువత చేతిలో మత్తు పదార్థాలు కాకుండా పుస్తకాలు ఉండాలి. వారి ఆలోచనల్లో నేరాలు కాకుండా లక్ష్యాలు ఉండాలి. వారి జీవితాల్లో వ్యసనాలు కాకుండా విజయాలు ఉండాలి అన్నారు. డ్రగ్స్ రహిత స

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 నవంబర్ 2026

సీఎంఆర్ బియ్యం అప్పగింతలో జాప్యం సహించేది లేదు

● అదనపు కలెక్టర్ టి. వినోద్ కుమార్

వనపర్తి, నవంబర్ 20 (జనం సాక్షి) : జిల్లాలో మిల్లర్ల వద్ద పెండింగ్‌లో ఉన్న కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయిలను యుద్ధప్రాతిపదికన ప్రభుత్వానికి అప్పగించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) టి. వినోద్ కుమార్ మిల్లర్లను ఆదేశించారు. ధాన్యం తీసుకొని సకాలంలో సీఎంఆర్ అప్పగించకపోవడం, పాత బకాయిల రికవరీలో జాప్యం చేయడంపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి వారం సీఎంఆర్ పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని, నిర్లక్ష్యం వహించే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మిల్లర్లు, గోదాం నిర్వాహకులతో సీఎంఆర్ బకాయిలపై అదనపు కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక్కో రైస్ మిల్లు వారీగా పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్, రికవరీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గత 15 రోజులుగా ఒక్క ఏసీకే (అంగీకార ధృవీకరణ) కూడా అప్పగించకపోవడంతో పాటు, రికవరీలు కూడా జరగకపోవడంపై మిల్లర్లను ప్రశ్నించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి మిల్లర్ల నుంచి ఇంకా 35,708.77 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉందని, ఇందుకు నవంబర్ 29వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని స్పష్టం చేశారు.



అదేవిధంగా 2025-26 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలోని మిల్లర్లకు 1,47,614.240 మెట్రిక్ టన్నుల ధాన్యం కేటాయించగా, ఇప్పటివరకు 64 శాతం మేరకు అంటే 94,935.472 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ అప్పగించినట్లు తెలిపారు. ఇంకా 52,678 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల నుంచి రావాల్సి ఉందన్నారు. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి కేవలం 25 శాతం ధాన్యం మాత్రమే అప్పగించారని, మిగిలిన 1,27,532 మెట్రిక్ టన్నుల ధాన్యం రావాల్సి ఉందని వెల్లడించారు. తీసుకున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి నిర్ణీత సమయంలో ప్రభుత్వానికి అప్పగించాల్సిన బాధ్యత మిల్లర్లపై ఉందని స్పష్టం చేశారు.

10 శాతం బ్యాంకు గ్యారంటీ తప్పనిసరి

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కేటాయింపులు పొందాలంటే 10 శాతం బ్యాంకు గ్యారంటీ సమర్పించడంతో పాటు, అగ్రిమెంట్ చేసుకోవడానికి సిద్ధంగా ఉన్న మిల్లర్లకే ధాన్యం కేటాయిస్తామని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. సీఎంఆర్ బకాయిలు, పాత రికవరీల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదన్నారు.

హమాలీల కొరతతో జాప్యం.. మిల్లర్ల వివరణ

దీపావళి పండుగ సందర్భంగా హమాలీలు తమ స్వస్థలాలకు వెళ్లడంతో కార్మికుల కొరత ఏర్పడి సీఎంఆర్ అప్పగించడంలో జాప్యం జరిగిందని మిల్లర్లు సమావేశంలో వివరించారు. ఇకపై ఎలాంటి జాప్యం లేకుండా క్రమం తప్పకుండా సీఎంఆర్ అప్పగిస్తామని హామీ ఇచ్చారు. అదే సమయంలో తమకు రావాల్సిన మిల్లింగ్, రవాణా ఛార్జీలను సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఆంజనేయులు, డీఎం సివిల్ సప్లై హరీష్ కుమార్, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు ధనలక్ష్మి, శేఖర్ రెడ్డి, పలువురు మిల్లర్లు, గోదాం నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామీణ పేదల అభివృద్ధికి శ్రీరామ్ గ్రూప్ కృషి అభినందనీయం



పెద్దశంకరంపేట, నవంబర్ 20 (జనం సాక్షి) : విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థుల భవిష్యత్తుకు శ్రీరామ్ గ్రూప్ అందిస్తున్న సేవలు అభినందనీయమని మండల విద్యాశాఖ అధికారి శేఖర్ అన్నారు. శుక్రవారం పెద్ద శంకరంపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మిషన్ టెన్త్ క్లాస్ – చదువుకో తెలంగాణ (2025-26)' కార్యక్రమంలో ప్రతిభావంతులైన పదవ తరగతి విద్యార్థులు పులబోయిన శశికాంత్, కుమ్మరి అభిలాష్‌లకు తలా రూ.10 వేల మెరిట్ స్కాలర్‌షిప్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఈ ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయులు దయానంద్, సుధీర్, సత్యకుమార్, లక్ష్మణ్, హన్మండ్లు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ నారాయణఖేడ్ బ్రాంచ్ మేనేజర్ పూర్ణచందర్, డెవలప్‌మెంట్ ఆఫీసర్లు సూర్యప్రకాష్, బాసాడ రాజు, సేల్స్ ఆఫీసర్లు కల్లేటి రమేష్ గుప్తా, చీటీ భూమేష్, రవీందర్, బైండ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

● ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి



నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : దేశంలో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ కుటుం బ జీవిత బీమా పథకం ప్రారంభించి అనేకమంది పేద ప్రజల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచిం దని నారాయణపేట ఎమ్మె ల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి అన్నారు. శు క్రవారం ధన్వా డ రైతు వేదికలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథ కాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక పాల్గొని పథకం గురించి ప్రజలకు వివరించారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ అనేక కుటుంబాలలో యజమాని చనిపోతే ఆ కుటుంబం ఎంత కష్టాల పాలయిందో మనం చూసా మని తెలిపారు. అలాంటి కష్టాలు రాకుండా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆలో చన విధానంతో ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం అమలు చేశారని తెలిపా రు. ఇదివరకు రైతు బీమా కేవలం రైతు కుటుంబానికే ఉంటుంది. కానీ మిగతా ప్రజలకు ఎలాంటి బీమా లేనందున రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్క కుటుం బంలో ఇందిరమ్మ భీమా అమలు చేస్తారని తెలిపా రు. ప్రతి గ్రామంలో కేంద్రం ఏర్పాటు చేసి ప్రజలకు ముందుగా సమాచారం ఇచ్చి బీమా నమోదు చేస్తారని తెలిపారు. 18 నుండి 59 వయసుగల కుటుంబ సభ్యులలో ఒకరు నామినేగా పెట్టవచ్చని తెలిపారు. ఈ సమావేశం లో సర్పంచ్ జ్యోతి, అధికా రులు జడ్. పి. సి. ఈ. ఓ. తహసీల్దార్ ఎం. పి. డి. ఓ. స్పెషల్ ఆఫీసర్ అగ్రికల్చర్ అధికారి ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాల పెంపునకు వైద్యులు ప్రత్యేక చొరవ చూపాలి

● రోగులకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు కల్పించాలి
● విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు
● ఎంసీహెచ్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి, నవంబర్ 20 (జనం సాక్షి) : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. వైద్యులు సమయపాలన పాటిస్తూ విధులకు సక్రమంగా హాజరుకావాలని, విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. శుక్రవారం వనపర్తి జిల్లా నర్సింగాయిపల్లెలోని ఎంసీహెచ్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలు, ఆసుపత్రిలోని మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది విధుల నిర్వహణ తీరును సమీక్షించారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారితో పాటు వచ్చే ఆశా కార్యకర్తలతో మాట్లాడి వారి



సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఆశా కార్యకర్తలు ఆసుపత్రికి వచ్చినప్పుడు కూర్చునేందుకు ఇబ్బందులు పడకుండా తగిన సంఖ్యలో టేబుళ్లు, కుర్చీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. వారి సౌకర్యార్థం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదిని కూడా పరిశీలించారు. అనంతరం వైద్యులతో సమావేశమైన కలెక్టర్ ఆసుపత్రిలో ప్రసవాల రిజిస్టర్‌ను పరిశీలించారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ వాటి సంఖ్య పెరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్యుల హాజరు రిజిస్టర్‌ను తనిఖీ చేసి, విధులకు సంబంధించిన రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు నిర్ణీత సమయానికి విధులకు హాజరై రోగులకు అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు. ఆసుపత్రిలో సెల్‌ఫోన్ల చోరీ వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, సీసీటీవీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా పర్యవేక్షణను పటిష్టం చేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తూ మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఆసుపత్రి నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

అనంతరం మెడికల్ కళాశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి భవనాన్ని కలెక్టర్ సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే వేగాన్ని కొనసాగిస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులు, ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఆర్ఎంఓలు, ఇతర వైద్య అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలపై ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు

● విద్యా ప్రమాణాల పెంపునకు ఆదేశాలు
● ఎఫ్ఎల్ఎన్ 12 సామర్థ్యాల సాధనపై ప్రత్యేక దృష్టి
● బాలల హక్కుల పరిరక్షణ, పరిశుభ్రతకు ప్రాధాన్యత

కోహీర్, నవంబర్ 20 (జనం సాక్షి) : కోహీర్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాధికారి మహమ్మద్ జాకీర్ హుస్సేన్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. పైడిగుమ్మల్, నాగిరెడ్డిపల్లి (ఉర్దూ, తెలుగు మీడియం), లాల్‌సింగ్ తండా పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రమాణాలు, బోధనాభ్యసన ప్రక్రియ, పాఠశాలల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల రికార్డులను తనిఖీ చేసి విద్యా ప్రమాణాల మెరుగుదలకు ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్, హోంవర్క్ పుస్తకాలను ప్రతిరోజూ తనిఖీ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ వారి విద్యా ప్రగతిని సమీక్షించాలన్నారు.



ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ)లో నిర్దేశించిన 12 సామర్థ్యాలను ప్రతి విద్యార్థి సాధించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థుల ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం కీలకమని, ఉపాధ్యాయులు వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మరుగుదొడ్లను ప్రతిరోజూ శుభ్రపరచడంతో పాటు తాగునీటి ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించాలని సూచించారు.

నాగిరెడ్డిపల్లిలో బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవం

నాగిరెడ్డిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన బాలల హక్కుల పరిరక్షణ దినోత్సవ కార్యక్రమంలో ఎంఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, సమాన విద్యా అవకాశాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రతి బాలబాలికకు ప్రేమ, గౌరవం, సంరక్షణతో కూడిన నాణ్యమైన విద్య అందించాలన్నారు.

అనంతరం గ్రామ సర్పంచ్ శ్రీకాంత్‌కు పాఠశాలలోని మౌలిక సదుపాయాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలను వివరించారు. స్వయంగా పాఠశాల పరిసరాలను పరిశీలించిన సర్పంచ్ పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు తనవంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రావంతితో పాటు ఉపాధ్యాయులు ప్రశాంతి, సంతోష, తిరుమలేష్, శ్రీష, నగేశ్వర్ రావు, లాల్‌సింగ్, హమీద్ బిన్ సయీద్, స్వరాజ్ కుమార్ తదితర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, బాలల హక్కుల పరిరక్షణకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎంఈఓ పిలుపునిచ్చారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసానే ప్రభుత్వ ధ్యేయం

● మక్తల్‌లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం
● పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
● మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు



మక్తల్, నవంబర్ 20 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం మక్తల్ పట్టణంలో ఘనంగా ప్రారంభమైంది. శుక్రవారం మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు (వాకిటి గేరి)లో గల కల్లూరి పెద్ద భీమన్న నివాసం వద్ద రాష్ట్ర మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు, మున్సిపల్ చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ వాకిటి మానస హనుమంతు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎన్నో వినూత్న పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అందులో భాగంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఎంతో గొప్పదని కొనియాడారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశం లేకపోయినప్పటికీ, పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఈ పథకం ఎంతో అవసరమని గుర్తించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సహచర మంత్రులతో కలిసి ఈ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఇది రాష్ట్ర ప్రజలకు గొప్ప భరోసాను కల్పిస్తోందని అన్నారు. పట్టణంలోని ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములై, దీనిని విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ?ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏ. రవికుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌నినో ప్రభావాలపై రైతులకు అవగాహన

● నీటి పొదుపుతో కూడిన ప్రత్యామ్నాయ పంటల సాగుకు అధికారుల సూచన
● మండల వ్యవసాయ అధికారి దీపిక

నర్సాపూర్, నవంబర్ 20 (జనం సాక్షి) : నర్సాపూర్ మండలంలోని రాంజ్య తండా, మొహమ్మదాబాద్ గ్రామాల్లో ఎల్-నినో ప్రభావాలు, నీటి సంరక్షణ, స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించేందుకు గ్రామసభలు నిర్వహించారు. శుక్రవారం ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారి దీపిక రైతులకు పలు సూచనలు చేశారు.ఎల్-నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలున్న నేపథ్యంలో వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణతో పాటు తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరి సాగును తగ్గించి జీరో ప్యాడీ విధానాన్ని ప్రోత్సహించాలని తెలిపారు. జొన్న, మొక్కజొన్న, పెసర, అలసంద, మినుము, శనగ, నువ్వులు, కుసుమ, పొద్దుతిరుగుడు, ఆవాలు, కూరగాయల సాగు చేపట్టడం ద్వారా నీటి వినియోగాన్ని



తగ్గించుకోవచ్చని వివరించారు. ఆయిల్‌పామ్ సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, సూక్ష్మ నీటిపారుదల పద్ధతులు, నీటి పొదుపు చర్యలు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునే విధానాలపై అవగాహన కల్పించారు. వాతావరణ మార్పులు, భవిష్యత్తులో ఎదురయ్యే నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని అధికారులు సూచించారు. తక్కువ పెట్టుబడితో మెరుగైన ఆదాయం పొందేలా స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంబించాలని రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఏఈఓ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శులు, ఎఫ్ఏలు, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అక్రమ కల్లు,నాటుసారా విక్రయాలపై ఎక్సైజ్ శాఖ ప్రత్యేక నిఘా

● అక్రమ మద్యం కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు
● జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లింగాచారి

గద్వాల నడిగడ్డ, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) : జిల్లాలో అక్రమ కల్లు, నాటుసారా తయారీ, నిల్వ,విక్రయాల నియంత్రణకు ప్రత్యేక నిఘాతో నిరంతర దాడులు నిర్వహిస్తున్నామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లింగాచారి తెలిపారు. గద్వాల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ కల్లు,నాటుసారా విక్రయాలపై అందిన ఫిర్యాదుల మేరకు అధికారులు తక్షణమే స్పందించి దాడులు నిర్వహించారని ఆయన వెల్లడించారు. గురువారం అందిన ఫిర్యాదు మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ బృందం గద్వాల పట్టణంలోని గంజిపేట ప్రాంతంలో దాడి నిర్వహించి, అక్రమంగా నిల్వ ఉంచిన 39 లీటర్ల కల్లును గుర్తించి ధ్వంసం చేసిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.



అదేవిధంగా, గద్వాల ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది కేటీ దొడ్డి మండలంలోని ఇర్కిచేడు తండాలో దాడులు నిర్వహించి 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారని, ఈ కేసులో నిందితుడిని అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లింగాచారి మాట్లాడుతూ అక్రమంగా తయారు చేసే కల్లు,నాటుసారా ప్రజల ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే ప్రమాదం ఉందని, ముఖ్యంగా నాటుసారా వినియోగం వల్ల ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని, సామాజిక భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో అక్రమ మద్యం తయారీ, నిల్వ, విక్రయాలపై ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరిస్తోందని స్పష్టం చేశారు.గద్వాల ఎక్సైజ్ స్టేషన్ పరిధితో పాటు జిల్లా వ్యాప్తంగా అక్రమ మద్యం కార్యకలాపాలు ఎక్కడ జరిగినా ఉపేక్షించబోమని, అలాంటి వాటికి పాల్పడే వారిని గుర్తించి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కల్లు,నాటుసారా విక్రయాలకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే సంబంధిత ఎక్సైజ్ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. అక్రమ మద్యం నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎక్సైజ్ శాఖకు సహకరించాలని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి లింగాచారి విజ్ఞప్తి చేశారు. జిల్లాలో అక్రమ మద్యం కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం తనిఖీలు, దాడులు కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు



నంగునూరు, నవంబర్ 20 (జనం సాక్షి) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగుతోందని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. శుక్రవారం నంగునూరు మండలం పాలమాకుల గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలోని ఏర్పాట్లను తనిఖీ చేసిన కలెక్టర్ అధికారులకు, సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ధాన్యానికి నిర్దేశిత తేమ శాతం రాగానే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే లారీల్లో లోడ్ చేయాలని ఆదేశించారు. తూకంలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు. మిల్లర్ల వైపు నుంచి ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.కేంద్రంలో గన్నీ బ్యాగులు, సుతిల్ దారాలు, వేయింగ్ మిషన్లతో పాటు రైతులకు అవసరమైన తాగునీటి వసతి వంటి అన్ని మౌలిక సదుపాయాలను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరతో పాటు సన్న ధాన్యానికి ప్రభుత్వం అందిస్తున్న బోనస్‌ను సైతం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, కొనుగోలు కేంద్రం సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

జంగేడు రహదారి విస్తరణ, డ్రైనేజీ అభివృద్ధికి సమగ్ర చర్యలు

- ప్రజల ఆస్తుల పరిరక్షణే లక్ష్యం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు వెళ్లే రహదారి విస్తరణ, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, ప్రజల ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా సమగ్ర చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థల పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో 40 అడుగులు, మరికొన్ని ప్రాంతాల్లో 30, 35 అడుగుల మేర రహదారులు, డ్రైనేజీ నిర్మాణాల కొలతలను పరిశీలించారు. స్థానిక పరిస్థితులు, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఎవరికీ ఇబ్బందులు కలగకుండా పనుల ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. రహదారి విస్తరణకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో యుద్ధప్రాతిపదికన తొలగించాలని సూచించారు. వీధి వ్యాపారులతో సమావేశం నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. రహదారి విస్తరణ వల్ల ఇబ్బందులు ఎదుర్కొనే వ్యాపారులు, దుకాణాల యజమానులు, స్థానిక ప్రజల ప్రయోజనాలను విస్మరించబోమని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఎవరికీ అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించే వైద్యశాలలపై కఠిన చర్యలు

- అర్హతకు మించి వైద్యం చేస్తే సహించేది లేదు
- కలెక్టర్ రాహుల్ శర్మ..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జిల్లాలో వైద్యశాలలు, వైద్య కేంద్రాల నిర్వహణలో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అర్హతకు మించి వైద్య సేవలు అందించి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా వైద్య సంస్థల నమోదు ప్రాధికార కమిటీ సమావేశంలో వైద్యశాలల నూతన నమోదు, తాత్కాలిక నమోదు, శాశ్వత నమోదు పునరుద్ధరణ, తనిఖీలు, పర్యవేక్షణ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా తెలంగాణ వైద్య సంస్థల నమోదు, నియంత్రణ చట్టం-2010, నిబంధనలు-2022ను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జిల్లాలో మొత్తం 64 వైద్య సంస్థలు నమోదై ఉన్నాయని, వీటిలో 17 ప్రభుత్వ, 47 ప్రైవేటు సంస్థలు ఉన్నాయని తెలిపారు. 45 ఆసుపత్రుల్లో 17 ప్రభుత్వ, 28 ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నాయన్నారు. గ్రామీణ వైద్యులు నిబంధనలకు లోబడి కేవలం ప్రథమ చికిత్స సేవలకే పరిమితం కావాలని, అర్హత లేని చికిత్సలు అందించడాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. పీహెచ్సీ వైద్యాధికారులు తమ పరిధిలోని ఆసుపత్రులు, వైద్య కేంద్రాలను నిరంతరం తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, డిసిఆర్బీ డీఎస్పీ అబ్దుల్ రహమాన్, ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. శ్రీదేవి, ఐఎంఏ అధ్యక్షులు డా. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత్ ప్లస్ సాధనకు కృషి చేయాలి

ఎయిడ్స్ నివారణ కార్యక్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా 'సురక్షిత్' స్థాయిని సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. శుక్రవారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్‌ను తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఉప సంచాలకురాలు ఇందిరా ప్రియదర్శిని, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, ఇతర అధికారులు శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ, సమగ్ర పరీక్షా కేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, దిశా సిబ్బంది సమన్వయ కృషి వల్లే ఈ గుర్తింపు సాధ్యమైందన్నారు. హెచ్ఐవీ పరీక్షల సంఖ్య పెంచడం, వ్యాధి నిర్ధారణ అయిన వారిని యాంటీ రెట్రోవైరల్ చికిత్సకు అనుసంధానం చేయడం, వైరల్ లోడ్ పరీక్షలు, గర్భిణులకు హెచ్ఐవీ పరీక్షలు, ప్రజల్లో విస్తృత అవగాహన వంటి కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. 95-95-95 లక్ష్యాల సాధనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి తదుపరి మైలురాయైన 'సురక్షిత్ ప్లస్' స్థాయిని సాధించాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సందీప్, దిశా జిల్లా కార్యక్రమ నిర్వాహకురాలు జ్యోతి, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రం కమర్షియల్ భవనం కాదు..

- కళాకారుల కోసం నిర్మించిన భవనాన్ని కమర్షియల్ అవసరాలకు వాడొద్దు..
- కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (జనం సాక్షి) :కళాకారుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన కాళోజీ కళాక్షేత్రంలోకి కుడా కార్యాలయాన్ని తరలించడాన్ని బీఆర్ఎస్ నాయకులగా తీవ్రంగా ఖండిస్తున్నాం కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవ రెడ్డి అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూవెంటనే కార్యాలయాన్ని పాత భవనంలోకి తరలించాలని డిమాండ్ చేస్తున్నాం అని అన్నారు.కాళోజీ కళాక్షేత్రం కమర్షియల్ భవనం కాదని, తెలంగాణ ప్రాంత కళాకారులు, కవులు, సాంస్కృతిక కార్యక్రమాలకు అందుబాటులో ఉండేలా నిర్మించిన ప్రత్యేక వేదిక అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కాళోజీ ఫౌండేషన్ విజ్ఞప్తి మేరకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు ఎకరాల స్థలాన్ని కేటాయించారని, సుమారు రూ.100 కోట్ల వ్యయంతో అత్యాధునిక సౌకర్యాలతో కళాక్షేత్రాన్ని నిర్మించారని గుర్తుచేశారు.మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్ మాట్లాడుతూ..కాళోజీ కళాక్షేత్రంలోకి కుడా కార్యాలయాన్ని తరలించడం వెనుక కాంగ్రెస్ పార్టీ నాయకులు తమ కుటుంబ సభ్యులు, అనుచరులు, బంధుమిత్రులకు ప్రభుత్వ స్థలాలను అప్పగించాలనే ప్రయత్నాల్లో భాగంగానే ప్రజలకు, కళాకారులకు ఉపయోగపడాల్సిన కాళోజీ కళాక్షేత్రాన్ని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారని విమర్శించారు. సుమారు రూ.5 కోట్లతో ఆధునిక హంగులతో నిర్మించిన కుడా పాత కార్యాలయాన్ని ఖాళీ చేసి, గత 30 ఏళ్లుగా కొనసాగుతున్న కార్యాలయాన్ని యథాస్థానంలోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.తక్షణమే పాత కార్యాలయానికి తరలించాలికుడా కార్యాలయాన్ని వెంటనే పాత భవనంలోకి తరలించి, కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తిగా కవులు, కళాకారులు, సాంస్కృతిక కార్యక్రమాలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజాసంఘాలు, కళాకారులు, ఇతర రాజకీయ పార్టీలను కలుపుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రజల ఆస్తులను వ్యక్తిగత ప్రయోజనాలకు వినియోగించే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్పష్టం చేశారు.

భవనాల్లో అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు తప్పనిసరి

- నిబంధనలు పాటించని వారిపై చర్యలు..



వరంగల్ ఎంజీఎం, నవంబర్ 29 (జనంసాక్షి): నగరంలోని పెద్ద భవనాలు, వాణిజ్య సముదాయాలు, ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో అగ్నిప్రమాదాల నివారణకు నిబంధనల ప్రకారం తప్పనిసరిగా పటిష్టమైన అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లు కల్పించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టీ. వెంకన్న సూచించారు.శుక్రవారం నగరంలోని హనుమకొండ లోని డీమార్ట్, వరంగల్ లోని బిల్లా ఓపెన్ మైండ్ పాఠశాల, బాలసముద్రంలోని కళ్యాణి ఆసుపత్రి, నక్కలగుట్టలోని అసుక భవన్ తదితర భవనాలను కమిషనర్ సందర్శించి, అక్కడ ఏర్పాటు చేసిన అగ్నిమాపక భద్రతా పరికరాలు, అత్యవసర రక్షణ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయా భవనాల్లో అగ్నిమాపక పరికరాల ఏర్పాటు, వాటి పనితీరు, అత్యవసర సమయాల్లో వినియోగించే విధానం, భద్రతా నిబంధనల అమలు తదితర అంశాలను సమీక్షించారు. అగ్నిమాపక భద్రతా అనుమతుల పునరుద్ధరణ కోసం దరఖాస్తు చేసుకున్న భవనాల్లో నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి భవన యజమాని బాధ్యతని కమిషనర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక పరికరాలను కేవలం ఏర్పాటు చేయడమే కాకుండా, అవి నిరంతరం పనిచేసే స్థితిలో ఉండేలా పర్యవేక్షించాలని, అత్యవసర మార్గాలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, పాఠశాలలు, ప్రజలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగించే వాణిజ్య సముదాయాల్లో అగ్నిమాపక భద్రతా ప్రమాణాల అమలులో నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.కమిషనర్ వెంట బల్దియా అగ్నిమాపక భద్రతా అధికారి రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా

- ఎమ్మెల్యే అనిల్ జాదవ్

గుడిహత్నూర్, నవంబర్ 20 (జనంసాక్షి) : మండలంలోని కొల్హారి గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘ భవనాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, జాయింట్ కలెక్టర్‌తో కలిసి భవనాన్ని ప్రారంభించారు. అనంతరం భవనం ఆవరణలో మొక్కను నాటి, ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గ్రామం అభివృద్ధి చెందాలంటే ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగాలని సూచించారు. గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనుల కోసం తప్పకుండా నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి అమలు జరపాలి

- 26న జిల్లా కలెక్టరేట్ల ముందు జరిగే ధర్నాలు జయప్రదం చేయండి
- బికెయంయు జాతీయ కార్యవర్గ సభ్యులు తాటిపాముల వెంకట్రాములు



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (జనం సాక్షి) : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించి పకడ్బందీగా అమలు జరపాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మునిగాల భిక్షపతి అధ్యక్షతన జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ అనేక పోరాటాలు చేసి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని రద్దుచేసి వికసిత్ భారత్ జీ తెచ్చి వ్యవసాయ కార్మికుల ఉపాధి హక్కును కేంద్ర ప్రభుత్వం దెబ్బతీసిందన్నారు. ఇప్పటికైనా ఎంజీఎన్ఆర్ఇజిఎస్ నే పునరుద్ధరించి కేంద్ర బడ్జెట్ లో నిధులను పెంచి సంవత్సరంలో 200 రోజులు పనులు కలిగించి రోజుకు 700 కూలి ఇవ్వాలన్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికల ముందు వ్యవసాయ కార్మికులకు చేసిన వాగ్దానాలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు జరపాలన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి రూ.12వేలు ఇస్తామన్నఆర్థిక సహాయం మూడేళ్లు కావస్తున్న ఇప్పటి వరకు ఇవ్వక పోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో తీవ్రమైన కరువు పరిస్థితి నెలకొన్నందున యుద్ధ ప్రాతిపదికన కరువు నివారణ చర్యలు చేపట్టాలని, 14 రకాల నిత్యవసర సరుకులు చౌక డిపోల ద్వారా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.వ్యవసాయ కార్మికుల డిమాండ్స్ సాధనకై ఈ నెల 26న కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నాలుగవ రాష్ట్ర మహాసభలు జనవరి 9 నుండి 11 వరకు కరీంనగర్ జిల్లా జమ్మికుంట లో జరిగనున్నాయని మహాసభల జయప్రదానికై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వెంకట్రాములు విజ్ఞప్తి చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ వ్యవసాయ కార్మికుల పోరాటాలకు సిపిఐ అండగా ఉంటుందన్నారు. భూమికోసం భుక్తి కోసం సామాజిక న్యాయం కోసం పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి కర్రె లక్ష్మణ్ ప్రసంగిస్తూ గ్రామ గ్రామాన సంఘ సభ్యత్వాన్ని చేర్పించి గ్రామ కమిటీల నిర్మాణం చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సంఘ నాయకులు ఏదునూరు వెంకట్రాజం, బత్తిని సదానందం, గోకల రాజయ్య, పసునూరి సునీల్, బంట్లోజు రాజమణి,మునిగాల స్వామి, యాఖూబ్ తదితరులు పాల్గొన్నారు.



చిత్తడి నేలలను గుర్తించాలి

- హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి

హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (జనం సాక్షి) : జిల్లాలో చిత్తడి నేలల గుర్తింపు, వాటి సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎన్. రవి అధికారులను ఆదేశించారు.ఈ అంశంపై శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో రెవెన్యూ, సర్వే, అటవీ, నీటిపారుదల శాఖల అధికారులు పాల్గొన్నారు. చిత్తడి నేలలను గుర్తించి, వాటి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించి, సంబంధిత పూర్తి సమాచారాన్ని సేకరించాల్సి ఉందని తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉన్నందున, ఈ ప్రక్రియకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో అర్హత గల ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మంచిర్యాల జిల్లాలోని జైపూర్ మండల కేంద్రంలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను మండల తహసిల్దార్ వనజా రెడ్డితో కలిసి పరిశీలించి ఇప్పటివరకు అందిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని ఎలాంటి తప్పులు లేకుండా పూరించాలని తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబంలోని 18 నుండి 59 సంవత్సరాల వరకు వయసు ఉన్న వ్యక్తి బీమా వ్యక్తిగా ప్రతిపాదించబడతారని, భీమా పొందే వ్యక్తి స్వయంగా దరఖాస్తుపై సంతకం చేసి, నామిని వివరాలను తెలియపరిచి స్వయంగా అందించాలని తెలిపారు. కౌంటర్లు ఏర్పాటు చేసి, దరఖాస్తులు స్వీకరించి, ఆన్ లైన్ పోర్టల్ లో వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. ఈ పథకం ద్వారా కుటుంబానికి 5 లక్షల రూపాయల జీవిత బీమా వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన అర్జీదారులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. జైపూర్ గ్రామంలో ఇప్పటి వరకు 28 దరఖాస్తులు అందాయని తెలిపారు. మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న ఎస్.సి. వసతి గృహ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం భీమారం మండలం మద్దికల్ గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి జరుగుతున్న దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు.

నేటి బాలలే.. రేపటి పౌరులు

- ఆనందకరమైన బాల్యంతోనే రేపటి ఉత్తమ సమాజ నిర్మాణం
- వరంగల్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కృష్ణవేణి



ములుగు ప్రతినిధి, నవంబర్ 20(జనంసాక్షి) : జిల్లా కేంద్రంలోనీ సమీకృత కలెక్టరేట్ కార్యాలయం- సమావేశపు హాల్లో జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల ముగింపు కార్యక్రమం మరియు ప్రపంచ బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్నీ జిల్లా సంక్షేమ అధికారిని ఇ.పి.ప్రేమలత అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రీజనల్ జాయింట్ డైరెక్టర్, వరంగల్ శ్రీమతి కృష్ణవేణి మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని నేటి బాల్యానికి ఆనందకరమైనటువంటి బాల్యాన్ని అందించినట్లయితే రేపటి ఉత్తమ సమాజాన్ని నిర్మించిన వాళ్లమవుతామని సూచించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలలకు బాలల హక్కుల ఒడంబడిక ఆధారంగా అనేక హక్కులు సంక్రమించడం జరిగింది, ఆ హక్కులను సంరక్షించే బాధ్యత ప్రభుత్వం, తల్లిదండ్రుల పైన ఉందని ఆ హక్కుల ఉల్లంఘన జరిగితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, హక్కుల సంరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుండి హాజరైన బాలలను వివిధ బాలల సంరక్షణ చట్టాల గురించి అడిగి తెలుసుకున్నారు. పిల్లలు బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన కలిగి ఉంటే సరిపోదని వారికి సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలని మరియు చైల్డ్ హెల్ప్ లైన్ 1098, 181 ఉ 100 మొదలైన నంబర్లకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ గోపాలరావు మాట్లాడుతూ బాలలు వాళ్ళ హక్కుల సంరక్షణలో భాగంగానే పౌష్టికాహారం తీసుకునే హక్కు, మంచి వాతావరణంలో పెరిగే హక్కు కలిగి ఉన్నారని, పౌష్టికరమైనటువంటి ఆహారంతో మంచి వాతావరణంలో సంరక్షించబడినట్లైతే ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దబడతారని సూచించారు. బాల్యంలో చదువు ఎంత ముఖ్యమో దానితోపాటు పౌష్టికాహారం కూడా అంతే అవసరమని తెలుపుతూ, బాలలందరూ పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె వసుధ, చైల్డ్‌లైన్ -బాలల సంక్షేమ సమితి ములుగు మాట్లాడుతూ నేటి పరిస్థితులలో బాలలకు అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, యుక్త వయసులో వారిలో వచ్చే మార్పులని ఎప్పటికప్పుడు గమనిస్తూ మంచివైపు నడుచుకోవాలని చెడుదారుల వైపు వెళ్ళకూడదు అని సూచించారు .తెలిసి తెలియని వయసులో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునీ మంచి జీవితాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిల్లా సంక్షేమ అధికారిని ఇ.పీ. ప్రేమలత మాట్లాడుతూ బాల్యంలో ఉన్నతమైన లక్ష్యాలని ఏర్పరచుకొని, క్రమశిక్షణతో వాటిని సాధించిన వారూ, మంచి నడవడిక కలిగిన వారు సమాజంలో ఉత్తమ పౌరులుగా గుర్తించబడతారని అన్నారు. భారత ప్రభుత్వం 1992లో అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక పైన సంతకం చేసి బాలల హక్కులని సంరక్షించే బాధ్యతను తీసుకోవడం జరిగిందని, ఐక్యరాజ్యసమితి నవంబర్ 20నీ అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవంగా గుర్తించడమైనది అందుకని ఈ రోజుని అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం గా జరుపుకుంటామని, బాలల హక్కులకు ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేస్తూ ప్రతి ప్రభుత్వం బాలల హక్కులని సంరక్షించే బాధ్యతని తీసుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన బాల బాలికలు నృత్యాలతో, పాటలతో అలరించారు. అనంతరం బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా మాట్లాడే బొమ్మ ద్వారా జిల్లా బాలల పరిరక్షణ అధికారి జె.ఓంకార్ బాలలకు సురక్షిత స్పర్శ, అసురక్షిత స్పర్శపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఎడ్యుకేషనల్ అధికారి- సిద్ధార్థ రెడ్డి, జిల్లా రూరల్ డెవలప్మెంట్ అధికారి, జువెనైల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు,సుభాష్, డిసిఆర్బి, డిఎస్పి కిషోర్ కుమార్, కాల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ రజిత, బాల బాలికల ప్రతినిధులు కృష్ణ ప్రసాద్, హర్షిత, జిల్లాలోని నలుగురు సిడిపివోలు, సూపర్వైజర్లు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్ లైన్, సఖి, మహిళా సాధికారత కేంద్రం సిబ్బంది కోనేరు సంస్థ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుమ్రం భీం వారసులకు హెడ్ సొసైటీ అండ

జైనూర్, నవంబర్ 20 (జనం సాక్షి) : ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం వారసుల (మనవడు దివం గత కుమ్రం భీంరావు) కుటుంబ సభ్యులను హెడ్ సొసైటీ అధ్యక్షుడు జాధవ్ శ్రీకాంత్ శుక్రవారం నాడు వారి స్వగ్రామంలో పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదం లో మృతి చెందిన కుమ్రం భీంరావు చిత్రప టానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం, ఆయన కుటుంబ సభ్యులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుమ్రం భీంరావు అకాల మరణం ఆదివాసీ సమాజానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 నవంబర్ 2026

కార్మికురాలు రమణమ్మ కోసం కదిలిన నల్లగొండ కార్మిక లోకం

- ఆనంద్ నగర్‌కు మున్సిపల్ పారిశుద్ధ్య సేవలు బంద్ కార్మికుల అల్టిమేటం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 20 (జనం సాక్షి) : విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికురాలు రమణమ్మపై జరిగిన దాడి ఘటన నల్లగొండలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.తోటి కార్మికురాలిపై జరిగిన దాడిని నిరసిస్తూ నల్లగొండ మున్సిపల్ కార్మిక లోకం ఒక్కటైంది.రమణమ్మకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.కార్మికురాలికి మద్దతుగా పెద్ద సంఖ్యలో పారిశుద్ధ్య కార్మికులు ఏకమై తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఆనంద్ నగర్‌కు పారిశుద్ధ్య సేవలు బంద్..

రమణమ్మపై దాడి ఘటన నేపథ్యంలో ఆనంద్ నగర్ కాలనీకి మున్సిపల్ పారిశుద్ధ్య సేవలను నిలిపివేస్తున్నట్లు కార్మికులు అల్టిమేటం జారీ చేశారు.విధులు నిర్వహిస్తున్న కార్మికులపై దాడులకు పాల్పడితే ఇకపై సహించేది లేదని తేల్చిచెబుతున్నారు. కార్మికుల భద్రతకు భరోసా కల్పించడంతో పాటు దాడికి బాధ్యుడైన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



అట్రాసిటీ కేసులు నమోదు చేయాల్సిందే..

రమణమ్మపై దాడికి పాల్పడిన వ్యక్తిపై అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. కేవలం సాధారణ చర్యలతో సరిపెట్టకుండా, బాధ్యులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరిస్తే ఐక్యంగా ఉద్యమిస్తామని హెచ్చరిస్తున్నారు.ఒత్తిడి తెస్తే నిరవధిక దీక్షకు సిద్ధం ఆనంద్ నగర్ కాలనీకి తిరిగి పారిశుద్ధ్య సేవలు అందించాలని కార్మికులపై అధికారులు లేదా ఇతరులు ఒత్తిడి తెస్తే ఊరుకునేది లేదని కార్మికులు స్పష్టం చేస్తున్నారు. అలాంటి పరిస్థితి ఎదురైతే నల్లగొండలో నిరవధిక దీక్ష చేపట్టేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని ప్రకటిస్తున్నారు. తమ సహచర కార్మికురాలికి న్యాయం జరిగే వరకు వెనక్కి తగ్గబోమని చెబుతున్నారు.

రమణమ్మ పరామర్శకు రాని రాజకీయ పార్టీల నాయకులు

మరోవైపు, దాడి ఘటనలో గాయపడిన కార్మికురాలు రమణమ్మను పరామర్శించేందుకు ఇప్పటివరకు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎవరూ రాకపోవడంపై కార్మికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్మికుల సమస్యలపై మాట్లాడే నాయకులు, ఒక మహిళా కార్మికురాలిపై దాడి జరిగినప్పుడు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. కష్టకాలంలో కార్మికులకు అండగా నిలవాల్సిన నాయకులు ఎక్కడున్నారని నిలదీస్తున్నారు. ఒక కార్మికురాలిపై జరిగిన దాడి ఇప్పుడు మొత్తం కార్మిక లోకాన్ని కదిలించింది. తమపై దాడులు జరిగితే చూస్తూ ఊరుకోబోమని, కార్మికుల ఆత్మగౌరవం కోసం ఐక్యంగా పోరాడుతామని పారిశుద్ధ్య కార్మికులు స్పష్టం చేస్తున్నారు. రమణమ్మకు న్యాయం జరిగి, బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని చెబుతున్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాలి

శామీర్‌పేట్, నవంబర్ 20 (జనం సాక్షి) : ట్రాఫిక్ రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో తిర్మాలగిరి ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, ఆల్వాల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పవన్ కుమార్ రెడ్డితో కలిసి తుంకుంటలోని పల్లవి ప్రోగ్రెసివ్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలను పాటించడం, ఐ ఎస్ ఐ గుర్తింపు కలిగిన హెల్మెట్ ధరించడం, కార్లలో ప్రయాణించేటప్పుడు సీట్ బెల్ట్ ధరించడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, లేన్ క్రమశిక్షణను పాటించడం, అతివేగంగా వాహనాలు నడప కూడదని, వాహనం నడుపుతున్నప్పుడు మొబైల్ ఫోన్ వినియోగించకూడదని, రాంగ్ సైడ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ వంటి ప్రమాద కరమైన ట్రాఫిక్ ఉల్లంఘనలకు దూరంగా ఉండా లని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు చిన్న వయస్సు నుంచే బాధ్యతాయుతమైన రోడ్డు వినియోగదారులుగా ఎదగాలని, రోడ్డు భద్రతకు సంబంధించిన మంచి అలవాట్లను తమ జీవితం లో అలవర్చుకోవాలని, తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు మరియు సమాజంలోని ఇతరులకు కూడా ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ రోడ్డు భద్రతా వారధులుగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 80 మంది విద్యార్థులు చురుకుగా పాల్గొని ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత మరియు రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధించిన విలువైన అవగాహన పొందారు.



ఐటీడీఏలో సమయపాలన తప్పనిసరి

భద్రాచలం, నవంబర్ 20 (జనంసాక్షి) : ఐటీడీఏ కార్యాలయంలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ ఆదేశించారు. ఏజెన్సీలోని మారుమూల గిరిజన గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం ఐటీడీఏ కార్యాలయానికి వచ్చే గిరిజనులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో అధికారులు, సిబ్బంది కార్యాలయం నుంచి వెళ్లి తిరిగి వచ్చే సమయాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక హాజరు పట్టికను ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు అధికారి ఆదేశాల మేరకు శుక్రవారం ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ వివిధ విభాగాల్లోని ప్రత్యేక హాజరు పట్టికలను పరిశీలించారు. భోజనానికి వెళ్లి తిరిగి వచ్చిన అధికారులు, సిబ్బంది సంతకాలు చేసిన సమయాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డేవిడ్ రాజ్ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విరామ సమయాన్ని కేవలం అరగంటకే పరిమితం చేసుకోవాలని స్పష్టం చేశారు. విధుల్లో సమయపాలన పాటించని సిబ్బందిపై ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి యూనిట్ అధికారి తమ పరిధిలోని సిబ్బంది పనితీరును పర్యవేక్షిస్తూ, విధులను బాధ్యతాయుతంగా, క్రమశిక్షణతో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, డీడీ ట్రైబల్ వెల్ఫేర్ ఏవో రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీర్లపాలెంలో ఉద్రిక్తతల మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

- పోలీస్ బందోబస్తూ మధ్య ప్రజాభిప్రాయ సేకరణ

మిర్యాలగూడ, నవంబర్ 20 (జనంసాక్షి) : నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో ప్రతిపాదిత ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుకు సంబంధించి శుక్రవారం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పరిశ్రమ ఏర్పాటుపై స్థానిక ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత, ప్రజా సంఘాల ఆందోళనలు, పోలీసుల మోహరింపు మధ్య ఈ కార్యక్రమం సాగింది. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించే అవకాశం కల్పించలేదని, అభ్యంతరాలు తెలిపేందుకు వచ్చిన వారిని అడ్డుకున్నారని స్థానికులు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ప్రజాభిప్రాయ సేకరణను నిలిపివేయాలని కోరుతూ వీర్లపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు స్థానికులు తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. నవంబర్ 19న విచారణ చేపట్టిన ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు



ఇచ్చేందుకు నిరాకరించినప్పటికీ, పిటిషనర్లు గతంలో సమర్పించిన అభ్యంతరాలను పర్యావరణ ప్రభావ అంచనా నిబంధనల ప్రకారం సంబంధిత అధికారులు పరిశీలించి చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు పిటిషనర్లు పేర్కొంటున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ రోజున కొందరు స్థానికులను ముందస్తుగా పోలీస్ స్టేషన్లకు తరలించి నిర్బంధించారని బాధితులు ఆరోపించారు. తమ అభ్యంతరాలను అధికారుల ముందు వెల్లడించేందుకు ప్రయత్నించిన ఇద్దరు పిటిషనర్లకు ఆర్డీవో అవకాశం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల గొంతును నొక్కివేసేలా వ్యవహరించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ప్రజా సంఘాల నాయకులు మండిపడ్డారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో పర్యావరణం, నీటి వనరులు, వ్యవసాయం, ప్రజల ఆరోగ్యంపై పడే ప్రభావాలపై స్థానికులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల సందేహాలకు నిపుణులు, అధికారులు సమాధానాలు చెప్పాలని, ప్రతి ఒక్కరి అభిప్రాయాన్ని స్వేచ్ఛగా నమోదు చేయాలని కోరుతున్నాయి. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేసి, ఎలాంటి ఒత్తిళ్లు, నిర్బంధాలు లేకుండా పారదర్శకంగా మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేశాయి. వీర్లపాలెం ఇథనాల్ పరిశ్రమ వ్యవహారం ఇప్పుడు స్థానిక ప్రజల ఆందోళన నుంచి పర్యావరణ పరిరక్షణ, ప్రజాస్వామ్య హక్కులు, పారిశ్రామిక అభివృద్ధి మధ్య కీలక చర్చగా మారింది.

పేద కుటుంబాలకు ఇందిరమ్మ జీవిత బీమాతో ఆర్థిక భరోసా

- అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

బూర్గంపాడ్, నవంబర్ 20 (జనంసాక్షి) : పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించి, ఆపద సమయంలో అండగా నిలవడమే ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రధాన ఉద్దేశమని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండలం అంజనాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ప్రారంభించడంతో పాటు, నమోదు పూర్తయిన వారికి పథకానికి సంబంధించిన పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి అనుకోని ప్రమాదవశాత్తు మరణించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా కుంగిపోకుండా అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో



ఎదురయ్యే ఆర్థిక ఇబ్బందులను తగ్గించి, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించడం ఈ పథకం ప్రత్యేకతని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు పథకంపై అవగాహన కల్పించి, లబ్ధిదారుల వివరాలను ఎలాంటి తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని పాయం వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, తహశీల్దార్, సంబంధిత అధికారులు, మండల అధ్యక్షులు, జిల్లా నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌తో బూడిదైన బత్తాయి తోటలు

- పులిచెర్లలో అగ్నిప్రమాదం..
- 99 బత్తాయి చెట్లు, డ్రిప్ పరికరాలు దగ్ధం
- ఏళ్ల తరబడి పెంచిన తోటలు కాలిపోవడంతో ఇద్దరు రైతులకు తీవ్ర ఆర్థిక నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతుల వేడుకోలు

పెద్దపూర, నవంబర్ 20 (జనంసాక్షి) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఏర్పడిన షార్ట్ సర్క్యూట్ ఇద్దరు బత్తాయి రైతుల కడుపు కొట్టింది. క్షణాల్లో చెలరేగిన మంటలకు ఏళ్ల తరబడి కష్టపడి పెంచుకున్న బత్తాయి తోటలు కళ్లముందే బూడిదయ్యాయి. ఈ విషాదకర ఘటన పెద్దపూర మండల పరిధిలోని పులిచెర్ల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది.

అసలేం జరిగిందంటే..

పులిచెర్ల గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో శుక్రవారం ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో నిప్పురవ్వలు ఎగిసిపడి సమీపంలోని బత్తాయి తోటలకు అంటుకున్నాయి. గాలి తోడవడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. స్థానికులు స్పందించి మంటలను అదుపులోకి తెచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయింది.

ఇద్దరు రైతులకు తీరని నష్టం

ఈ అగ్నిప్రమాదంలో గ్రామానికి చెందిన రైతు మహమ్మద్ జానీ తోటలోని



సుమారు 50 బత్తాయి చెట్లు, మరో రైతు కంపాల పాపయ్య తోటలోని 49 బత్తాయి చెట్లు పూర్తిగా కాలిపోయాయి. చెట్లతో పాటు తోటల్లో రూ.లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసుకున్న డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ఇతర సాగునీటి పరికరాలు సైతం మంటల్లో కాలి బూడిదయ్యాయి.

బాధిత రైతుల ఆవేదన

కన్నబిడ్డల్లా సాకుతూ కాపుకు వచ్చిన దశలో ఉన్న మొత్తం 99 బత్తాయి చెట్లు అగ్నికి ఆహుతి కావడంతో బాధిత రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. పంట నష్టంతో పాటు డ్రిప్ పరికరాలు కూడా కాలిపోవడంతో తోటలను తిరిగి పునరుద్ధరించుకోవాలంటే భారీగా అదనపు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు తక్షణమే స్పందించి నష్టపోయిన పంటను అంచనా వేసి, ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి తమను ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

సిలకా గోరింక ఫోక్ సాంగ్ సిడి ఆవిష్కరణ

బోడుప్పల్, నవంబర్ 20 (జనంసాక్షి) : మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో యాదాద్రి క్రియేషన్స్ ప్రొడక్షన్లో ప్రొడ్యూసర్ మబ్బు మహేష్ నిర్మాణంలో రూపొందిన సిలకా గోరింక"ఫోక్ సాంగ్ సిడిని బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ సింగరెడ్డి పద్మా రెడ్డి ఘనంగా ఆవిష్కరించారు. మబ్బు మహేష్ నిర్మాతగా, సురేష్ సూర్య నృత్య దర్శకత్వంలో రూపొందిన సిలకా గోరింక ఫోక్ సాంగ్ విశేష ప్రజాధరణ పొందాలని, అందులో పనిచేసిన కళాకారులకు, టెక్నీషియన్స్ కు మంచి పేరు రావాలని ఆకాంక్షిస్తూ బృందం సభ్యులను అభినందించి సింగిరెడ్డి పద్మా రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.



ఇందిరమ్మ కుటుంబ బీమా పథక నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్

నూతనకల్, నవంబర్ 20 (జనంసాక్షి) : నూతనకల్ మండలం దిర్సనపల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ బీమా పథక కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ శుక్రవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వము ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కలిగించడానికి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ బీమా పథకం లో 5 లక్షల రూపాయల బీమా వర్తించును, ప్రతి కుటుంబంలో వారు ఎంపిక చేసుకోబడిన సభ్యుని పేరు మీద భీమా చేయుటకు మరియు అందులోని



నామినీలను ఎన్నిక చేసుకోవడానికి అవకాశం కల్పించినారు.ఇన్సూరెన్స్ చేసుకొనబడే వ్యక్తి తప్పనిసరిగా 18 నుండి 59 సంవత్సరాల వయస్సు ఆధార్ ప్రకారం కలిగి ఉండవలెను అని వారు అన్నారు. దిర్సనపల్లి గ్రామంలో మొత్తం కుటుంబాలు ఆహార భద్రత కార్డుల ప్రకారం 366 మందికి ఇట్టి పథకమును వర్తింపజేయబడును. కావున అందరూ కూడా తప్పనిసరిగా పంచాయతీ కార్యదర్శి వద్ద 5 రోజులలో నమోదు తీసుకోవలెను. తదుపరి దిర్సనపల్లి గ్రామంలోని రి సర్వే ప్రక్రియను వారు పరిశీలించారు దిర్సనపల్లి గ్రామంలోని పిల్లలమర్రి మల్లయ్య రైతుకు సంబంధించిన జామ, పామాయిల్, మునగ మిర్చి మరియు కోళ్ల పెంపకమును పరిశీలించి మిశ్రమ వ్యవసాయ సాగును చేయుటపై ఆ రైతును కలెక్టర్ అభినందించినారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, పిఏసిఎస్ చైర్మన్ నాగం జయసుధ సుధాకర్ రెడ్డి, పంచాయతీ అధికారి యాదగిరి ప్రత్యేక అధికారి ఎంఏ భారతి తహసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత, సర్పంచ్ పాండవుల లింగయ్య, ఎంపీ ఓ హరి సింగ్ ప్రజలు పాల్గొన్నారు.

రంగనాయకుల గుట్టపై బండరాళ్ల బీభత్సం

- అంబసత్రం మండపం ధ్వంసం
- కూలిన సీతారాముల మండపం ఫిల్లర్, దెబ్బతిన్న టైల్స్.
- తృటిలో తప్పిన పెను ప్రమాదం
- భక్తులు లేని సమయంలో ఘటన..
- లేకుంటే ప్రాణనష్టం జరిగేదన్న ఆందోళన

భద్రాచలం, నవంబర్ 20 (జనంసాక్షి) : భద్రాచలం రంగనాయకుల గుట్టపై చేపట్టిన కాటేజీ నిర్మాణ పనుల సమయంలో భారీ బండరాళ్లు జారిపడి కిందనున్న అంబసత్రం ప్రాంగణంలో పడటంతో కలకలం రేగింది. ఈ ఘటనలో అంబసత్రంలోని సీతారాముల మండపం ఫిల్లర్ ఒకవైపు పూర్తిగా ధ్వంసం కాగా, ప్రాంగణంలోని టైల్స్ సైతం బండరాళ్ల ధాటికి పగిలిపోయాయి. తెల్లవారుజామున ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఆ సమయంలో భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో దాతల సహకారంతో రంగనాయకుల గుట్టపై నూతన కాటేజీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గుట్టపై తవ్వకాలు నిర్వహిస్తుండగా భారీ బండరాళ్లు ఒక్కసారిగా విడిపోయి దొర్లుకుంటూ కిందకు వచ్చాయి. అంబసత్రం ప్రాంగణంలోని సీతారాముల మండపం ఫిల్లర్‌ను బలంగా ఢీకొనడంతో అది ధ్వంసమైంది. బండరాళ్లు అంబసత్రం రూపకర్త పమిడిఘంటం వెంకట హరిదాసు విగ్రహాన్ని తాకుతూ వెళ్లడంతో అక్కడ భయానక పరిస్థితి నెలకొంది. అయితే మండపంలోని సీతారామచంద్రస్వామి, లక్ష్మణస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలకు ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. భక్తుల రాకపోకలు ఎక్కువగా ఉండే సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉండేదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గుట్టపై నిర్మాణ పనులు చేపట్టే సమయంలో దిగువన ఉన్న అంబసత్రం ప్రాంగణానికి బండరాళ్లు జారిపడకుండా ముందస్తు రక్షణ చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని భక్తులు పేర్కొంటున్నారు. తవ్వకాల సమయంలో తగిన భద్రతా ఏర్పాట్లు



చేయకపోవడంపై దేవస్థానం అధికారుల తీరును ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, బండరాళ్లు కిందకు జారకుండా పటిష్టమైన రక్షణ గోడలు, ఇతర భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని కోరుతున్నారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ పనులు కొనసాగించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఘటనపై సంబంధిత అధికారులు పరిశీలన చేపడుతున్నట్లు సమాచారం.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం

భద్రాచలం, నవంబర్ 20 (జనంసాక్షి) : భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ఆలయ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. శుక్రవారం ఆయన ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై దేవస్థానం అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భద్రాద్రి రామాలయానికి నిత్యం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్దేశిత ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భద్రాద్రి క్షేత్రానికి ఉన్న ఆధ్యాత్మిక ప్రాశస్త్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, పుణ్యక్షేత్ర ప్రాముఖ్యతను మరింత పెంపొందించేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనెం కృష్ణ, దేవస్థానం అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21.11.2026



అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ శంకుస్థాపన

రూ.57 లక్షల 85 వేల నిధులతో సిమెంటు రోడ్డు, రెండు నూతన వేదికల నిర్మాణం

రుద్రంగి, నవంబర్ 20 (జనంసాక్షి):రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల సౌకర్యార్థం చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శుక్రవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్, మార్కెట్ కమిటీ అధ్యక్షులు చేలుకల తిరుపతితో కలిసి శంకుస్థాపన చేశారు.మార్కెట్ యార్డు ఆవరణలో సిమెంటు రోడ్డు నిర్మాణంతో పాటు, రెండు నూతన వేదికల నిర్మాణానికి ప్రభుత్వం రూ.57 లక్షల 85 వేల నిధులను మంజూరు చేసింది. భూమి పూజ నిర్వహించిన అనంతరం శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ అన్నదాతలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.ఈ పనులు పూర్తయితే పంట ఉత్పత్తుల కొనుగోలు, నిల్వ విషయంలో రైతులకు ఎదురవుతున్న ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. రైతులకు మేలు చేసే విధంగా మార్కెట్ కమిటీల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. మంజూరైన నిధులతో పనులను నాణ్యతతో, త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, పనులు చేపట్టే వారిని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గండి నారాయణ,తహసీల్దార్ పుష్పలత,ఎంపిడిఓ నటరాజ్, ఉప సర్పంచ్ మాడిశెట్టి అభిలాష్, మాజీ ఎంపీటీసీ గడ్డం శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పిటిసి గట్ల మీనయ్య, పొద్దుపొడుపు లింగారెడ్డి,మండల అధ్యక్షుడు ఎర్రం గంగనర్సయ్య, ప్యాక్స్ అధ్యక్షులు ఏగోళం శ్రీనివాస్, గాసికంటి ప్రభాకర్, డైరెక్టర్ సనుగుల గంగాధర్, వార్డు సభ్యులు శీలం మీనయ్య, పుదారి మహిపాల్, తుమ్మనపెల్లి నరేందర్, గాసికంటి రాజు, ఆత్మ కమిటీ సభ్యులు కట్కూరి దాసు, ఎస్సి విభాగం అధ్యక్షులు దయ్యాల శ్రీనివాస్, తర్రే లింగం, కేసిరెడ్డి నర్సరెడ్డి, బైరి గంగామల్లయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

పాలకవర్గ బాధ్యతల స్వీకరణ

ముస్తాబాద్ నవంబర్ 20 (జనంసాక్షి):
ముస్తాబాద్ మండల కేంద్రంలోని పోతుగల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మహేష్ రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కల్పించిన ఆది శ్రీనివాస్ కు, కేకే మహేందర్ రెడ్డి కి జిల్లా ఆత్మ చైర్మన్ కొండం రాజిరెడ్డికి కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు మీ అందరి సహాయ సహకారాలతో ముందుకు కొనసాగించే బాధ్యత మీదే ఎందుకంటే నేను ఇంత చిన్న వయసులో ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు అందరికీ నేను ఎప్పటికీ రుణపడి ఉంటానని వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సర్పంచులు పాల్గొన్నారు



రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



రూ.3.94 కోట్లతో వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు శ్రీకారం : రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ(జనంసాక్షి):
రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేముల రూరల్ మండల పరిధిలో మర్రిపల్లి గ్రామంలో నూతన వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధి పనులకు రూ.3.94 కోట్ల నిధులు మంజూరు కాగా, ఈ పనులకు విప్ శంకుస్థాపన చేశారు.వేములవాడ పట్టణంలోనీ మార్కెట్ యార్డ్ లో 75 లక్షలతో నిర్మిస్తున్న కవర్ షేడ్స్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డు అభివృద్ధికి సుమారు రూ.7 కోట్లకు పైగా అంచనాలతో ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మొదటి దశలో రూ.3.94 కోట్ల నిధులు మంజూరు చేయించి పనులకు శ్రీకారం చుట్టామని, మరో రూ.3 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చి రెండో దశలో షెడ్ల నిర్మాణం, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ భవన నిర్మాణం తదితర పనులు చేపడతామని వెల్లడించారు. రైతుల అవసరాల దృష్ట్యా మార్కెట్ యార్డులో అదనంగా రూ.70 లక్షలతో అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు..గతంలో వ్యవసాయ మార్కెట్‌కు కేటాయించిన స్థలం అనువుగా లేకపోవడంతో స్వయంగా పరిశీలించి, రైతులకు ఉపయోగపడే విధంగా నూతన స్థలంలో మార్కెట్ యార్డు నిర్మించాలని నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ కమిటీ పాలకవర్గం చేసిన కృషి, ప్రతిపాదనల మేరకు ప్రభుత్వాన్ని ఒప్పించి నిధులు మంజూరు చేయించామని చెప్పారు.ప్రజా జీవితంలో పదవులు వస్తుంటాయి, పోతుంటాయి, కానీ మనం ప్రజల కోసం చేసిన పనులే చిరకాలం గుర్తుండిపోతాయని ఆది శ్రీనివాస్ అన్నారు. సర్పంచి నుంచి ఎమ్మెల్యే, ఎంపీ వరకు ఏ హోదాలో ఉన్నా ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు.మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులు సమష్టిగా కృషి చేసి రైతుల కోసం మంచి మార్కెట్ యార్డు నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు .వేముల వాడ రూరల్‌కు నూతన ఎమ్మార్వో కార్యాలయం వేములవాడ రూరల్ మండలానికి నూతన ఎమ్మార్వో కార్యాలయం మంజూరైందని, ఇందుకోసం రూ.2 కోట్లకు పైగా నిధులు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. శాత్రాజ్‌పల్లి, చెక్కెపల్లి, మర్రిపల్లి, హనుమాజీపేట తదితర నాలుగు మార్గాల నుంచి వచ్చే ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేస్తున్నామని చెప్పారు.ఎకరం భూమిని ఎమ్మార్వో కార్యాలయ నిర్మాణానికి కేటాయించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరగా, మార్కెట్ కమిటీ పాలకవర్గం కూడా రాకపోకలు అంగీకరించిందని తెలిపారు. కలెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపించామని, త్వరలోనే కార్యాలయ నిర్మాణానికి చర్యలు చేపడతామని వెల్లడించారు.నియోజకవర్గంలో నాలుగు నూతన సింగిల్ విండో రైతులకు సహకార సేవలను మరింత చేరువ చేసేందుకు నియోజకవర్గంలో చెక్కెపల్లి, రుద్రంగి, కతలాపూర్, మన్నెగూడెం ప్రాంతాల్లో నూతన సింగిల్ విండో కేంద్రాలు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తం ఆరు ప్రాంతాలకు ప్రతిపాదనలు పంపగా, నాలుగు ప్రాంతాల్లో అనుకూలత ఉండటంతో మంజూరు లభించిందన్నారు. మిగిలిన రెండు ప్రాంతాల్లోనూ భవిష్యత్తులో రైతుల ఖాతాలు, బ్యాంకింగ్ సేవలు పెరిగినప్పుడు సింగిల్ విండోలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతును రాజుగా చూడాలనే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని ఆది శ్రీనివాస్ అన్నారు. రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.



ధరల నియంత్రణే ప్రభుత్వ లక్ష్యం

బాన్సువాడలో ప్రత్యేక సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

బాన్సువాడ నవంబర్ 20 (జనంసాక్షి):సామాన్య ప్రజలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని తక్కువ ధరలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరల పెరుగుదలను నియంత్రించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాల మేరకు బాన్సువాడ పట్టణంలోని తిరుమల రైస్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక సన్న బియ్యం విక్రయ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా బియ్యం విక్రయాల వివరాలను పరిశీలించి, వివిధ రకాల బియ్యం ధరలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎల్-నినో ప్రభావంతో ప్రపంచవ్యాప్తంగా వర్షపాతం తగ్గడం, వ్యవసాయ ఉత్పత్తులపై ప్రభావం పడటం వంటి కారణాలతో సన్న బియ్యం ధరలు పెరుగుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో ధరల పెరుగుదలను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగానే ధరలను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రత్యేక బియ్యం విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కేంద్రం ద్వారా బహిరంగ మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకు నాణ్యమైన సన్న బియ్యాన్ని ప్రజలకు అందిస్తున్నట్లు చెప్పారు. రేషన్ కార్డులు ఉన్నవారితో పాటు రేషన్ కార్డులు లేని అల్పాదాయ వర్గాల ప్రజలు కూడా ఈ కేంద్రంలో బియ్యం కొనుగోలు చేసుకునే వెసులుబాటు కల్పించినట్లు స్పష్టం చేశారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యం ధరల భారాన్ని తగ్గించడంలో ఈ కేంద్రాలు దోహదపడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నైనీ బొగ్గు సరఫరాకు సింగరేణి సంసిద్ధం..

- ఒడిశాలోని ఎన్టీపీసీ కనిహా ప్లాంట్‌కు సరఫరాకు ఓకే
- ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్‌తో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి భేటీ..



గోదావరిఖని, జనంసాక్షి:ఒడిశా రాష్ట్రంలోని నైనీ బొగ్గు బ్లాక్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేయగా మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలతో పాటు ఆ రాష్ట్రంలో ఉన్న ఎన్టీపీసీ కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్‌కు సరఫరా చేయడానికి సింగరేణి సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ చైర్మన్ అండ్ ఎండీ గురుదీప్ సింగ్‌తో సింగరేణి సంస్థ సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి న్యూఢిల్లీలో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో సింగరేణి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి. శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి.. నైనీ బొగ్గు బ్లాక్‌లో జరుగుతున్న ఉత్పత్తి గురించి వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు తెలంగాణ రాష్ట్రానికి ప్రథమ ప్రాధాన్యతనిస్తూ.. యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రానికి నైనీ బొగ్గులో అధిక భాగం సరఫరా చేస్తున్నామని తెలిపారు. మిగిలిన బొగ్గును స్థానిక పరిశ్రమలకు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. ఎన్టీపీసీతో ఇప్పటికే తమకున్న బొగ్గు సరఫరా ఒప్పందాలకు అనుబంధంగా.. ఒడిశాలోని కనిహా థర్మల్ విద్యుత్ ప్లాంట్ కూడా బొగ్గును అందించడానికి సంసిద్ధంగా ఉన్నామని తెలియజేశారు. సింగరేణి సంస్థ ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలోని ఎన్టీపీసీ ప్లాంట్లతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల్లోనీ ఆ సంస్థకు చెందిన ప్లాంట్లకు ఒప్పందం ప్రకారం దశాబ్దాల కాలంగా బొగ్గు సరఫరా చేస్తూ వస్తోందని సింగరేణి చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి వివరించారు. సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో తెలంగాణ తర్వాత ఎక్కువ శాతం బొగ్గును ఎన్టీపీసీ ప్లాంట్‌లకే సరఫరా చేస్తోందన్నారు. ఒడిశాలోని నైనీ బొగ్గు బ్లాక్ వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి 10 మిలియన్ టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయనుందని సింగరేణి చైర్మన్ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. నాలుగు దశాబ్దాల పాటు ఈ బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి జరగనుందని వివరించారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్టీపీసీ కనిహా థర్మల్ ప్లాంట్‌కు దీర్ఘకాలిక ఒప్పందంతో బొగ్గును అందించటానికి సింగరేణి సంసిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దీనిపై ఎన్టీపీసీ చైర్మన్, ఎండీ గురుదీప్ సింగ్ సానుకూలంగా స్పందించారు. తమ ప్లాంట్‌కు అవసరమైన బొగ్గును ప్రస్తుతం ఇతర ప్రభుత్వ బొగ్గు సంస్థల ద్వారా స్వీకరిస్తున్నామని, నైనీ బొగ్గు బ్లాకు తమ ప్లాంట్‌కు సమీపంలోనే ఉన్నందున అక్కడి నుంచి కూడా బొగ్గు తీసుకోవడానికి ఉన్న అవకాశాలను పరిశీలిస్తామని పేర్కొన్నారు.



ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ తప్పుడు ఆరోపణలు..

తిప్పికొట్టడానికే బిజేపీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ రాక

అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:ఇందూరు: ఎస్ ఐఆర్ పై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టడానికే బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ ఈ నెల 23న ఇందూరుకు వస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని సుభాష్ నగర్ లో గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బిజెపి కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, ఆయా మోర్చాల అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నితిన్ నబీన్ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణకు ఇది రెండోసారి రావడం అన్నారు. ఇందూరుకు మొదటిసారిగా వస్తున్నారని చెప్పారు. అయితే అధికారికంగా ఒకటి రెండు రోజుల్లో చెప్పడం జరుగుతుందన్నారు. కావున ప్రతి నాయకుడు జన సమీకరణ ఎక్కువగా చేపట్టాలని సూచించారు. ప్రజలు బిజెపి వైపు చూస్తున్నారని ఇందూరు కాషాయానికి అడ్డా అని తెలిపారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి పాదయాత్రను విజయవంతం చేయాలన్నారు. బిజెపి బలం చూపించాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలపై ఇప్పటికే ప్రజలకు స్పష్టత వచ్చిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ గ్రాఫ్ పడిపోతుందని, వారి ఎమ్మెల్యేలే సీఎం రేవంత్ రెడ్డి పై చేస్తున్న ఆరోపణలు ఎందుకు ఉదాహరణ అన్నారు. జిల్లా అధ్యక్షులు దినేష్ కులా చారి, పసుపు బోర్డు జాతీయ చైర్మన్ పల్లె గంగారెడ్డి, ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డివ్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు, మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి పనికి గడువు విధించుకోవాలి

రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, పనులను త్వరితగతిన పూర్తిచేయాలి:కలెక్టర్ గరిమ అగ్రవాల్



వేములవాడ,నవంబర్ 20 (జనంసాక్షి):వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనుల్లో ప్రతి దానికి గడువు విధించి వేగంగా పూర్తి చేయాలని వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.వేములవాడ పట్టణంలో వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ (వీటీఏడీఏ) ఆధ్వర్యంలో శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం విస్తరణ, అభివృద్ధి పనులు, నిత్యాన్నదాన సత్రం, బద్ది పోచమ్మ ఆలయం, 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులపై వీటీఏడీఏ వైస్ చైర్ పర్సన్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం నుంచి శుక్రవారం ఆర్ అండ్ బీ, దేవాదాయ శాఖ, ఎన్ పీ డీ సీ ఎల్, వేములవాడ మున్సిపల్ అధికారులతో ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాజన్న ఆలయ విస్తరణ, అభివృద్ధి, బద్ది పోచమ్మ ఆలయ నిర్మాణ పనుల్లో భాగంగా ప్రతి పనికి సంబంధించి ప్రత్యేకంగా కూలీల సంఖ్య పెంచాలని, పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఆర్ అండ్ బీ అధికారులు నిత్యం అభివృద్ధి పనులను పరిశీలిస్తూ వేగంగా పూర్తి చేసేలా పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. రాజన్న ఆలయం నుంచి మూలవాగు బ్రిడ్జి వరకు 80 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో మిగతావి ప్రణాళిక ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో దేవాదాయ శాఖ ధార్మిక సలహాదారు గోవింద హరి, శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, ఆర్ అండ్ బీ ఈఈ భీమ్లానాయక్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

బేస్ బాల్ జిల్లా స్థాయి ఎంపిక పోటీలు..

గోదావరిఖని, జనంసాక్షి :స్థానిక ప్రభుత్వ పీజీ డిగ్రీ కళాశాల మైదానంలో ఈ నెల 24న జిల్లా స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషులు (అండర్?17) బాలబాలికల బేస్ బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ కార్యదర్శి భాషబోయిన వాసు,కోచ్ రాజుల బిందుజ తెలిపారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొననున్నారు. క్రీడాకారులు 24నా ఉదయం 9 గంటలకు గోదావరిఖని ప్రభుత్వ పీజీ డిగ్రీ కళాశాల మైదానానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.సీనియర్స్ విభాగంలో 18 సంవత్సరం పైబడిన వారు, జూనియర్ విభాగంలో 2009 జనవరి 1 నుంచి 2011 జనవరి 1 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలోని టీజీ ఆర్ జె సి బాలుర విభాగంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు పోలీసులపై భరోసా..

- బాధితులకు న్యాయం..
- నేరస్తులకు చట్టపరమైన శిక్షే లక్ష్యం..
- పటిష్టమైన దర్యాప్తుతో 76 కేసుల్లో 112 మందికి శిక్షలు..
- పోలీస్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడటమే మా బాధ్యత..
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా..



గోదావరిఖని, జనంసాక్షి :నేరాల దర్యాప్తులో నాణ్యత, న్యాయస్థానాల్లో పటిష్టమైన ఆధారాల సమర్పణ, సమర్థవంతమైన సమన్వయంతో నేరస్తులకు శిక్షలు పడేలా కృషి చేసిన పోలీసు, ప్రాసిక్యూషన్ అధికారులను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అభినందించారు.2026 సంవత్సరంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొత్తం 76 కాంటెస్టెడ్ కన్విక్షన్ కేసుల్లో 112 మంది నిందితులకు న్యాయస్థానాలు శిక్షలు విధించాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.ఈ కేసులన్నింటిలో కలిపి న్యాయస్థానాలు మొత్తం రూ.7,44,500 జరిమానా విధించాయని పోలీస్ కమిషనర్ తెలిపారు.సీపీ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ, నేరం చేసిన వ్యక్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా చేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని అన్నారు.కేసు నమోదు చేసినప్పటి నుంచి దర్యాప్తు పూర్తి చేయడం, శాస్త్రీయ ఆధారాలను సేకరించడం, సాక్ష్యాలను పటిష్టంగా రూపొందించడం, వాటిని న్యాయస్థానాల్లో సమర్థవంతంగా ప్రవేశపెట్టడం వరకు ప్రతి దశలో అధికారులు అత్యంత బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఒక కేసులో నేరం నిరూపితమై నిందితుడికి శిక్ష పడినప్పుడు బాధితులకు న్యాయం జరగడంతో పాటు, ప్రజల్లో పోలీసు వ్యవస్థపై, న్యాయవ్యవస్థపై నమ్మకం మరింత బలపడుతుందని తెలిపారు.నేరం చేసిన వారికి చట్టం నుంచి తప్పించుకునే అవకాశం లేదనే నమ్మకమైన సందేశం సమాజానికి అందుతుందని అన్నారు.ముఖ్యంగా మహిళలు, చిన్నారులపై నేరాలు,హత్యలు, పోక్సో మరియు ఇతర తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో అధికారులు ప్రత్యేక శ్రద్ధతో దర్యాప్తు చేపట్టి,ప్రతి అంశాన్ని పకడ్బందీగా న్యాయస్థానాల ముందు నిరూపించాలని సూచించారు.పోలీస్ అధికారులు, కోర్టు డ్యూటీ సిబ్బంది,పబ్లిక్ ప్రాసిక్యూటర్లు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అన్నాంఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ మరింత అంకితభావంతో పనిచేస్తూ, బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి,జనంసాక్షి:జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని , ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న ప్రైవేటు జూనియర్ కళాశాలల పైన చర్యలు తీసుకోవాలని పి డి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్,నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో డి ఐ ఈ ఒ జి.తుకారాం కి పి డి ఎస్ యూ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది.నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో సిలబస్ సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని, కొన్ని కళాశాలలో సమయానికి లెక్చరర్స్ రావడం లేదని వారిపై నిఘా ఉంచాలని, ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వచ్చిన యూనిఫామ్స్ వెంటనే విద్యార్థులకు ఇవ్వాలని , ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని,అన్ని ప్రభుత్వ ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో నిరంతరం తనిఖీలు నిర్వహించాలని కోరారు. అదే విధంగా నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ జూనియర్ కళాశాలలలో పూర్తిస్థాయి ఫీజుల కోసం విద్యార్థులను ఇబ్బందులు పెడుతున్నారని , కోచింగ్ యాప్ ల పేరిట అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. నాయకులు హనుమంత్,వీర, వంశీ,మనోజ్,కైలాస్ తదితరులు పాల్గొన్నారు.



కేసీఆర్ ఉద్యమ స్ఫూర్తిని చాటుదాం

- దీక్షా దివస్ సభకు తరలిన గులాబీ దండు..
- అలుగునూరు సభను విజయవంతం చేద్దాం..
- మాజీ ఎంపీ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



గోదావరిఖని, జనంసాక్షి :తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు గుర్తుగా నవంబర్ 29న కరీంనగర్‌లోని అలుగునూరు చౌరస్తా సమీపంలో నిర్వహించనున్న దీక్షా దివస్ స్ఫూర్తి మహాసభను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ బాల్క సుమన్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పిలుపునిచ్చారు. రామగుండం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, సింగరేణి కార్మికులు, ప్రజలు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. శుక్రవారం కాశిపల్లి ఎన్టీపీసీ సమీపంలోని శ్రీమయి లగ్జరీ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగడం లేదని, కొత్త పథకాలు వచ్చిన దాఖలాలు లేవని మాజీ ఎంపీ బాల్క సుమన్ విమర్శించారు. పథకాల కంటే కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయని వ్యాఖ్యానించారు. కేసీఆర్ నాయకత్వంలో మరోసారి ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని, సింగరేణి సంస్థను కాపాడుకోవడంతో పాటు గతంలో నిర్మించిన ప్రాజెక్టులను పరిరక్షించుకోవాలని అన్నారు. రైతుల ప్రయోజనాలు, ప్రజల హక్కుల కోసం పోరాటమే మార్గమని స్పష్టం చేశారు. అక్టోబర్ 14న కేటీఆర్ పాల్గొన్న సింగరేణి కార్మిక గర్జన సభకు వేలాది

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 నవంబర్ 2026

ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం

- పేద కుటుంబానికి అండగా ఇందిరమ్మ జీవిత బీమా
- కుటుంబానికి ఆర్థిక సాయం రూ 5 లక్షలు భరోసా



భిక్కనూరు నవంబర్ 20 జనంసాక్షి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం భిక్కనూరు మండలంలోని గుర్జకుంట గ్రామంలో శుక్రవారం అధికారులతో ప్రజాప్రతినిధులతో కలిసి పథకాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ ఇందిరమ్మ జీవిత బీమా పథకం పేద మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే గొప్ప కార్యక్రమమని పేర్కొన్నారు. కుటుంబానికి ఆధారంగా ఉన్న ఇంటి యజమానులకు ఏదైనా ప్రమాదవశాత్తు వారు మృతి చెందిన సందర్భంలో ఆ కుటుంబానికి ఇందిరమ్మ జీవిత బీమా పథకంలో రూ 5 లక్షల బీమా పరిహారం అందించడం జరుగుతుందని తెలిపారు. కుటుంబం బాధలో ఉండి కుటుంబ పెద్దను కోల్పోయిన సమయంలో ఆ కుటుంబానికి ఆర్థిక ఇబ్బందులు పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈపథకాన్ని అమలు చేస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనాలు అందించేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంతోష్ రెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, రాష్ట్ర పిసిసి ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగన్న గారి నరేందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఎంపీడీవో సవితారెడ్డి, ఎంపీఓ రాజ్ కిరణ్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువులో పడి వ్యక్తి మృతి

ఏడు గంటల పాటు గాలింపు.. పోలీసుల, ఫైర్ సిబ్బంది శ్రమతో మృతదేహం వెలికితీత

సదాశివనగర్, నవంబర్ 20 (జనంసాక్షి): సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామంలోని పెద్ద చెరువులో పడి ఎడ్ల నర్సింలు (34) అనే వ్యక్తి మృతి చెందాడు. ఏడు గంటల పాటు పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని వెలికితీశారు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 19వ తేదీ ఉదయం గ్రామంలోని గోదాంలో పని చేసేందుకు వెళు న్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన నర్సింలు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు సదాశివన గర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఐ పుష్పరాజ్ సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నర్సింలు ఆచూకీని గుర్తించగా, అతను గ్రామంలోని పెద్ద చెరువు వద్ద ఉన్నట్లు తెలిసింది. వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని చెరువులో గాలింపు చర్యలు చేపట్టా రు. సుమారు ఏడు గంటల పాటు తీవ్రంగా శ్రమించి మృతదేహాన్ని వెలికితీశారు. ఈ గాలింపు చర్యల్లో ఫైర్ సిబ్బంది ఎస్ఎఫ్ఓ రాజేష్, రమేష్‌తో పాటు సదాశివనగర్‌కు చెందిన గజ ఈతగాడు బెస్త లింగం, గ్రామస్తు లు మోసర్ల శ్రీకాంత్ రెడ్డి, బెస్త రాకేష్‌లు సహకరించారు. మృతుడు నర్సింలుకు భార్య సాయి వెన్నెల, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇటీవలే చిన్న కుమార్తె సుబిక్షకు 21 రోజుల తొట్టె కార్యక్రమం నిర్వహించడంతో కుటుంబం లో తీవ్ర విషాదం నెలకొంది. మృతదేహాన్ని వెలికితీసేందుకు సహకరించిన ఫైర్ సిబ్బంది, గజ ఈతగాడు, గ్రామస్తులు, పోలీసులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని, పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు.



నిరుద్యోగ యువతకు ఉద్యోగ భరోసా కల్పించడమే లక్ష్యం


20కి పైగా దిగ్గజ కంపెనీల భాగస్వామ్యం

- 2 వేలకు పైగా ఉద్యోగాలతో నేడు మెగా జాబ్‌మేళా
- పోస్టర్ ఆవిష్కరించిన మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి): నిరుద్యోగ యువతకు స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు కల్పించ డమే లక్ష్యంగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ దాసరి మమతా రెడ్డి తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో, ట్రినిటీ విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి సౌజన్యంతో శనివారం నిర్వహించనున్న జాబ్‌మేళా పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించా రు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 20కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొంటూ 2 వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ట్రినిటీ విద్యాసంస్థలు ఏటా జాబ్‌మేళాలు నిర్వహిం చడం అభినందనీయమన్నారు. గతంలో దాసరి మనోహర్‌రెడ్డి ప్రత్యేక శిక్షణ ఇప్పించి సుమారు 3 వేల మంది యువతకు ఆర్మీ, ఇతర రక్షణ దళాల్లో ఉద్యోగాలు పొందేందుకు కృషి చేశారని గుర్తుచేశారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పెద్దపల్లి ప్రగతినగర్‌లోని ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో నవంబర్ 21న ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుంది. అర్హులైన అండర్ గ్రాడ్యుయేట్లు, గ్రాడ్యుయేట్లు, పోస్టు గ్రాడ్యుయేట్లు బయోడేటా, విద్యార్హత ధ్రువపత్రాలతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో ట్రినిటీ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ అశోక్‌కుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ మణి గణేష్, అడ్మిన్ ఆఫీసర్ సురేష్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లోపాలమయంగా 563 జాతీయ రహదారి

- మిణుకు మిణుకుమంటున్న విద్యుత్ దీపాలు
- కనిపించని సూచిక బోర్డులు
- సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌లు లేక ఇక్కట్లు
- సౌకర్యాలు లేకున్నా టోల్ ఫీజుల వసూళ్లు



శంకరపట్నం, నవంబర్ 20 (జనంసాక్షి): వేల కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన జగిత్యాల-వరంగల్ జాతీయ రహదారి-563పై అనేక సమస్యలు ప్రయాణికులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. విద్యుత్ దీపాలు సరిగా వెలగకపోవడం, సూచిక బోర్డులు లేకపోవడం, సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌ల కొరతతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించకపోయినా టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారని ప్రయాణి కులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్-వరంగల్ మార్గంలోని తాడికల్, అంబాలపూర్ సమీప బ్రిడ్జిపై విద్యుత్ దీపాలు మిణుకు మిణుకుమంటూ మధ్యలో ఆరిపోతున్నాయి. దీంతో రాత్రివేళ ప్రయాణం ప్రమాదకరంగా మారుతోందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. రహదారి పక్కన మట్టి కుప్పలను సైతం పూర్తిస్థాయిలో తొలగించలేదని విమర్శిస్తున్నారు. గ్రామాలకు వెళ్లే మార్గాలను సూచించే బోర్డులు లేకపోవడంతో కొత్తగా వచ్చే వాహనదారులు దారులు గుర్తించలేక అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. కొన్ని గ్రామాలకు సర్వీస్ రోడ్లు లేక నాలుగైదు కిలోమీటర్లు ముందుకు వెళ్లి తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. దూరాన్ని తగ్గించుకునేందుకు కొందరు రాంగ్ రూట్‌లో వెళ్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు చెబుతున్నారు. ప్రజల రాకపోకలు, వ్యవసాయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని అండర్‌పా స్‌లు నిర్మించలేదని, అవసరం లేని చోట ఏర్పాటు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణ సమయంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిగణనలోకి తీసుకోలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా జాతీయ రహదారి నిర్మాణ సంస్థ, సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి విద్యుత్ దీపాలకు మరమ్మతులు చేయాలని, మట్టి కుప్పలు తొలగించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. అవసరమైన చోట సర్వీస్ రోడ్లు, అండర్‌పాస్‌లు నిర్మించి ప్రయాణాన్ని సురక్షితంగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సులతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి

బస్తీ దవాఖానాలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 20(జనంసాక్షి) : జిల్లాలోని యువతకు మార్కెట్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో నైపుణ్య శిక్షణ అందించి,వారికి పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.శు క్రవారం పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన టాస్క్ కేంద్రాన్ని, పెద్దపల్లి పట్టణంలోని పదో వార్డు రంగంపల్లిలో ఉన్న బస్తీ దవాఖానాను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,టాస్క్ కేంద్రం ద్వారా మార్కెట్లో ప్రస్తుతం డిమాండ్ ఉన్న వివిధ కోర్సులను యువతకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరిగేలా అవసరమైన నైపుణ్యాలను గుర్తించి,వాటికి అనుగుణంగా శిక్షణ కోర్సులను రూపొందించి అమలు చేయాలని సూచించారు.యువతకు కేవలం శిక్షణ అందించడమే కాకుండా, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించి ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. టాస్క్ కేంద్రం ద్వారా మరింత మంది యువతకు ప్రయోజనం కలిగేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.అనంతరం రంగంపల్లి లోని బస్తీ దవాఖానాను పరిశీలించిన కలెక్టర్, అక్కడ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందు బాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.బస్తీ దవాఖానాకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, వైద్యులు, వైద్య సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని ఆదేశించారు.ప్రస్తుతం సీజన్ మారుతున్న నేపథ్యంలో జ్వరాల కేసులు పెరిగే అవకాశం ఉన్నందున వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,అవసరమైన మందులను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ సూచించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ పర్యటనలో టాస్క్ రీజినల్ మేనేజర్ కౌసల్య,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రత కోసం మానవహారం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 20 జనం సాక్షి: తెలంగాణ యూనివర్సిటీ, డిచ్‌పల్లి కాంట్రాక్ట్ అధ్యాపకుల ఉద్యోగ భద్రత, సర్వీసు పరిరక్షణ మరియు న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తెలంగాణ యూనివర్సిటీలో కాంట్రాక్ట్ అధ్యాపకులు మానవహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఐక్యంగా మానవహారంగా ఏర్పడి తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నో సంవత్సరాలుగా విశ్వవిద్యాలయాల్లో భోదిస్తు పరిశోధన రంగాల్లో విశేష సేవలందిస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హతలు మరియు సర్వీసు నిబంధనలకు అనుగుణంగా రెగ్యులరైజేషన్ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా UGC నిబంధనల ప్రకారం వేతనాలు, సర్వీసు ప్రయోజనాలు కల్పించి, కాంట్రాక్ట్ అధ్యాపకుల భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న ఉద్యమ కార్యాచరణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ గంగాకిషన్, డాక్టర్ దత్తాహరి, డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ ఆనంద్, డాక్టర్ కోపిరాజు మోహన్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ జలంధర్, డాక్టర్ నరసింహ, నాగేంద్రబాబు, అపర్ణ, శ్వేత, రమ్య, పద్మ, నేత, రామలింగం, ఆనంద్, సందీప్, నర్సయ్య, మోహన్ తదితర కాంట్రాక్ట్ అధ్యాపకులు పాల్గొన్నారు.తరగతులకు, విద్యార్థుల విద్యా కార్యక్రమాలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని అధ్యాపకులు తెలిపారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి, కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించే దిశగా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలి


బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి



ఎడపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి) : ప్రస్తుత ఎల్ నినో ప్రభావం వల్ల రైతులు ఆరుతడి పంటలపైనే దృష్టి సారించాలని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎడపల్లి మండలం జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ నూతన గృహానికి వచ్చిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులతో కాసేపు మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల కోసం ప్రత్యేక దృష్టి సారించి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందని అయితే ప్రస్తుతం ఎల్ నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడగంటి పోయే ప్రమాదం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా రైతులకు ఉచిత విత్తనాలను అందించడంతోపాటు వ్యవసాయ పనిముట్లు సైతం సబ్సిడీ రూపంలో అందించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. వర్షాభావ పరిస్థితుల వల్ల రైతులు వరి పంట వేసి నష్టపోయే అవకాశం ఉన్నందున ఆరుతడి పంటలు వేసి ప్రభుత్వం కల్పించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని బోధన్ ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో జైతాపూర్ సహకార సంఘం చైర్మన్ కరటూరి సత్యనారాయణ దంపతులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, ఎడపల్లి సహకార సంఘం చైర్మన్ గాంధారి హనుమంత్ రెడ్డి, జైతాపూర్ సర్పంచ్, మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు నాగుల రాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుంది
- ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ అలీ షబ్బీర్



కామారెడ్డి, జిల్లా ప్రతినిధి నవంబర్ 20 (జనంసాక్షి) : పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ అలీ షబ్బీర్ అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో రోడ్డున పడకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టిన ట్లు తెలిపారు. శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని 38, 15వ వార్డుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని మహమ్మద్ అలీ షబ్బీర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా పథకం లక్ష్యాలు, ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే పిల్లల చదువులు, కుటుంబ పోషణ, వైద్య ఖర్చులకు ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి భవిష్యత్తుకు భద్రత కల్పించడమే ఈ పథకం ఉద్దేశమన్నారు.

అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

- ముప్కాల్‌లో ఘనంగా చేయూత పెన్షన్ల పంపిణీ
- లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసిన మంత్రి సీతక్క
- మహిళా సంఘాలకు రూ.21.91 కోట్ల రుణాలు పంపిణీ
- జిల్లాలో కొత్తగా 20,555 మందికి పెన్షన్లు మంజూరు



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి): ముప్కాల్ మండల కేంద్రంలోని మణికంఠ ఫంక్షన్ హాల్‌లో శు క్రవారం చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొని కొత్తగా పెన్షన్లు మంజూరైన లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. బాల్కొండ నియోజకవర్గ మహిళా స్వయం సహాయక సంఘాలకు రూ.21.91 కోట్ల రుణాలను చెక్కుల రూపంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ భుజంగరావు, డీఆర్డీఓ సాయన్న పాల్గొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రంలో 4.63 లక్షల మందికి చేయూత పెన్షన్లు అందుతుండగా, వారిలో 3.50 లక్షల మంది మహిళలేనన్నారు. మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు అందించడంతో పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ, విద్యార్థుల యూనిఫారాల కుట్టింపు వంటి బాధ్యతలు అప్పగిస్తున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా సంఘాలు రూ.167 కోట్ల కమీషన్ ఆదాయం పొందాయని వివరించారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, సోలార్ ప్లాంట్ల నిర్వహణలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు మహిళా సంఘాలకు రూ.76 వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించామని తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించే ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళా సంఘాల రుణగ్రహీత మరణిస్తే రుణం మాఫీతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రతి నియోజకవర్గానికి 5,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, రైతులకు రూ.23 వేల కోట్ల పంట రుణమాఫీ చేశామని తెలిపారు. రానున్న రెండేళ్లలో నిజామాబాద్ జిల్లాను విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తామని చెప్పారు.

జిల్లా వ్యాప్తంగా 20,555 మందికి కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరయ్యాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. పెన్షన్ల మంజూరు నిరంతర ప్రక్రియ అని, అర్హులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి తదుపరి విడతలో మంజూరు చేస్తామని తెలిపారు. బాల్కొండ నియోజకవర్గంలో 3,092 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని, ఈ నెల 26న వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని మంత్రి సీతక్క వెల్లడించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

23న కరీంనగర్‌కు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

లక్ష మందితో మహా పాదయాత్రకు ఏర్పాట్లు

- మధ్యాహ్నం 12 గంటలకు వైశ్య భవన్ నుంచి ప్రారంభం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సహా ముఖ్య నేతల హాజరు
- యాత్రను విజయవంతం చేయాలని రామచంద్రరావు పిలుపు



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 20 (జనంసాక్షి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఈ నెల 23న కరీంనగర్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా 'ప్రజాస్వా మ్యాన్ని రక్షిద్దాం.. అరాచకత్వాన్ని పాతరేద్దాం' నినాదంతో నిర్వహించనున్న మహా పాదయాత్రలో పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వైశ్య భవన్ నుంచి టవర్ సర్కిల్, శాస్త్రి రోడ్డు మీదుగా కమాన్ వరకు యాత్ర కొనసాగనుంది. నితిన్ నబీన్‌తో పాటు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, రాష్ట్ర ఇన్‌ఛార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌ఛార్జీలు అభయ్ పాటిల్, రేఖాశర్మ పాల్గొననున్నారు. జాతీయ అధ్యక్షుడి తొలి కరీంనగర్ పర్యటన నేపథ్యంలో కనీసం లక్ష మందితో పాదయాత్ర నిర్వహించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు బండి సంజయ్ శుక్రవారం కరీంనగర్, సిరిసిల్ల జిల్లాల పార్టీ నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఏర్పాట్లపై సమీక్షించారు. పార్లమెంట్ నియోజకవర్గ పరిధి నుంచి భారీగా కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చే లా చర్యలు తీసుకోవాలని సూచించారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. 'సర్' పేరుతో ఎన్నికల సంఘం, ఇతర రాజ్యాంగ సంస్థలపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని బండి సంజయ్ ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు వివరించడమే పాద యాత్ర లక్ష్యమని పేర్కొన్నారు. యాత్రలో ప్రజాస్వామ్య వాదులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పిలుపునిచ్చారు.

ఎల్‌నినో ప్రభావంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రూ.30 లక్షలతో పెద్దపల్లిలో సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులు
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచులు తనిఖీ చేయాలి
- 41 కిలోలకు మించి తూకం వేయొద్దు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ విజయరమణరావు



పెద్దపల్లి, నవంబర్ 20 (జనంసాక్షి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు వచ్చే అవకాశాలున్నందున రైతులు ముందస్తు జాగ్రత్త లు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావు సూచించారు. వాతావర ణ పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవాలని, వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. పెద్దపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డు గౌడిడ్డిపేట బీటీ రోడ్డు నుంచి శాంతినగర్ బ్రిడ్జి వరకు డీఎంఎఫ్‌టీ నిధులు రూ.30 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచులు క్రమం తప్పకుండా సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తూకంలో నిబంధనలు పాటిస్తూ 41 కిలోలకు మించి ధాన్యం తీసుకోవద్దని, కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ కుటుంబ బీమా, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ప్రయోజనాలు అర్హులకు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో శాఖల మధ్య సమన్వయం ఉండాలని విజయరమణరావు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య, కమిషనర్ ఆకుల వెంకటేష్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాజయ్య, కౌన్సిలర్లు, సర్పంచులు, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

భూ రికార్డుల్లో పారదర్శకత కోసమే భూముల రీ సర్వే

- రైతులు రీ సర్వే ప్రక్రియకు సహకరించాలి
- కలెక్టర్ ప్రతీక్ జైన్



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : భూ రికార్డుల్లో పారదర్శకత కోసమే భూముల రీ సర్వే నిర్వహించడం జరుగుతుందని, రైతులు రీ సర్వే ప్రక్రియకు సహకరించాల ని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ స్పష్టం చేశారు. సంగారెడ్డి మండలంలోని నాగపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన భూ భారతి – భూముల పునఃసర్వేపై అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి కార్యక్రమం, భూముల పునఃసర్వే విధానం, దాని ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలపై గ్రామస్థులకు, రైతులకు వివరించారు. భూముల పునఃసర్వేతో భూ రికార్డుల్లో పారదర్శకత పెరగడంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని తెలిపారు. రైతులు తమ భూములకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులకు అందించి, పునఃసర్వే ప్రక్రియకు సహకరించాలని సూచించారు. అలాగే నూతనంగా ప్రారంభించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం



మిడ్జిల్, నవంబర్ 20 (జనం సాక్షి) : ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మసిగుండ్లపల్లి గ్రామ సర్పంచ్, సర్పంచుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోద శ్రీశైలం అన్నారు. శుక్రవారం మిడ్జిల్ మండల పరిధిలోని మసిగుండ్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీశైలం మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుచూపుతో భూమి ఉన్నా లేకున్నా రేషన్ కార్డు కలిగిన అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా భరోసా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా, తిరిగి నిలదొక్కుకునేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రామంలోని ప్రతి అర్హులైన పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంతో పాటు గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ పార్టీకి మరోసారి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నికల సమయంలో ప్రతి ఓటరు ఆలోచించి, గ్రామ అభివృద్ధికి కృషి చేసే మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధు, వార్డు సభ్యులు. గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



కల్వకుర్తి, నవంబర్ 20 (జనంసాక్షి) : తాండ్రగ్రామంలో నూతనంగా ప్రారంభమైన బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల, వసతిగృహాన్ని గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ మాధవితో కలిసి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, అందిస్తున్న భోజనం, విద్యాబోధన,పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో నేరుగా మాట్లాడి భోజనం,వసతి సౌకర్యాలు ఎలా ఉన్నాయని, చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల అవసరాలు, సమస్యలపై ప్రిన్సిపల్‌తో సమీక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,, విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే పేద, మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్యతోపాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించడం ఎంతో అవసరమని అన్నారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పాఠశాల, వసతిగృహ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.విద్యార్థుల విద్యాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు.గ్రామంలో బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల,వసతిగృహం అందుబాటులోకి రావడం స్థానిక విద్యార్థులకు గొప్ప అవకాశమని,ఈ విద్యాసంస్థ ఎంతోమంది విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పుస్తక ప్రదర్శన



ఖైరతాబాద్, నవంబర్ 20 (జనం సాక్షి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని ఖైరతాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటాన మస్)లో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. కళాశాల గ్రంథాలయ, సమాచార శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'జ్ఞానం సృజనాత్మకతను కలిసే చోట' అనే ఇతివృత్తంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.ప్రభు, భారత గ్రంథాలయ శాస్త్ర పితామహుడు డాక్టర్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాల వేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల విద్యా, వ్యక్తిగత వికాసంలో గ్రంథాలయాలు, పుస్తక పఠనం కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. సోషల్ మీడియా, డిజిటల్ మాధ్యమాలు, కృత్రిమ మేధస్సుపై అధికంగా ఆధారపడటం వల్ల విద్యార్థులు, అధ్యాపకుల్లో పఠనాసక్తి తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పుస్తక పఠనం, గ్రంథాలయ వనరుల వినియోగం ద్వారానే నిజమైన విజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు సాధ్యమవుతాయని తెలిపారు. కార్యక్రమ కన్వీనర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, గ్రంథపాలకుడు డాక్టర్ క్రోత విద్యాసాగర్ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న విస్తృత పుస్తక సంపదను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శనలో అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వివిధ అంశాలకు చెందిన పుస్తకాలను ఆసక్తిగా పరిశీలించారు.

నకిలీ విత్తనాల విక్రేతపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య

యాలాల, నవంబర్ 20 (జనం సాక్షి) : నాసిరకం వరి విత్తనాలు విక్రయించి రైతును మోసం చేసిన ఫర్టిలైజర్ దుకాణ యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసి, బాధిత రైతు కుటుంబానికి న్యాయం చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలి మల్కయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషనర్ మరియు సంచాలకుల కార్యాలయంలో అగ్రికల్చర్ డైరెక్టర్ డాక్టర్ బి. గోపిని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఉప్పలి మల్కయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు యు. బుగ్గప్ప మాట్లాడుతూ.. యాలాల మండలం దేవనూరు గ్రామానికి చెందిన రైతు మంత్రి ఎల్లప్పకు



గ్రామ శివారులోని సర్వే నంబర్ 66, 67 లలో 6 ఎకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. వరి సాగు కోసం వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణం సీసీఐ రోడ్డులోని గంజి సీవీ కాంప్లెక్స్‌లో ఉన్న 'లక్ష్మీ నరసింహ స్వామి సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్' దుకాణంలో బీపీటీ/అన్నపూర్ణ రకం వరి విత్తనాలను కొనుగోలు చేశారని తెలిపారు.వ్యవసాయ అధికారుల సూచనల మేరకు ఎరువులు, పురుగుమందులు వాడుతూ కష్టపడి సాగు చేసినప్పటికీ, విత్తనాలు నాసిరకంగా ఉండటం వల్ల పంట సరిగ్గా ఎదగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంకిలో గింజ పట్టక అసలు దిగుబడి రాలేదని, దీంతో మధ్యతరగతి రైతు లక్షలాది రూపాయల పెట్టుబడి నష్టపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారని పేర్కొన్నారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నకిలీ, నాసిరకం విత్తనాలు అమ్ముతున్న సదరు దుకాణ యజమానిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, సదరు ఫర్టిలైజర్ దుకాణం లైసెన్స్ రద్దు చేసి యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతు మంత్రి ఎల్లప్ప, పిట్ల లక్ష్మప్ప తదితరులు పాల్గొన్నారు.

పేదల వైద్యం పట్ల నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ప్రియాంక

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తూ వైద్య సిబ్బంది విధులు నిర్లక్ష్యం వహించకుండ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం ధన్వాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ ఆరో గ్య మందిర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే తెలంగాణ మోడల్ స్కూల్ ,జూనియర్ కళా శాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది హాజరు, స్టాకు వివరాలు తెలుసుకున్నారు. మోడల్ స్కూల్లో పదవ తరగతి క్లాస్ రూమ్ తనిఖీ చేసి, ఇంటర్ సెకండియర్ బైపీసీ బాటనీ క్లాస్ని తనిఖీ చేశారు. పిల్లలతో మాట్లాడి ఫ్యూచర్ ప్లాన్ గురించి విద్యార్థులను ఏమి అవు తారని తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థులు సాఫ్ట్వేర్ బి.టెక్, బి.ఎస్.సి నర్సింగ్ చేస్తాం అన్నారు విద్యార్థు లు.మెడికల్ కాలేజ్ నారా యణపేట్లో ఉంది అన్నా కలెక్టర్.10 గంటలు చది వితే మెడికల్ సీట్ వస్తాది అన్నారు.ఈరోజు ఎంతమంది గైర్హాజరయ్యా రని సిబ్బంది నీ అడిగారు. సాయంత్రం తనకు రిపోర్ట్ పంపాలని ఎంఈఓ ను ఆదేశించారు. కంప్యూటర్



సిస్టంలో ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ చూసి 13 మందిని నోటీసులు ఇవ్వా లని ఆదేశించారు. మిడ్ డే మీల్స్ మెనూ ప్రకారం తయారు చేయాలని ఏజె న్సీ వారికి ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న ఏజెన్సీని రద్దు చేయాలని ఎం.ఈ.ఓ నీ ఆదేశించారు. విద్యార్థు లు కష్టపడి చదవాలని ఎంతోమంది ప్రభుత్వ పాఠశాలలో చదివిన వారే అధికారులు ఉన్నత స్థాయి ని పొందారు అనితెలిపారు. ఉపాధ్యాయులు బోధన ఎలా చేస్తున్నారని అడిగా రు. భోజనం కమిటీ ఉందా అని కలెక్టర్ ప్రశ్నించారు. అలాగే మోడల్ స్కూల్ లేడీస్ హాస్టల్ ని తనిఖీ చేసి ఏర్పాట్లు వసతుల గురించి ఆరా తీశారు. అధికారులు తహసీల్దార్ యం. ఈ. ఓ. తదితరులు పాల్గొన్నారు.

మహదేవ్‌పల్లిలో ఘనంగా ఎక్స్-రే క్యాంప్

- టీబీ వ్యాధిపై అవగాహన, ఉచిత ఎక్స్-రే పరీక్షలు
- ప్రజలకు వైద్య సేవలు అందించిన పీహెచ్సీ కల్హేర్

కల్హేర్, నవంబర్ 20 (జనం సాక్షి) : కల్హేర్ మండలం మహదేవ్ పల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కల్హేర్ ఆధ్వర్యంలో ఉచిత ఎక్స్-రే క్యాంప్ ఘనంగా నిర్వహించారు.టీబీ వ్యాధిని ముందుగానే గుర్తించి, పూర్తిగా నిర్మూలించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఈ క్యాంప్ ను ఏర్పాటు చేశారు. ఈ క్యాంప్ లో గ్రామస్తులకు ఉచితంగా ఎక్స్-రే పరీక్షలు నిర్వహించి, టీబీ లక్షణాలపై అవగాహన కల్పించారు.పీహెచ్సీ కల్హేర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జెబా షహమీన్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది హాజరై పరీక్షలు నిర్వహించారు. దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రి చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరీక్ష చేయించుకోవాలని డాక్టర్ సూచించారు. టీబీ వ్యాధి పూర్తిగా నయం చేయదగిన వ్యాధి అని, ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని తెలిపారు.ఈ క్యాంప్ లో గ్రామంలోని



వృద్ధులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఎక్స్-రే పరీక్షలు చేయించుకున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అవసరమైన సలహాలు, మందులు అందించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ గ్రామం టీబీ రహితంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మి, పంచాయతీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్ వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయికి యువత దూరంగా ఉండాలి



రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, నవంబర్ 20 (జనంసాక్షి) : డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని షాద్‌నగర్ పట్టణ సీఐ సీతారాం సూచించారు. షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్, గంజాయి మహమ్మారిని తరిమికొడదాం'అనే నినాదంతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, తల్లిదండ్రుల ఆశలను వమ్ము చేయకుండా చదువుపై దృష్టి సారించాలని విద్యార్థులకు సలహాలు సూచనలు చేశారు. సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, తెలియని లింకులు, ఏపీకే ఫైళ్లను ఓపెన్ చేయవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండకుండా వాహనాలు నడపడం, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని షీటీం అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ కే.సీతారాం, ఎస్ఐ శ్రీకాంత్, షీ టీం,సభ్యులు సురేష్ గౌడ్, జ్యోతి, శ్రీకాంత్, శేఖర్, సైబర్ క్రైమ్ శ్రీనివాస్, ఏఎస్ఐ మురళీకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ సర్వేశ్వర్ రెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు ఆకాష్ నాయక్, ఫరూఖ్‌నగర్ మండల కార్యదర్శి అనిల్ నాయక్, ఉపాధ్యక్షులు శ్రీహరి, నరేష్, పవన్, విద్యార్థులు పాల్గొన్నారు..

కార్మికురాలిపై దాడి అమానుషం

- నిందితులను శిక్షించాలి



గద్వాల, నవంబరు 20 (జనం సాక్షి) : నల్గొండలో పారిశుద్ధ్య కార్మికురాలు రమణమ్మపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని సీఐటీయూ గద్వాల జిల్లా అధ్యక్షుడు ఉప్పేరు నరసింహ, రైతు సంఘం కార్యదర్శి వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఈ ఘటనను నిరసిస్తూ శుక్రవారం గద్వాల పాత బస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజారోగ్యం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసే పారిశుద్ధ్య కార్మికులకు రక్షణ కల్పించాలని కోరారు. పట్టణాలను పరిశు భ్రంగా ఉంచే శ్రామికుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, దాడులకు పాల్పడటం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు.సమాజం గౌరవించాల్సిన కార్మికులపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాధితురాలు రమణమ్మకు న్యాయం జరిగే వరకు కార్మిక సంఘాల పోరాటం ఆగదని హెచ్చరించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక, ప్రజా సంఘాల నాయకులు, పారిశుద్ధ్య కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా నారీ శక్తి దివస్ వేడుకలు

- ఝాన్సీ లక్ష్మీబాయి ఆశయాలను విద్యార్థుల్లో పెంపొందించాలి
- తపస్ జిల్లా మహిళా కన్వీనర్ విజయలక్ష్మి



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 20 (జనం సాక్షి) : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) సంగారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను మహిళా ఉపాధ్యాయుల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి తపస్ జిల్లా మహిళా కన్వీనర్ విజయలక్ష్మి మాతాజీ అధ్యక్షత వహించారు. విద్యార్థులను ఝాన్సీ లక్ష్మీబాయి వంటి ధైర్యసాహసాలు, దేశభక్తి కలిగిన గొప్ప వ్యక్తులుగా తీర్చిదిద్దాలని ఆమె ఉపాధ్యాయులకు సూచించారు. జహీరాబాద్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తకాపు శిరీష మాట్లాడుతూ మహిళల గొప్పతనాన్ని చాటేలా కార్యక్రమాన్ని పూర్తిగా మహిళల ఆధ్వర్యంలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్య అతిథులు అనసూయ రెడ్డి, లతారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో ఝాన్సీ లక్ష్మీబాయి పోషించిన పాత్రను వివరించారు. ప్రస్తుత సమాజంలో కుటుంబ వ్యవస్థ, పిల్లల పెంపకంలో వస్తున్న మార్పులు, చెడు ధోరణుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను దేశం గర్వించదగ్గ పౌరులుగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు.

శాస్త్రీయసాగుతో కంది పంటలో అధిక దిగుబడులు

- కంది పంటలో తెగుళ్ల నివారణపై రైతులకు దిశానిర్దేశం

ఝరాసంగం, నవంబర్ 20 (జనం సాక్షి) : ఝరాసంగం మండలం కృష్ణాపూర్ గ్రామంలో బాచుపల్లి విశాల్ రెడ్డి పొలంలో ఎస్‌బీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంది పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు, పంటలలో వచ్చే తెగుళ్లు, వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజర్ శుభదీప్ మండల్ మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించడం ద్వారా రైతులు సాగు పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయంలో శాస్త్రీయ పద్ధతులను పాటిస్తూ పంటల యాజమాన్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇక్రిసాట్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మమతా శర్మ మాట్లాడుతూ కంది పంటలో ఫ్యూజేరియం విల్ట్, ఫైటోప్తోరా బ్లైట్, స్టెరిలిటీ మోసాయిక్ వంటి వ్యాధుల వల్ల పంటకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ఈ వ్యాధులను ముందస్తుగా గుర్తించి సరైన సమయంలో నివారణ చర్యలు చేపట్టడం ద్వారా పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చని వివరించారు. రైతులు పంటను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వ్యాధుల లక్షణాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.ఏడీఏ వైద్యనాథ్ మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల ప్రభావం వల్ల కంది పంటలో వివిధ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. వాతావరణానికి అనుగుణంగా పంట యాజమాన్య చర్యలు చేపట్టడం, సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు పాటించడం ద్వారా పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తూ సాగులో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా విత్తన శుద్ధి, జీవ ఎరువుల వినియోగం, జీవ నియంత్రణ పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ విధానాలపై రైతులకు వివరించారు. ఈ పద్ధతులను పాటించడం వల్ల అనవసరమైన పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు తెగుళ్లు, వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టవచ్చని తెలిపారు. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు



చేయడం ద్వారా పంట దిగుబడిని పెంచుకొని రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని వివరించారు.రైతులకు ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించడం, సాగు ఖర్చులను తగ్గించడం, అధిక దిగుబడులు సాధించడం, రైతుల ఆదాయాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఈఓ సంపత్, జాబా జగదీష్, రామన్ గౌడ, అగ్రిబ్రిడ్జ్ కృషివాస్ ప్రతినిధి ఆదర్శ్ మురి,గ్రామ సర్పంచ్,రైతులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
21 నవంబర్ 2026

క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతాం

క్రీడల్లో రాణించి ప్రపంచమే మనవైపు చూసేలా ఆడాలి

- రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్ (జనంసాక్షి) :
క్రీడాకారుల భవిష్యత్తును తీర్చిదిద్దుతామని, అది తన బాధ్యత అని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. 70వ ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) రాష్ట్ర స్థాయి హాకీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్ 2026-27ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడా రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, విద్యార్థులను భవిష్యత్తులో గొప్ప క్రీడాకారులుగా తీర్చిదిద్దడమే తన బాధ్యత అని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహంతో రాష్ట్రంలో క్రీడా రంగ అభివృద్ధికి, ప్రతిభ కలిగిన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఖేలో ఇండియా క్రీడా పోటీలను తెలంగాణకు తీసుకురావడం తమ ప్రభుత్వ ఘనతగా మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో చిన్న స్థాయి క్రీడా టోర్నమెంట్లు జరిగినా స్వయంగా హాజరై క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నానని చెప్పారు. క్రీడల్లో రాణించాలంటే క్రమశిక్షణ, ఏకాగ్రత ఎంతో అవసరమని మంత్రి విద్యార్థులకు సూచించారు. ఆటలపై ప్రత్యేకమైన ఆసక్తి, పట్టుదల, కసి ఉండాలని, నిరంతర సాధనతోనే ఉన్నత శిఖరాలను చేరుకోగలమని ఆయన అన్నారు. ఒకప్పుడు పిల్లలు ఆటలు ఆడితే తల్లిదండ్రులు మందలించేవారని, ఇప్పుడు పిల్లలు ఆడకపోతే తల్లిదండ్రులే మందలించే పరిస్థితి రావడం క్రీడల పట్ల సమాజంలో పెరుగుతున్న అవగాహనకు నిదర్శనమని మంత్రి వ్యాఖ్యానించారు. క్రీడలు ఎవరి సొత్తు కాదని, ప్రతిభ, పట్టుదల ఉంటే ఎవరైనా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చెప్పారు. హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ ఉన్నత కుటుంబంలో జన్మించకపోయినా తన ప్రతిభ, కృషితో ప్రపంచస్థాయి క్రీడాకారుడిగా ఎదిగారని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో విద్యార్థులు కూడా లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. క్రీడాకారులకు సరైన సందర్భం, అవకాశం లభించడం అదృష్టమని, అలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. మీరు ప్రపంచం వైపు చూడకుండా.. ప్రపంచమే మీ వైపు చూసేలా ఆడాలని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. క్రీడల పట్ల పూర్తి ధ్యాస పెట్టి నిరంతరం సాధన చేస్తే రాష్ట్రానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురాగలరని మంత్రి వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు.

క్రీడా బడ్జెట్‌పై హరీశ్‌రావుకు సవాల్

క్రీడా రంగ అభివృద్ధిపై మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావుకు మంత్రి వాకిటి శ్రీహరి సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడలకు ఎంత బడ్జెట్ కేటాయించారు? తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత కేటాయించిందో బహిరంగంగా తెలుసుకోవాలని సూచించారు. క్రీడల అభివృద్ధి విషయంలో మాటలకు, చేతలకు మధ్య తేడా ఉందని, తమ ప్రభుత్వం క్రీడాకారులకు ప్రోత్సాహం, మౌలిక సదుపాయాలు, మెరుగైన అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తూ గ్రామీణ ప్రాంతాల నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు ప్రతిభ కలిగిన క్రీడాకారులను తయారు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులు క్రీడలను కేవలం ఆటలుగా కాకుండా జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశంగా భావించి కష్టపడాలని పిలుపునిచ్చారు.

ఆరోగ్య రంగంలో అగ్రగామిగా తీర్చిదిద్దుతాం

నిమ్స్, టిమ్స్ ఆసుపత్రుల్లో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులు

- హెల్త్‌కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ భేటీలో మంత్రి దామోదర్ రాజనర్సింహ వెల్లడి



హైదరాబాద్ (జనంసాక్షి) : ఆరోగ్య రంగంలో తెలంగాణను ప్రపంచానికి ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు, హాస్పిటళ్ల యాజమాన్యాలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు ఉన్న వైద్యరంగ సామర్థ్యాన్ని మరింత విస్తరించి, మెడికల్ టూరిజంలో నగరాన్ని గ్లోబల్ హబ్‌గా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. సెక్రటేరియట్‌లో గురువారం నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ హెల్త్ కేర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు ఆరోగ్య రంగాల్లో వస్తున్న మార్పులు, తెలంగాణలో వైద్య సేవల విస్తరణ, మెడికల్ టూరిజం అభివృద్ధి, వైద్య విద్య, నైపుణ్యాల పెంపు తదితర అంశాలపై చర్చించారు. తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ప్రపంచస్థాయి వైద్య నిపుణులు, అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. వీటిని సమన్వయం చేసుకుంటూ అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌లో హెల్త్‌కేర్ రంగ ప్రతినిధులంతా భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ మెడికల్ టూరిజం సేవలు

మెడికల్ టూరిజం అభివృద్ధికి ప్రైవేటు రంగంతోపాటు ప్రభుత్వ హాస్పిటళ్లలోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. సనత్‌నగర్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్, నిమ్స్, అల్వాల్ టిమ్స్, కొత్తపేట టిమ్స్‌లలో ఇంటర్నేషనల్ మెడికల్ టూరిజం వార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్పిటళ్లలో ఉన్న అత్యుత్తమ వైద్య నైపుణ్యాలు, మౌలిక సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా విదేశీ రోగులకు కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చన్నారు. ఇందుకోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మెడికల్ టూరిజం అభివృద్ధి కోసం ఆరోగ్యశాఖలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సమావేశంలో పాల్గొన్న డాక్టర్లు మంత్రిని కోరారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించారు. అంతర్జాతీయ రోగులకు అవసరమైన సేవలు, సమన్వయం, ఇతర సదుపాయాలను ఒకే వ్యవస్థ ద్వారా అందించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామని కొందరు ప్రైవేటు హాస్పిటళ్ల డాక్టర్లు తెలిపారు. కేన్సర్ చికిత్సను జిల్లా స్థాయిలోనే అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రతి జిల్లాలో కీమోథెరపీ సెంటర్లు ఏర్పాటు చేయడాన్ని, డయాలసిస్ సెంటర్ల నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ కిడ్నీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషిని డాక్టర్లు ప్రశంసించారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫార్మా వైస్ ప్రెసిడెంట్, కౌన్సిల్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కొండపల్లి సాహితి, కిమ్స్-సన్‌షైన్ ఎండీ డా. గురువా రెడ్డి, ఫిక్కీ మెంబర్ సర్జన్ డా. విజయ్ కుమార్, రెయిన్‌బో హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా. ప్రశాంత్, యూఎన్ మాజీ అధికారి డాక్టర్ శివ దుబిశెట్టి, యశోద హాస్పిటల్ ప్రతినిధి డా. దశరథ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట సమీపంలో రోడ్డు ప్రమాదం

స్కూటీని టిప్పర్ ఢీ కొట్టడంతో ఇద్దరు గురుకుల టీచర్లు మృతి



సూర్యాపేట (జనంసాక్షి):
సూర్యాపేట జిల్లా కేంద్రం సమీపంలోని బీబీగూడెం వద్ద శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.స్కూటీని టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు.మృతులు చివ్వెంల మండల కేంద్రంలోని మినీ గురుకులం ప్రిన్సిపాల్ రజిత రెడ్డి, అదే గురుకులంలోని ఫ్యాకల్టీగా పనిచేస్తున్న రక్మ గా పోలీసులు గుర్తించారు.ఘటనా స్థలాన్ని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు. మృతదేహా లను జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.మృతులు ఇరువురు సామాన్య కుటుంబం నుండి వచ్చి కష్టపడి చదివి ఉద్యోగం సంపాదించారని, జీవితంలో స్థిరపడే సమయంలో ఆకాల మృత్యువాత పడటంతో వారి కుటుంబాలలో విషాదఛాయలు అలముకున్నాయి.

రోడ్డు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జిల్లా ఎస్పీ నరసింహ



సూర్యాపేట పట్టణ రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీబీగూడెం కాలువ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని జిల్లా ఎస్పీ నరసింహ పరిశీలించారు.ఈ ప్రమాదంలో ఇద్దరు ఉపాధ్యాయులను కోల్పోవడం అత్యంత బాధాకరమని ఎస్పీ విచారం వ్యక్తం చేశారు. ఇలాంటి ప్రమాదాలు జరగడం దురదృష్టకరమని, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. వాహనదారులు ప్రయాణ సమయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లు ఇతర నాలుగు చక్రాల వాహనాలు నడిపేవారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని తెలిపారు.వాహనం నడిపేటప్పుడు ముందు వెళ్తున్న వాహనాలతో పాటు వెనుక నుంచి వచ్చే వాహనాల కదలికలను కూడా గమనిస్తూ జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలని కోరారు.ప్రయాణ సమయంలో డిఫెన్సివ్ డ్రైవింగ్ విధానాన్ని అలవర్చుకోవాలని, ఇతర వాహనదారుల తప్పిదాలను కూడా ముందుగానే అంచనా వేస్తూ ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అజాగ్రత్త కారణంగా విలువైన ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.అనంతరం ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని టౌన్ సీఐకు సూచించారుప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తగిన పోలీస్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ప్రతి ఒక్కరి ప్రాణం విలువైనదని, మీ కుటుంబం మీ కోసం ఎదురుచూస్తోందని అన్నారు.రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు.ప్రమాద స్థలాన్ని పరిశీలించిన వారిలో సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, టౌన్ సీఐ వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు

ఏఐ, పరిశోధనలకు అంతర్జాతీయ కేంద్రంగా హైదరాబాద్

అంతర్జాతీయ భాగస్వామ్యాలకు అత్యంత ప్రాధాన్యం

- పెట్టుబడులకు తెలంగాణ అత్యంత అనుకూలం
- ఐరాస వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్‌బాబు




హైదరాబాద్ (జనంసాక్షి) : హైదరాబాద్‌ను కృత్రిమ మేధ (ఏఐ), పరిశోధన, సాంకేతిక ఆధారిత వ్యాపారాలకు అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా 1వీ1డీ సంస్థ నిర్వహించిన గ్లోబల్ ఇంపాక్ట్ సమ్మిట్‌లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. తెలంగాణలో ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్, ఏఐ, అధునాతన తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను అంతర్జాతీయ ప్రతినిధులకు ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. తెలంగాణ ఇప్పటికే ఐటీ, లైఫ్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్స్ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు సాధించిందని, ప్రస్తుతం ఏఐ, అధునాతన తయారీ సహా నూతన సాంకేతిక రంగాల్లోనూ వేగంగా విస్తరిస్తోందన్నారు. ప్రతిభావంతులైన యువత, పరిశ్రమలకు అనుకూలమైన విధానాలు, బలమైన పారిశ్రామిక పునాదులు రాష్ట్రానికి ప్రధాన బలమని తెలిపారు. సాంకేతిక అభివృద్ధి కేవలం ఆర్థిక వృద్ధికే పరిమితం కాకుండా ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐ, డిజిటల్ ఆవిష్కరణలను వైద్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి వంటి రంగాల్లో వినియోగించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కారాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సాంకేతిక ప్రగతి, ఆవిష్కరణలు, మానవాభివృద్ధి సమాంతరంగా సాగినప్పుడే సమాజానికి నిజమైన ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రభుత్వాలు, పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, అంతర్జాతీయ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే బలమైన ఆవిష్కరణల వ్యవస్థ ఏర్పడుతుందన్నారు. ఆ దిశగా తమ ప్రభుత్వం ఇన్నోవేషన్ ఆధారిత ఎకో సిస్టంను రాష్ట్రంలో అభివృద్ధి చేస్తోందన్నారు. యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలు అందించడంతో పాటు, వారి ఆలోచనలను ప్రపంచస్థాయి ఆవిష్కరణలుగా మలిచేందుకు అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టి... రైజింగ్ తెలంగాణ లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని మంత్రి శ్రీధర్ బాబు పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాల అభివృద్ధి, వినియోగంలో అంతర్జాతీయ భాగస్వామ్యాలకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

ఇందిరమ్మ బీమా.. ప్రతి కుటుంబానికి ధీమా

బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది

- అర్హులైన కుటుంబ సభ్యులందరికీ బీమా అవకాశం
- ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్



హైదరాబాద్ (జనంసాక్షి) : ఇంటి పెద్దకు అనుకోని ప్రమాదం లేదా మరణం సంభవించినప్పుడు బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని ప్రభుత్వ విప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన మరో కీలక పథకమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అని తెలిపారు. ఈ పథకానికి సంబంధించిన బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని, లబ్ధిదారులు ఎలాంటి ప్రీమియం చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఒకే కుటుంబంలో ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదనపరులు ఉన్నప్పటికీ, అర్హతల ఆధారంగా వారందరికీ బీమా పొందే అవకాశం ఉంటుందని వివరించారు. అలాగే ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మందిని నామినీలుగా ఎంపిక చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందన్నారు. కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ప్రభుత్వ విప్ పేర్కొన్నారు.

బతుకుదెరువు కోసం వలసలు!

సిర్గాపూర్ మండలం వాసర్ ప్రాంత గిరిజన తండాల నుండి మనూర్, జహీరాబాద్ కు తరలివెళ్తున్న కుటుంబాలు



సిర్గాపూర్, నవంబర్ 20 (జనంసాక్షి):
స్థానికంగా వ్యవసాయ పనులు, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం వాసర్ ప్రాంత గిరిజన తండాల ప్రజలు బతుకుదెరువు కోసం గురువారం వలస పయనమయ్యారు.పలు తండాల గిరిజనులు తమ కుటుంబాలతో పాటు సామగ్రిని ఎడ్లబండ్లపై వేసుకొని చెరకు నరికే పనుల కోసం మనూర్, జహీరాబాద్ ప్రాంతాలకు తరలివెళ్లారు. ఎడ్లబండ్ల పరుసతో రోడ్డంతా కళకళలాడింది.ఏటా ఇదే తరహాలో ఉపాధి కోసం పొట్టచేతపట్టుకొని పొరుగు ప్రాంతాలకు వలస వెళ్తున్నామని తండావాసులు ఆవేదన వ్యక్తం చేశారు. వలస వెళ్లిన ప్రాంతాల్లో చెరకు నరికే పనులు, కూలి పనులు చేసుకుంటూ కొన్ని నెలల పాటు అక్కడే ఉంటామని, తిరిగి పనులు ముగిశాక స్వగ్రామాలకు చేరుకుంటామని తెలిపారు.స్థానికంగా ఉపాధి కల్పిస్తే వలసలు వెళ్లాల్సిన అవసరం ఉండదని, ప్రభుత్వం గిరిజన తండాల్లో ఉపాధి అవకాశాలు కల్పించాలని గిరిజనులు కోరుతున్నారు.

ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వండి

- ప్రభుత్వ సూచనలు ప్రజలు తప్పకుండా పాటించాలి
- రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్
- కొండగట్టు అంజన్నను దర్శించుకున్న స్పీకర్, మంత్రి అడ్లూరి, ఎమ్మెల్యేలు



మల్యాల (జనంసాక్షి) : ఎల్ నినోను ఎదుర్కొనే శక్తిని ప్రజా ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించాలని కొండగట్టులోని ఆంజనేయ స్వామిని వేడుకున్నట్లు రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. శుక్రవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం చైర్మన్ నర్సింగరావు, జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తో కలిసి కొండగట్టు ఆంజనేయ స్వామిని స్పీకర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు స్పీకర్‌తో పాటు మంత్రి లక్ష్మణ్ కుమార్ కి పపూర్ణకుంభంత స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. ప్రపంచానికి సవాలుగా మారిన ఎల్ నినోను సమర్థవంతంగా ఎదుర్కొనే శక్తిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రజా ప్రభుత్వానికి అందించాలని కొండగట్టు ఆంజనేయ స్వామిని కోరుకున్నట్లు తెలిపారు. 60 ఏళ్లకు ఒకసారి జరిగే చందనోత్సవంలో పాల్గొనడం అదృష్టమన్నారు. ఎల్ నినో ప్రభావంతో వస్తున్న కరువును గుర్తించిన ప్రభుత్వం చేస్తున్న సూచనలను ప్రజలు తప్పకుండా పాటించాలని ఈ సందర్భంగా కోరారు. కొండగట్టు ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి ప్రత్యేక నిధులు సాధిస్తామని స్పీకర్ తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370